పు రా ణ ము లు

= శ్రీ తెన్నేటి విశ్వనాథం =

పూర్వకాలమునకు సంబంధించినది; పూర్వము జరిగినది; పూర్వమందు జరుపబడ్డది; తీసికొనిపోబడినది; జరిగినది; పాతబడి క్షీణదశకుకూడ వచ్చిన విషయము—ఇన్ని భావాలు పురాణము అనే శబ్దముయొక్క ఉత్పత్తిలో ఉన్నవి. పాణినినాటికే 'పురాణం' చాలా పాతకాలంనాటిది అయిందని "పురాణ ప్రోక్తేషు బ్రాహ్మణకల్పేషు; పూర్వకాలైక సర్వజరత్పురాణ నవకేవలాః సమానాధికరణేన; పురా భవమితి పురాటుచ్" అని వివిధంగా ఆయన చెప్పిన వ్యుత్పత్తినిబట్టి తెలుస్తుంది. పురాణం అనే శబ్దము వినేసరికి పూర్వకాలపు కథలు, అవి గల గ్రంథములు అని సహజంగా స్ఫురిస్తుంది.

వైదిక గ్రంథాలు చూచినట్లయితే పురాణములు చాలా పురాతనమైనట్లు కనిపిస్తుంది.

పురాణముయొక్క ప్రసంగం

అథర్వవేదము, శతపథ బ్రాహ్మణము, బృహదారణ్యక, ఛాందోగ్య ఉపనిషత్తులు, తైత్తిరీయారణ్యకము, మహాభాష్యము, ఆశ్వలాయన గృహ్యసూత్రములు, ఆపస్తంబసూత్రములు, మనుసంహిత, రామాయణము, మహాభారతము మొదలగు పూర్వగ్రంథములందు 'పురాణము' విషయమయి ప్రసంగము ఉన్నది.

అథర్వవేదం ౧౧(౭)౨౪—

ఋచః సామాని ఛందాంసి పురాణ్యజుషా సహ
ఉచ్ఛిష్టా జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః.

తథా స బృహతీం దిశ మనువ్యచలత్, త మితిహాసశ్చ పురాణంచ, గాథాశ్చ నారాశంసీశ్చ అనువ్యచలన్. (౧౧) ఇతిహాసస్యచవై, పురాణస్యచ గాథానాంచ నారాశంసీనాంచ ప్రియం ధామ భవతి య ఏవం వేద. (అథర్వ కా. ౧౫ అను ౧ ప్ర ౬ మం ౧౨).

అంటే యజ్ఞముయొక్క ఉచ్ఛిష్టముద్వారా ఈశ్వరునిచేత యజుర్వేదముతోపాటు ఋక్కు, సామములు, ఛందస్సులు, పురాణమున్ను ప్రకటమయినవి. వేదాలు ముందు వస్తూంటే పురాణాలు మొదలయినవి వాటిని అనుసరించివచ్చాయి. ఇతిహాసాలు, పురాణాలు, గాథలు నరులయొక్క చరిత్రలకు పవిత్రమైన వసతిగృహాలవంటివి:

"ఏవమిమే సర్వే వేదా నిర్మితాః సకల్పాః సరహస్యాః సబ్రాహ్మణాః సోపనిషత్కాః సేతిహాసాః సాన్వయాఖ్యాతాః సపురాణాః సస్వరాః..."
(గోపథబ్రాహ్మణము ౨-౧)

వేదాలతోపాటే పురాణాలు వచ్చాయి.

"ఏవంవా అరే అస్య మహతో భూతస్య నిశ్వసితమేత ద్య దృగ్వేదో యజుర్వేదః సామవేదో థర్వాంగిరస ఇతిహాసః పురాణం విద్యా ఉపనిషదః" ...౨ (౪) ౧౧.

ఈ మహాభూతంయొక్క నిశ్వాసమునుండి ఋగ్వేదాదులు, పురాణము మొదలయినవి ఉత్పన్నములయినాయని వున్నది.

ఛాందోగ్యంలో తాను చదివినవాటినిగురించి నారదుడు—

"సహోవాచ ఋగ్వేదం భగవో ధ్యేమి; యజుర్వేదం సామవేద మథర్వణం చతుర్థ మితిహాసపురాణం పంచమం వేదానాం వేదమితి"(౭-౧) అని చెప్పేడు.

పురాణం పంచమవేదం అనికూడా భావం.

శతపథబ్రాహ్మణంలో పురాణంయొక్క అధ్యయనం ఉన్నది.

"ఏవం విద్వాన్ వాకోవాక్య మితిహాసః పురాణమి త్యహరహః స్వాధ్యాయ మధీతే త ఏవం తృప్తాః తర్పయన్తి సర్వైః కామైః సర్వైః భోగైః" ౧౧ (౬) ౨ (౯)

వైదికకాలం

కాబట్టి పురాణము సనాతనమైనది. అయితే వైదికకాలానికితర్వాత వ్యాసులవారు ఉండేవారు; వారు పురాణాలు వ్రాశారు అని ప్రసిద్ధి. మీద చెప్పిన పురాణాలు, వ్యాసులవారు వ్రాసిన పురాణాలు ఒకటేనా, భిన్నమైనవా?

దేవాసురుల యుద్ధానికి ఇతిహాసం అని పేరు. "అసద్వా ఇద మగ్రఆసీత్" ఇత్యాది. జగత్తుయొక్క ఆరంభావస్థతరువాత సృష్టిక్రమముయొక్క వివరణకు పురాణం అని సాయనాచార్యుడు ఐతరేయబ్రాహ్మణానికి భాష్యంలో వ్రాశాడు.

ఊర్వశియొక్క కథ మొదలైన బ్రాహ్మణాలలో వాక్యాలు ఇతిహాసమనిన్ని, "అసద్వా..." అనేవి పురాణమనిన్ని శంకరాచార్యులుకూడ బృహదారణ్యక భాష్యంలో వ్రాశారు.

వైదికయుగంలో సృష్టిప్రక్రియావివరణ మూలకమైన పురాణం ఉండేదన్నమాట స్పష్టము.

ప్రమాణం

వాత్స్యాయనుడు "మంత్రాల యొక్కయు, బ్రాహ్మణాలయొక్కయు (ప్రవక్తలు) ఇతిహాసపురాణాలనుకూడ సంస్థాపనచేశారు. యజ్ఞాలకు మంత్రాలు బ్రాహ్మణాలు ఏలాగునో, లోకవృత్తికి ఇతిహాసపురాణాలున్ను, లోకవ్యవహారానికి ధర్మశాస్త్రాలున్ను అలాగునే ప్రమాణాలు" అని సూచించాడు. (న్యాయసూత్రభాష్యం, ౪ (౧) ౬౨)

సృష్టి మొదలగువాటి కథనము పురాణముయొక్క ముఖ్యలక్షణమని తేలుతూంది.

లక్షణము : వస్తువ

విష్ణుపురాణం, బ్రహ్మాండపురాణం మొదలయినవాట్లో—

"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ
వంశానుచరితంచైవ పురాణం పంచలక్షణమ్"

సర్గ మంటే సృష్టితత్వము. ప్రతిసర్గ మంటే లయము. వంశం అంటే దేవతల తాలూకు, పితరుల తాలూకు వంశావళి. మన్వంతరములు అంటే ఏయే మనువు ఎంతకాలం అధికారమువహించాడు, వహిస్తాడు, ఆసమయంలో జరిగిన విషయాలున్ను, సూర్యచంద్రవంశాల రాజులు, వారి జీవితాలున్ను. రామాయణం బాలకాండలో సుమంతుడు (సూతుడు) దశరథునితో—

"ఏత చ్ఛ్రుత్వా రహః సూతో
రాజాన మిద మబ్రవీత్
శ్రూయతాం య త్పురావృత్తం
పురాణేషు మయా శ్రుతమ్."

అని అన్నాడు.

మహాభారతం ఆదిపర్వములో—

"పురాణేహి కథా దివ్యా ఆదివంశాశ్చ ధీమతాం
కథ్యంతే యే పురాస్మాభిః శ్రుతపూర్వాః
పితు స్తవ."

శౌనకుడు అనగా, ఉగ్రశ్రవుడు—

"ఇమం వంశామహం పూర్వం
భార్గవం మహామునే
నిగదామి యథాయుక్తం
పురాణాశ్రయ సంయుతం" ౫ (౬-౭)

ఆదిపర్వంలోనే, నీ పుత్రుడిలాగే, పురు, కురు మొదలయినవారు వేలకొద్ది రాజులు విపులమయిన భోగాలను విడిచిపెట్టి వెళ్లేరు. వారి గుణాలు, కర్మలు "కథ్యతే లోకే పురాణే కవిసత్తమైః" అని ౧ (౨౪)

శ్లోకములో వ్రాసినదానినిబట్టి మహాభారతకాలం నాటికే భిన్నలక్షణాలతో, అనేకమంది కవిసత్తములు వ్రాసిన పురాణములు ఉన్నట్లు స్పష్టమవుతుంది.

మనుస్మృతిలో "స్వాధ్యాయం శ్రావయే త్పిత్ర్యే ధర్మశాస్త్రాణి, ఆఖ్యానాని, ఇతిహాసాంశ్చ పురాణాని అఖిలానిచ" ౩ (౨౩) అని ఉన్నది.

ఆశ్వలాయన గృహ్యసూత్రాల్లో "ఆయుష్మతాం కథాః కీర్తయన్తో మాంగల్యా నీతిహాస పురాణానీ త్యాఖ్యాపయమానాః" ౪ (౬) అని మంగళప్రదమైన కథలు పురాణాల్లో ఉన్నాయని ఉన్నది.

కాబట్టి ఇప్పటికి తేలిన విషయం : ఏ విధంగా ఈశ్వరానుగ్రహంచేత వేదాలు ఋషుల హృదయములో ఆవిర్భవమయినవో, ఆ దేవిధముగా పురాణములున్నూ వారి హృదయాల్లో ఆవిర్భవించినవి.

వి స్త ర ము

పురాణములు ఎన్ని అనేది మహాభారతం మను, మహాభాష్య, వాల్మీకి, ఆశ్వలాయనసూత్రములు మొదలయినవి చూచితే తేటపడుతుంది.

రేవామహాత్మ్యంలో —
"పురాణ మేక మేవాసీ దస్మిన్ కల్పాంతరే నృప
త్రివర్గసాధనం పుణ్యం శతకోటిప్రవిస్తరమ్.
స్మృత్వా జగాద చ మునీ న్ప్రతిదేవ శ్చతుర్ముఖః
ప్రవృత్తిః సర్వశాస్త్రాణాం పురాణస్యాభవ త్తతః
కాలేన గ్రహణం దృష్ట్వా పురాణస్య తతో నృప
వ్యాసరూపం విభుం కృత్వా సంహరే త్సయుగే యుగే
చతుర్లక్షప్రమాణేన ద్వాపరే ద్వాపరే సదా
త దష్టాదశధా కృత్వా భూర్లోకేస్మి న్ప్రభాషతే
అద్యాపి దేవలోకే త చ్ఛతకోటిప్రవిస్తరం
తదర్థోత్ర చతుర్లక్షః సంక్షేపేణ నివేశితః
పురాణాని దశాష్టాచ సాంప్రతం తదిహోచ్యతే"
౧ (౨౩) ౩౦

మొదటిలో శతకోటివిస్తరమైన పురాణం ఉండేదనిన్నీ, రానురాను చదువుకొందుకు వీలుగా ఉండాలనని ద్వాపరయుగంలో వ్యాసుడు దీనినే నాలుగులక్షలగ్రంథముక్రింద సంక్షేపపరిచి ౧౮ పురాణములుగా చేశాడనీ దీనివల్ల తెలుస్తుంది.

రేవాఖండంలోనున్నదే పద్మపురాణంలో సృష్టిఖండంలోను ౧-వ అధ్యాయంలో చెప్పబడింది. కాబట్టి వ్యాసుడే ౧౮ పురాణాలకు కర్త, వక్త.

వ్యాసుని కర్తృత్వము

అయితే ఒకడే కవి వ్రాసినట్లయితే, పురాణాలలో భేదాలున్నాయిగదా, వాటివిషయమయి ఏమి చెప్తారు అని విమర్శన ఉంది. విష్ణు, భాగవత, బ్రహ్మవైవర్త పురాణాల్లో శైలికూడ వేరువేరుకవుల వ్రాతలాగు వున్నదనికూడ అంటారు.

మత్స్యపురాణం ౫౩ అధ్యాయంలో —
"పురాణ మేక మేవాసీ త్తదా కల్పాంతరేఽనఘ
త్రివర్గసాధనం పుణ్యం శతకోటిప్రవిస్తరం
నిర్దగ్ధేషుచ లోకేషు వాజిరూపేణవై మయా
అంగాని చతురో వేదాః పురాణం న్యాయవిస్తరం
మీమాంసా ధర్మశాస్త్రంచ పరిగృహ్య మయా కృతం
మత్స్యరూపేణచ పునః కల్పాదా వుదకార్ణవే
అశేష మేత త్కథిత ముదకాంతర్గతేనచ
శ్రుత్వా జగాదచ మునీ న్ప్రతిదేవా శ్చతుర్ముఖః"

* * *

"బ్రహ్మణాభిహితంపూర్వం యావన్మాత్రం మరీచయే
బ్రాహ్మం త్రిదశసాహస్రం పురాణం పరికీర్త్యతే
వారాహకల్పవృత్తాంత మధికృత్య పరాశరః
యత్ప్రాహ ధర్మానఖిలాన్ తదుక్తం వైష్ణవం విదుః
శ్వేతకల్పప్రసంగేన ధర్మాన్ వాయురిహాబ్రవీత్ [తం
యత్ర తద్వాయవీయంస్యా ద్రుద్రమాహాత్మ్యసంయుతం
యత్రాహ నారదో ధర్మాన్ బృహత్ కల్పాశ్రయాణిచ
పంచవింశత్సహస్రాణి నారదీయం తదుచ్యతే
మార్కండేయేన కథితం తత్సర్వం విస్తరేణతు
పురాణం నవసాహస్రం మార్కండేయ మిహోచ్యతే
వసిష్ఠాయాగ్నినా ప్రోక్త మాగ్నేయం తత్ప్రచక్షతే".

దీని భావం—మొదటిలో ఒకటే పురాణం ఉండేది. అది శతకోటిశ్లోకవిస్తారమైనది. లోకములు ఒకప్పుడు దగ్ధమైనప్పుడు బ్రహ్మ 'వాజిరూపంతో నాలుగు వేదాలను, వాటిఅంగాలను న్యాయమీమాంస ధర్మశాస్త్రాలను గ్రహించి కల్పాదిని తిరుగ మత్స్య రూపముతో జలమందు అంతర్గతమయి అన్నిటిని చెప్పాడు.

మరీచితో బ్రహ్మ చెప్పినట్లు బ్రహ్మపురాణం ౧౩,౦౦౦ శ్లోకములు గలది; వరాహకల్పము యొక్క వృత్తాంతము పరాశరుడు సంగ్రహించి చెప్పినది విష్ణుపురాణము. శ్వేతకల్పవృత్తాంతము రుద్రమాహాత్మ్యము వాయుపురాణంక్రింద వాయువు చెప్పేడు. బృహత్కల్పములో నానాధర్మాలు నారదుడు చెప్పినది నారదపురాణం; ౨౫౦౦౦ శ్లోకములు గలది. మార్కండేయుడు చెప్పినది ౯౦౦౦ శ్లోకములు గలది మార్కండేయపురాణము. అగ్నిదేవుడు వసిష్ఠునకు చెప్పినది అగ్నిపురాణం. ఈలాగువనే, అఘోరకల్ప(మందు) వృత్తాంతము ఆదిత్యునికి బ్రహ్మ చెప్పినది భవిష్యపురాణం. రథంతరకల్పవృత్తాంతము సావర్ణుడు చెప్పినది బ్రహ్మవైవర్తపురాణము. మహేశ్వరుడు లింగపురాణము చెప్పేడు.

బ్రహ్మాండపురాణంలో కూడ,

"పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాస్మృతం
అనంతరంచ వక్త్రేభ్యో వేదా స్తస్య వినిర్గతాః"

వేదాలకన్న కూడ పురాణం ముందు ప్రచారంలో ఉన్నట్టు దీని సూచన. మొదట బ్రహ్మవల్ల మునులు విని, ప్రత్యేకకల్పాలలో వేరువేరు దేవతలు, మునులు వేరువేరుగ ఆయా పురాణసంహితలను నిర్మించినట్లు దీనివల్ల మనకు బోధపడుతూంది.

భేదాలు : కారణం

ఆయా ఋషులు ఆయాకల్పములలో రచించిన పురాణాలనే వ్యాసుడు సంక్షేపముచేసి, ఆ ఋషులు వ్రాసిన అంశములనుమాత్రము ఆలాగువనే, అనగా వారు వ్రాసినట్లుగానే ఉంచివేశాడు. అయితే సంక్షేపముచేస్తున్నప్పుడు వృత్తాంతాలు, ప్రసంగాలు కలియడానికి తన స్వంతరచన మధ్యమధ్య చేసియుంటాడు అని ఊహించవచ్చును. పురాణముల్లో పేరుభేదంగాని, సంఖ్యభేదంగాని ఉన్నట్లయితే, ఆయాపురాణాలు వేరువేరుకల్పాల్లో ఉత్పన్నమైనట్లు ఊహించాలి.

క్వచిత్ క్వచిత్ పురాణేషు విరోధో యది లభ్యతే,
కల్పభేదాదిభిః తత్ర వ్యవస్థా సద్భి రిష్యతే.

అని ఉన్నది. మత్స్యపు. ౫౩ (౫౯)లో ఈ లోకహితార్థము పరమఋషిచేత సంక్షేపము చేయబడ్డది అని వ్రాసిఉన్నది. కాబట్టి వ్యాసుడు ఏవిధంగా వక్త, కర్త అయ్యేడో స్పష్టమయింది. ఎందుకు శైలీభేదాలున్నాయోగూడా తేలింది.

విష్ణుపురాణంలో (౩: ౬: ౧౬-౩౧)—

ఆఖ్యాయనైరుపాఖ్యానైః గాథాభిః కల్పశుద్ధిభిః
పురాణసంహితాం చక్రే పురాణార్థవిశారదః
ప్రఖ్యాతో వ్యాసశిష్యోభూ త్సూతో వై రోమహర్షణః
పురాణసంహితాం తస్మై దదౌ వ్యాసో మహామునిః

* * *

ఆద్యం సర్వపురాణానాం పురాణం బ్రాహ్మముచ్యతే
అష్టాదశపురాణాని పురాణజ్ఞః ప్రచక్షతే.

ఆఖ్యాన ఉపాఖ్యాన గాథ కల్పశుద్ధితో పాటు పురాణసంహిత వ్రాశాడు. వ్యాసునికి లోమహర్షణుడు అనే శిష్యుడుండేవాడు; అతనికి ఈసంహితను వ్యాసుడు ఇచ్చాడు. లోమహర్షునికి ఆరుగురు శిష్యులుండేవారు. సుమతి, అగ్నివర్చ, మిత్రాయు, శాంసపాయన, అకృతవర్ణ, సావర్ణ అని. ఇందులో కాశ్యపవంశీయుడైన అకృతవర్ణుడు, సావర్ణి, శాంసపాయనుడు అనే ముగ్గురు మూలసంహితను అవలంబించి ఒక్కొక్కరు ఒక్కొక్క సంహిత తిరిగివ్రాశారు. ఈ నాలుగుసంహితలయొక్క సారము విష్ణుపురాణము అని దీని భావము.

బ్రహ్మాండపురాణంలో కూడ ఈ నాలుగుసంహితల ప్రసంగము ఉన్నది. కొంతమంది బ్రాహ్మ

పురాణ మీపదని అలంకరిస్తున్నదని అంటారు అని శ్రీధరస్వామి వ్రాశాడు.

స్వయంగా తెలిసిన విషయం వ్రాస్తే ఆఖ్యానం; ఇతరులవల్ల విన్నదాన్ని వ్రాస్తే అది ఉపాఖ్యానం; పితృవిషయములున్నూ, పరలోకవిషయములున్నూ, కుల కర్మలగురించి వ్రాసిన వాటిని గాథలనిన్నీ, శ్రాద్ధ కథాదినిర్ణయాలనుగురించి వ్రాసినదాన్ని కల్పశుద్ధిఅనిన్నీ అంటారు.

పురాణాలు ప్రచారంకాకముందు ఒక్క ఋగ్వేదంమాత్రం ఉండేది. ఆవేదాన్నే వ్యాసుడు నాలుగు భాగాలుగా విభాగించేడు. ఆవిధంగానే పురాణాలను కూడ విభాగంచేశాడు. అందుచేతనే విష్ణుపురాణం ఆరంభంలో ౧౮ పురాణాల పేర్లు ఉన్నాయి.

బ్రహ్మ, పద్మ, విష్ణు, శైవ, భాగవత, నారదీయ, మార్కండేయ, అగ్ని, భవిష్య, బ్రహ్మవైవర్త, లింగ, వారాహ, స్కంద, వామన, కూర్మ, మత్స్య, గరుడ, బ్రహ్మాండ.

వీటి అన్నిటిలో సర్గ ప్రతిసర్గ వంశ మన్వంతర వంశానుచరితములున్నూ చెప్పబడిఉన్నాయి.

లేకుంటే బృహద్విష్ణుపురాణం అనే పేరుతో సకలపురాణసంహిత ఒకటి అయి ఉండిఉండాలి; అందులోనుండి ప్రస్తుతవిష్ణుపురాణం విడతీయబడి ఉండాలి.

బ్రహ్మ మొదలు చెప్పినప్పుడు ఒకటే పురాణమనిన్నీ, దానిని ౧౮ భాగములుగా వ్యాసుడు సంక్షేపం చేశాడనిన్నీ, తరువాత సూతుడూ ఆయనగారిశిష్యులూ దానిని విభాగంచేసి అక్కడక్కడ సంస్కారం కూడ చేశారనీ ఒక ఊహకూడ ఉన్నది.

సృష్టిప్రక్రియకు సంబంధించిన విషయాలు కొంచెము హెచ్చుతగ్గుగా విష్ణు, మత్స్య, బ్రహ్మాండ, పద్మ మొదలైన పురాణములన్నిటిలో ఒక్కమోస్తరు గానే ఒకే మోస్తరుశ్లోకములలో, సాదృశ్యముయిన భాషలో ఉన్నవి. దీనికి కారణం ఒక సంహితను విడతీయుటే అని ఊహించాలి. ఉపాసకాభేదముచేత ౧౦ పురాణములక్రింద ప్రథమంలో ఉన్న ఒక్క ఆదిసంహితయే తరువాతవిభాగింపబడినదని స్పష్టమగుచున్నది.

అయితే విష్ణుపురాణంలో ఉన్న సృష్టిక్రమ వర్ణనక్రమం అన్నిపురాణాల్లోనూ లేదు. దీనికి కారణం—పురాణాలు కొన్ని ఒకయుగంలోను, కొన్ని మరియొకయుగంలోను ఋషులవల్ల చెప్పబడ్డాయి అని ఇదివరకే అనుకున్నాముకదా; అదే కారణం.

ఒకపురాణంలో మరొకపురాణం పేరు కనిపిస్తుందని చెప్పేంగదా.

"శ్రుణుష్వావహితో భూత్వా కథామేతాం పురాతనీం
ప్రోక్త మాదిపురాణేచ బ్రహ్మణా వ్యక్తరూపిణా"
(వామన పురాణం ౩)

వామనపురాణంలో బ్రహ్మచెప్పిన ఆదిపురాణంలోవిషయమే సంగ్రహింపబడినది.

వరాహపురాణంలో—

"రవిం సప్రచ్ఛ ధర్మాత్మా పురాణం సూర్యభాషితం
భవిష్యపురాణమితి ఖ్యాతం కృత్వా పునర్నవం."
౧౭౭ (౫౯)

సూర్యుడు చెప్పినది భవిష్యపురాణము.

మత్స్యపురాణం ౫౩ అధ్యాయంలో పద్ధెనిమిది పురాణాలతాలూకు విషయవివరణ ఉన్నది. అంటే: లోమహర్షుని కాలంనాటికే పద్ధెనిమిది పురాణాలూ వేరయినట్లు కనిపిస్తుంది. అలాగే అతను చదువుకొనిఉంటాడు. శిష్యులు చదివి వారిలోవారు కాని, వ్యాసునితోకాని ఆసమయంలో మాట్లాడుకున్నదికూడ పురాణాల్లో కలిపివేశారు. ఇంతేకాకుండ, నైమిశారణ్యంలో ఋషులతో సంభాషణలుకూడ చేర్చివ్రాశారు. సూతుని ద్వారా పురాణాలు ప్రచురణలోనికి వచ్చినట్లు తెలియడానికి కాబోలును ఈ విధంగా సంగతులు అన్నీ కలిపివేయబడ్డాయి.

ఖండిత

★

= శ్రీ వింజమూరి శివరామరావు =

ఇప్పుడా - కల్వ కనుమూయ, నిప్పుడా - త్వ
దీయ సందర్శనమ్ము ప్రాప్తించె నాకు?
ఇంత గాలివాన - మెరుంగ నెపుడు; అడరి
పోతి రేయి నేమైపోతివో యటంచు.

నీలిమొయిళ్ల దొంతరల నీడల నీ మెయిజాడ లెంచి, శం
పాలతికాలసద్రుచి భవన్నయనాంతరకాంతి గాంచి, న
న్నేలుకొనంగ వత్తు వనియేసుమి నమ్మితి; మోసపోతి; చాల్
చాలిక కట్టిపెట్టుము మృషావచనమ్ములు మాయవేషముల్.

పరకాంతావరనయనాం
తరకజ్జల నీలరేఖ తావకమధురా
ధరమందు నిల్చియున్నది;
ఎరిగితి నీరాచకార్యమేమో - సరిలే!

ఇది యా వ్రేతల పల్లె కాదు; వినుమోయీ ద్వారకావాస! నీ
మొదలో మమ్ముల వెర్రిగొల్ల లనుకోనేరాదు; నీయాట సా
గదు మాదగ్గర నింక; ఎందులకు నీ కైమోడ్పు లీ యేడ్పులున్?
విదితమ్మైనది నీ మనోగతము తన్వీమానపాటచ్చరా!

ఎరుగవా - సమర్పణమయ్యె నెపుడో వలపు
విడిలు నా లేతబ్రతుకు నీయడుగుదోయి;
కిపుడు పేదరాలి, నొసంగ నేది కలదు?
ఇట నిలువనేల? దయచేయు మెచటికేని...

ఋతుసంహారము

★

— శ్రీ భాస్కర్ల సూర్యనారాయణమూర్తి —

కవిత్వాన్ని అనేకులు అనేకవిధాలుగా నిర్వచించారు. కొంతమంది ఉక్తివైచిత్రి కవిత్వమన్నారు. కవిత్వాన్ని ఉక్తివైచిత్రిగా చూస్తే విచిత్రంగా చెప్పిన కావ్యాలు చాలా తక్కువ కనపిస్తాయి మనకు. అన్ని కావ్యగుణాలకంటే ఉక్తివైచిత్రిలో కావ్యరచన చేయడం చాలా కష్టం. అందుకనే కాసుల పురుషోత్తంగారి ఆంధ్రనాయకశతకం వంటి శతకం మరొకటి రాలేదు. ఆయన కున్న ఉక్తివైచిత్రి అనితరసాధ్యంగా కనుపిస్తుంది. దానికి మరీ ఆ వ్యాజనిందాలంకారం తోడ్పడింది.

ఈ వైచిత్రి రెండువిధాలుగా ఉంటుంది. ఒకటి శాబ్దికమైనది; రెండవది భావసంబంధి. శాబ్దికమైన వైచిత్రిని సాధించడం రెండవదానికన్న సులభం. ఆంధ్రనాయకశతకం చదివినతరువాత మళ్లీ అంత ఉక్తివైచిత్రికోసం వెదికితే కనబడ్డ కావ్యం ఋతుసంహారమే. ఈకావ్యంలో తెలుగునాటి ఆరుఋతువులనూ వర్ణించడమైనది.

శరత్కాలం వర్ణిస్తూ—

"బురదత్రొక్కఁడు కాపుబుడుతఁడు మహిషంబు
పై స్వారిపోవును బాలయముఁడు
చింకిజొత్తువకుఁ గైసేయు నంట్రింతలు
పసిమాలకన్నియ పట్టమహిషి
పీడనూఁగగు మిన్నకాడకాయలను మూఁ
జూడదు దూడ నాజూకుకాన
అంతంత మూన్నెల లరకకట్టని గిత్త
యాంద్రించు నంది దాయాదిగాఁడు"

అనెను. ఇందులో ఉన్న ఉక్తివైచిత్రి మహిషముపై స్వారిపోవు కాపుబుడుతణ్ణి బాలయము డనడం; కాజపువ్వులు చెవిలోన పెట్టుకొన్న పసిమాలకన్నెను పట్టమహిషనడం; నూగుపట్టిన మినప కాడకాయలను తినని దూడను నాజూకుకాన అనడం; అరకకట్టని గిత్తను నందిదాయాదిగా చెప్పడం చమత్కారాలు. ఒక సామాన్యమైన ధర్మాన్ని సామ్యము చేత ఉత్తమమైనదానినిగా చూపించడం వీటిలో సాధించడమైనది.

'వెలివడి బురదలో గిలగిలలాడు మ
త్స్యములచే బకతపశ్చర్య సడలె'
'పాతరలం దుంచఁబడిన విఘ్నేశ్వరు
లోపమా యెలుకలు సుద్దలించె'

'చెదరిపోవు మొగిళ్ల నదలించి పరవఁదో
లించె దర్జాల బాలేందురేఖ.'

శిశిరకాలాన్ని వర్ణిస్తూ—

"వ్యాజమ్ము కనిపెట్టి పరిరంభరుచికై
మూడు నిద్దురలలో ముద్దరాలు."

అనెను. ఇది లోకాద్భుతమైన ఉక్తివైచిత్రి. కౌగిలించుకొనేందుకు శిశిరము వ్యాజమవుట చమత్కారము. ముగ్ధకాన వ్యాజము లేకుండ కౌగలించుకొనే ధైర్యం లేకపోవడం యీ వాక్యాన్ని మరీ రసవంతంగా చేస్తోంది. ఇవి భావసంబంధమైన ఉక్తివైచిత్రికి మచ్చుముక్కలు. ఇలా ఉక్తివైచిత్రి చూస్తే యీ గ్రంథమంతా ఉదాహరణగా చూపవచ్చు.

వర్షాకాలాన్ని వర్ణిస్తూ చెప్పిన యీ దిగువ పద్యంలో మేఘసమూహాలు నాలుగుప్రక్కలనుంచీ క్రమ్ముకువచ్చిన వన్నె భావం చెప్పబడింది.

"అంతః ప్రసర్జన్మహాంభోధరమ్ములు
నశనిపాతోగ్రఘోరాంబుదములు
మత్తసామజవరుద్వృత్త జీమూతముల్
నీలనమ్రస్నిగ్ధ నీరదములు
శంపాప్రగాఢ భాస్వత్పయోధరములు
ప్రౌఢధారావమద్వారిదములు
వాయుహతప్రధావద్వారివాహముల్
వృష్టిమన్నికట కృపీటదములు
ప్రాతరవరుద్ధబాల సూర్యాతపములు
సాయమవరుద్ధ సూర్యతేజః తతులు
అది ఘటిక్షతతాపాపనోదనములు
ముసరుకొనివచ్చి మానేల ముట్టడించె."

పై ఏడుపాదాలు బరువైన సంస్కృతసమాసాలు వేసి చివరిపాదంలో తేలికైన తెనుగుమాటలు వేసి సాధించిన దేమిటి? సామాన్యంగా ఆకసము బాగుగా మబ్బుపట్టినప్పుడు 'అమ్మ బాబో వానకురుస్తుం'దంటాం. ఈ భయం తెలుగుజీవితంలో సామాన్యమైంది. దీనిని పై పద్యములోని రీతిభేదమువలన కవి సాధించెను. బరువైన సంస్కృతసమాసాలతో దట్టమైన మేఘాలను వర్ణించి మానేల ముట్టడించె ననుటలో బలవంతుడైన శత్రువు దండెత్తివచ్చినట్లు స్ఫూర్తి. కారుమబ్బులు ఆకస్మికంగా చీకటిని కలుగజేస్తాయి. అందువలని భయాన్ని చమత్కారంగా శత్రువులు ముట్టడించినప్పుడు కలిగే భయంవంటిదని కవి స్ఫురింపజేశాడు. ఇదంతా శాబ్దికమైన ఉక్తివైచిత్రి. ఇందు శయ్యాభేదముచేత అర్థమును సాధించడమైనది.

ఈకావ్యంలోని ఉపమానాలు మరీ నూతనత్వం పెదలగ్రక్కుతున్నాయి. ఏకవియొక్క భావనాపటిమనైనా అతడు వాడిన ఉపమానాలను బట్టి నిర్ణయించవచ్చును. ఈయన ఉపమానాల్లో సంపూర్ణత, నవ్యత, తెలుగుసామాన్యజీవితానికి సన్నిహితత్వము కనబడతాయి. వసంతకాలంలో కోయిల భార్యాప్రవాసివోలె ప్రలపించినదట. ఎండి పగిలిన నేల బ్రతికిచెడినవాని గుండియవలె నున్నదట. హేమంతకాలపు మంచుబిందువు మధువువలె పూవులో మసలెను. సాలీని పటముపై బడ్డ బిందువు తులసి ముగ్గులో నున్న దీపారాధనవలె మెరసినది. గుమ్మడిపూవులో నున్న మంచుబిందువు తట్టలో కూర్చుండబెట్టిన పెండ్లికూతురువలె కులికినదని చెప్పటలో యీయన ఉపమానములను సమకూర్చుటయందున్న నిరంకుశాధికారము కనపడుచున్నది.

ఈకవికి పల్లెటూరిజీవిత మన్న అభిమానము మెండు. ఈకావ్యంలో గ్రామజీవనానికి సంబంధించిన సామాన్యవిషయాలు అనేకచోట్ల రసవంతంగా చిత్రించబడ్డాయి.

"నిలచి నీలిగి చెవులూచి తల విదిర్చి
బొలములోఁ గట్టివేసిన ముసలియెద్దు"

పాడియావు యీనగా పంటకాపు, వాని పెండ్లాముచేసిన సుఖజాగరము, శిశిరకాలమున ములగచెట్టునకు కంబళిపురుగు బలసి కూరాకులు నాకిపోవుట, చన్నులు పగిలిన పాడిబర్రె పాలుతీయబోగా తన్నుట వంటి సామాన్యమైన రైతులు, రాపులుకూడ యీకవికి కావ్యవస్తువులైనవి.

"క్రొత్తనూర్చిన వడ్లకు పరికి పరి తేగ
పండ్లమ్మవచ్చె లంబాడిపడుచు
వినిపించె వీథిలోవన గంగిరెద్దు దా
సరి సీతపెండిలి పలుపు కేక
బువ్వచిక్కము కొడవలిఁ బూని బయలు
దేరె వరికోఁతకొఱకుఁ బాలేరుచాన
ఒక విచిత్రమ్మ యగు శోభ నొలుకఁబోసె
వడి శరద్వేళ మాగాని పల్లెటూరు."

ఈపద్యం గ్రామజీవనం ఆయనకిచ్చే ఆవేశాన్ని చూపిస్తుంది.

మహాకవుల లక్షణాల్లో మరియొకటి లోకధర్మాలను పరిశీలించిచూడడం. సామాన్యమైన విషయాలనే, రోజూ మనం చూచే వాటినే కవి నిశితంగా చూస్తాడు. ఆచూడడంలో మన దృష్టికి అందని, మన మనస్సుకు తట్టని చిన్నవిషయాలుకూడా వాని దృష్టిని తప్పించుకోలేవు. అలా చూచినవాడే ఉత్తమమైన కవి. 'Poetry is the mirror of Nature' అన్న వాక్యం నిజముకావలెనంటే కవి పరిశీలనాశీలి కావలెను. ఆంధ్రసారస్వతములో యీ శక్తి కలవాడు కృష్ణరాయలు. రాయలు బహువ్యాపకమైన సింహాసనమునందున్నను పరిపాలాలు, వానపాములు, వంటయిళ్లు సహితము ఆయనకవితాదృష్టిని తప్పించుకొనలేకపోయినవి. అది సర్వవస్తువులయందు కవితావస్తువును చూడగల శక్తి. ఆ మహాశక్తి రాయల తరువాత సత్యనారాయణగారిదే!

'జల్లికచ్చికబూది జల్లించి గండు చీ
మలు పాయ మల్లెపాదులను జల్లి'
'గొంగు క్రిందటి యుండ గుడగుడ లాడఁగా
నఱవాఁ డెంచి తృప్తుఁడైన కాకి
పందిట లేచుచుఁ బందుకొంచును నాల్క
చాచి రొప్పుచుఁ జొంగ జార్చు కుక్క'
'...ముండ్లయికాళ్లను గ్రుచ్చుకొని నిక్క
చిఱుసూదులను పెండుగరికతలలు'

యివన్నికూడా యీ కవి పరిశీలనాదృష్టిని తప్పించుకొనలేకపోయినవి.

ఈ కవి తెలుగువాడు. తెలుగువారి ఆచారాలు, తెలుగుపిల్లల ఆటలు, తెలుగుసామెతలు, తెలుగుజీవితం యీయన ఏ కావ్యాన్నుంచీ తొలగిపోవు. ఋతుసంహారంలో యీయన తెలుగుతనం ప్రతిపద్యంలోనూ వ్యక్తమవుతుంది. వర్షాకాలంలో యీ కావ్యంలోని పిల్లలాడుకునే ఆటలు చమత్కారంగా ఉన్నాయి. తెలుగుదూగాని పల్లెటూళ్లలో పిల్లలు చూడితేలుపిప్ప పైడిప్ప తెరచి అందున్న తేలుపిల్లలను లెక్కపెట్టుదురు. వీరు ప్రకృత్యక్షనిష్ణాయకులు. తుంగకాణిపిల్చి యీనుటకు సిద్ధముగా నున్న గేదె ఏదూడపెట్టునో తోస్యము చెప్పెదరు. వానకాలువలలో కాగితపు పడవలను వేయు నావికులును, ఎండవానల కలయికలో కుక్కల నక్కల పెండ్లి చేయు సుకేళినిధులును తెలుగుల ప్రతియింట నుండు పిల్లలే. ఈ తెలుగుబాలకులు 'వానలోకాలనుండి వచ్చి నడయాడుచున్న దేవతలవోలె ప్రకాశించిరి.' పిల్లలను దైవసమానులుగా చూడడం తెలుగువారి నైజం. వానలో తడిసిన బాలకులను వానలోకాలనుండి దిగివచ్చిన దేవతలనడం అందంగా ఉంది. వానలోకాల నూహించిన యీ కవిభావనాశక్తి అపారము.

వెన్నకొట్టినవారిపై తాలుకొట్టినట్లు మేఘుడు పేలి కక్షువచ్చెను. ముందు వచ్చిన చెవులకన్న వెనుక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు వరికి కలుపు ఎక్కువయ్యెను. మొరగిన కుక్క కరవ దన్నట్లు గర్జించిన మేఘము వర్షించుట లేదు. రోజా మంచిదైనచో పగలే దొంగిలించ మన్నట్లు కాలిబాటలలోకూడ గడ్డి మొలచినది. జనవ్యావహారికములో నున్న యీసామెతలను వర్ష ఋతుధర్మాన్ని చెప్పుటకు ఉపయోగించిన యీ కవిప్రతిభ ఉదాత్తమైనది.

పెన్నపాలెకాపుపెండ్లి ఊరేగింపు, దానితో వచ్చు వారి అలంకారములు, ఆ ఆనందముతో ఒడ్డు విరిగిన వీధి శిశిరఋతువునకే తెలుగుతన మాపాదించినవి.

ఈ చిన్నికావ్యములో ధ్వని నిండి తొలుకాడుచున్నది.

గ్రీష్మమును వర్ణించుచు—

"కోకిల మధువోల్కఁ గూసి యేమగుఁ దేనె
సేకరించెడు భృంగమే కడింది
రెండుజాముల యెండ మండి యేమగుఁ జల్ల
పాటున గొంతార్పు వడయె గడుసు
అల తొలిజాతిపండుల నేమియగు సము
ద్ధతి నంటుమామిళ్లె ధర పలికెడు
చలువ చేమాలువస్త్రము లెంతకగు వట్టి
యునదచీరలకె యత్యాదరంబు

గ్రీష్మ మరుదెంచి తన ప్రతాపోష్మ మరలి
కలిమియధికార మప్పగేఁగలుగువారిఁ
గ్రొత్తరుచులకు మఱగించుకొంచు నేలు
బడిని సాగించెఁ దెఱఁగ ముదుకఁ బెట్టి"

అనెను. ఈపద్యములో వ్యంగ్యము నిండి నిబిడీకృతమైయున్నది. పక్కివికావ్యగానములవలన కన్న ధనాధికారి ప్రయోజకు డనుచున్నాడని మొదటిపాదములో కవిభావన. ఒక్కసారి తీవ్రముగా కోపము తెచ్చుకొని వెంటనే మరచిపోవువానికంటె తడిగుడ్డతో గొంతుకోయువాడే కార్యసాధకుడని రెండవ పాదమునందు స్ఫూర్తి. పక్కిలీనులకన్న తద్విభిన్న జాతులకే ప్రాముఖ్య మనియు, పనికిమాలిన పరదేశవ్యామోహముముందు ఉపయోగకరమగు దేశీయత నిలువలేక పోవుచున్నదనియు కవిబాధ. పరరాజు తనది కాని దేశములోని ప్రజలను సర్వవిధముల బాధించి పరిపాలన సాగించునని చెప్పుటలో కవిదేశాభిమానము విశదము. ఇందు మన దేశస్థితి చక్కగా ధ్వనింపజేసినాడు.

ఇట్టి మహాకావ్యలక్షణమును యింత సొగసుగా, మన సంఘము, దేశములోని పరిస్థితులను ఎత్తిచూపుటకు ఉపయోగించిన కవి మహాకవి కాకుండు టెట్లు!

ఏదైనా ఒక విషయము మనకు అర్థమయినదన్న, ఆవిషయమును, దాని గుణమును భిన్నముగా చూడగల శక్తి వచ్చినదన్నమాట. ఒక పుష్పము బాగుగా నున్నదన్నచో ఏ యితర పుష్పమునందైనను ఆసౌకుమార్యము చూడగల శక్తి యున్నదన్నమాట. కాళిదాసుని శాకుంతలము బాగున్నదన్నచో తన్మహా నాటక లక్షణములు ఏ ఇతర నాటకమునందున్నను మెచ్చుకొనగల శక్తి యున్నదన్నమాట. ఆ లక్షణములు గల యితర నాటకములలో బాగును చూడలేని వాడు కాళిదాసుని శాకుంతలము మెచ్చియు మెచ్చని వాడగుచున్నాడు.

'అందమగుచోట సర్వమ్ము నందమేయగు'నను కవికులగురువుమాట తీసికొన్నచో, యీ వాక్యార్థము పూర్ణముగా తెలిసినచో ఏ యితరవస్తువునందైనను అందము చూడగల శక్తి యున్నట్లే. గడ్డముచివర చేసిన సెగగడ్డకు గుండ్రని బాలవెంగము కోలబారెను. ఎండలకు చిక్కి సన్నమైన బాల పొడుగుబారెను. చలువకొరకు కండ్లకద్దుకొనిన పచ్చకర్పూరమువలన కోనచూపులు కలిగెను. పై వాక్యమున కిచ్చిన యీ ఉదాహరణలవలన యీ కవి ఆ వాక్యము నెంత గాఢముగా అర్థముచేసికొనెనో స్పష్టము.

ప్రతిపదరసోచితమైన యీయనకవిత్వమునకు మరొక ఉదాహరణము:

శిశిరఋతువులో తెలుగువనితలను వర్ణించుచు, 'స్మరమహాసత్రయాగాగ్ని సమిధలైన భీతహరిణాక్షులకు చలి బెదరిపోయె' ననెను.

ఇందు యజ్ఞేంధనములైన హరిణాక్షులకు చలి బెదరిపోయె ననుటయే చమత్కారము. వారు భీతహరిణాక్షులట. లోకమున సామాన్యముగా భయమన్నది పరస్పరాశ్రయము. మనము శత్రువును చూచి భయపడుచుందుము. శత్రువు మనను చూచి భయపడును. భీతహరిణాక్షులకు చలి బెదరిపోవుట రమ్యాతిరమ్యముగా నున్నది.

ఇన్ని ఉదాత్తమైన కవితాలక్షణములు గల యీ మహాకవి కొన్నిచోట్ల సామాన్యకవులు చేసెడి అలంకారములు చేయును.

"దీప్తి మాధుర్యావధి శరస్సుధాంశుభా
స్వన్మనోహరవిలాసమ్ము లగుచు
శ్లిష్టబంధ విచిత్రకేళీ ప్రశస్తిర
హః కళాపూర్ణోదయమ్ము లగుచు
కృష్ణపదాగ్రభక్తి సంగృహీతాముక్త
మాల్యదాచ్ఛ ప్రౌఢమధువు లగుచు
అనితరలభ్య వర్ణాత్తశయ్యా హేతు
వై పాండురంగమహాత్మ్య లగుచుఁ
దీయఁదనములు మెఱుఁగులుఁ దెచ్చుకొన్న
ప్రియలు ప్రియులు కూడి మనుచరిత్ర లగుచుఁ
దెలుఁగు రసికలోకముల కందిచ్చె ననువు
లస్తుకొని మల్లెపూల్ క్రొత్తక్రొత్తరుచులు"

ఇట్టి సామాన్యమైన శ్లేషమీద యీ కవికి ఆపేక్ష ఎందుకో తెలియదు. ఇంత రసవంతమై, ఉదాత్తమైన కావ్యమునందు సామాన్యశబ్దాలంకారములనుగూడ చొనిపినాడు.

ఈ చిన్నగ్రంథము మన భాషాసరస్వతి కొక అమూల్యాలంకారము. వెనుకటి కొక కవి యీయనను గూర్చి చెప్పుచు 'పట్టినదెల్ల బంగారుచేయగలవా' డన్నాడు. దీనిని బంగారముకాదు - మాణిక్యము చేసినాడు. ఈ మాణిక్యము తెలుగులోకమున కెన్నాళ్లు రసజ్ఞతయుండునో అందాక తెలుగుసరస్వతికిరీటమున ప్రకాశించును.



వీణావతి

•

= శ్రీ బొడ్డు బాపిరాజు =

(హొయిసలేంద్రుల యశస్స్తంభమునకు మణికిరీటమెత్తిన బేలూరు చెన్నకేశవాలయ మాంధ్రకర్ణాట స్థపతిశేఖరుల కళాస్రవంతులకు పవిత్ర సంగమస్థలము. కోటితరగల పొంగిన యా మహాశిల్పసముద్రమున ఆధార శిలాశిల్పము లమృతదీపములు. అందును 'వీణావతి' లలితలావణ్యరేఖాప్రౌఢాకృతి. నా యీ కృతి కధికృతి.)

ఇటులే యెన్ని శతాబ్దముల్ గడచె తన్వీ! నీవు మందాకినీ
నటదూర్మిస్వనమోహనమ్మయిన వీణాదండమున్ బూని; చె
క్కిట లేయెండ చెమర్చ, నద్దుకొనఁజో కే కేశవస్వామి కే
మటు విన్పింతువు; — రాధికాప్రణయమిథ్యాకోప సందేశముల్.

భవతీ! యుష్మదతీంద్రి యాద్భుత సుఖప్రస్తావి వీణానము
ద్భవసంగీత రసప్రలుబ్ధులు సుపర్వశ్రేణు లేకాగ్రతా
నవబోధస్థితిలో శిలాప్రతిమ లైనారేమొ, కాదేని యీ
పవనాంకూరములందు నెచ్చటి వపూర్వ స్వర్గ సౌగంధ్యముల్.

సకలకళాజగద్విభవ శారదవో, వికసద్వసంత చం
పకసుకుమార వేల్పుకుమారికవో, స్థిరశిల్పయోగ సా
ధకుని హృదంతరామృతవిధానమునం దుదయించినట్టి మే
నకవో మరీవు నాకను లొనర్చిన పున్నెపు ప్రోవు వందునే.

ఏలలితస్వరమ్ము నినదించిన దాచిరుమోవి, సోగకై
వ్రాలినచూడ్కి నేసొగసు పండిన, దామృదులాంగుళీక సం
చాలనమందు నేమధురభావము తోచిన దప్పు డాకళా
శాలిహృదబ్జమం దదియె శాశ్వతముద్ర వహించు నిప్పుడున్.

స్పందింపన్ కవితావిపంచిక చిరస్వప్నప్రపంచమ్ము, లా
క్రందింపన్ పరపుష్టజీవితము, కర్ణాటాంధ్ర కన్యామణీ
సౌందర్యమ్ములు మేళవించిన భవత్సాన్నిధ్యమం దెవ్వ డా
నందోన్మాదవిషాదభావనలలోనై యశ్రువుల్ రాల్పడో.

నీకు శిలాప్రవాసినికి నిద్దుర దెల్పి యనంతయౌవన
శ్రీకమనీయమూర్తిగ రచించిన శిల్పిమహేంద్రు డిప్పు డే
లోకము లేలుచుండెనొ యెరుంగముకాని, తదీయకీర్తి గా
థాకృతు లాలకింతు మనుతాపభరమ్మున నీదు వల్లకిన్.

భవదనఘ గానవిద్యా ప్రభావితమ్ము, — ఈ పవిత్రకళాక్షేత్ర మిచట నిలిచి
నా యపశ్రుతి కలుషమైనట్టి బ్రదుకు-నుజ్జ్వలంబయ్యె నీ యరుణోదయమున.

ఎవఁడు కవి? ఏది కావ్యము?

= శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి =

కవిశబ్దము మిక్కిలి పురాతన మైనది. మంత్రద్రష్టలు, లేక మంత్రకృత్తు లనెడి యర్థమును దెల్పు ఋషి సూరి ధీర కవి శబ్దములు సమానార్థకములై వేదములఁ గనవచ్చును. ఇందు కవిశబ్దముమాత్రమే లౌకిక భాషలో కావ్యకర్త యను నర్థమున వాడుకలోనికి వచ్చినది గాని, దీనికి ఋషిశబ్దార్థమును పూర్వులు సమన్వయించకపోలేదు. భట్ట తౌతుఁ డను మహాలాక్షణికుఁడు తన కావ్యకౌతుకములో నీశబ్దముల యర్థము నిట్లు నిర్వచించి యున్నాఁడు. అతని కృతి లభింపకపోయినా, ఈ శ్లోకములుమాత్ర మర్వాచీనుల వాక్కులం బడి జీవించి యున్నవి:

"నానృషిః కవి రిత్యుక్త మృషిశ్చ కిల దర్శనాత్,
విచిత్రభావ ధర్మాంశ తత్త్వప్రఖ్యా చ దర్శనమ్;
స తత్త్వదర్శనా దేవ శాస్త్రేషు పఠితః కవిః"

"దర్శనా ద్వర్ణనా చ్చాథ రూఢా లోకే కవిశ్రుతిః"

"ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభా మతా,
తదనుప్రాణనా జీవద్వర్ణనా నిపుణః కవిః"

అతీంద్రియ మైన ధర్మతత్త్వమును జ్ఞాననేత్రమునఁ జూచి, చూచిన ట్లుచ్చరించినవాఁడు ఋషి యైన కవి యని మంత్రద్రష్టృపర మైన మొదటిభాగమున కర్థము. అసాధారణమును, సహృదయ హృదయాహ్లాదకారియు నైన విచిత్ర విషయమును కనిపెట్టి దానిని ప్రతిభావిశేషమున జీవ ముట్టిపడునట్లు వర్ణించు నేర్పుకాఁడు కవి యని లౌకిక కవిపర మైన రెండవ భాగమున కర్థము. ఇందు కుదాహరణము వాల్మీకి మహర్షి. అతని దర్శనము స్వచ్ఛమును, నిత్యము నైనను, శ్రీరామచరితవర్ణనము పుట్టువఱకును లోకమునఁ గవిత్వ ముదయింపలే దనుచు నతఁ డిట్లు పలికి యున్నాఁడు:

"తథాహి దర్శనే స్వచ్ఛే నిత్యే ఽప్యాదికవే ర్మునేః
నోదితా కవితా లోకే యావ జ్జాతా న వర్ణనా"

దీనినిబట్టి రుచికర మైన విచిత్ర విషయము కనిపెట్టుటయు, దానిని సహృదయరంజకముగా వర్ణించుటయు లౌకికకవిలక్షణ మని విదిత మగుచున్నది.

ఈ లక్షణమే పూర్తిగా పట్టవలెనంటే వాల్మీకి తరువాత వ్యాసుఁడు లెక్కకు వచ్చును. మఱి భాసకాళిదాసాదుల మాట యేమిటి? లక్షణము చెప్పినట్టి వర్ణనము వారిదైనా, దర్శనము వారిది కాదు కావున వా రర్ధకవు లనఁబడుదురు గాని పూర్తికవులు కాఁజాల రనవలసివచ్చుచున్నది.—బాగున్నది. అయితే, ప్రాచీనపండితసంప్రదాయసమ్మతము లైన కవిలక్షణములలో నిది యొకటి కావచ్చునుగాని, యిదే పరమప్రమాణ మనవచ్చునా? దీనినిబట్టి దీనికిఁ బూర్వు లైన భాసకాళిదాసాదులే యర్ధకవు లైతే దీనికిఁ బరు లైన వారిమాటయేమి? అనువాదకు లైన తెలుఁగువారి గతి యేమి? ఈ వ్యాసము మొదటికే మోసము వచ్చును గదా!—అట్లుకాదు. ఇతరుల దర్శనమందలి ప్రధాన కథాంశమును గ్రహించినా, సాధారణమానవులకు గోచరింపని విచిత్రవిషయములను దర్శించి వాటితో సర్వాంగసౌష్ఠవముగా దానిని పెంచి పోషించు ప్రతిభ యున్నచో నతఁడు కవియే యన్న భావ మీలక్షణములో నిమిడియున్నది. 'కవిత్వబీజం ప్రతిభానమ్' ఇత్యాదిగా వామనరాజశేఖరాదులు నీభావమునే చెల్ల

డించియున్నారు. ప్రతిమానాటకమునందును, శాకుంతలములోను గనవచ్చువిషయ మంతయు రామాయణభారతసంహితలలోనిదేనా! వారందు చూపిన చిత్రవిచిత్రమనోహరనూతనవిషయము వారి దర్శనము కాదా? అది యెల్ల ప్రతిభాకార్య మనుట స్పష్టము కదా! కావుననే "భాసో భాసయతే జగత్" "కవయః కాళిదాసాద్యాః" ఇత్యాదిస్తుతులకు వారు పాత్రులైరి. ఉత్తరరామచరిత్రలో ముప్పాతికమువ్వీసము భవభూతి దర్శనము కాదా? అందుచే వారు పూర్తికవులే యగుదు రనుట నిశ్చయము. కాని, ఆ నాఁడు కవిపదమెంతో గిరాకీ గాని, "పోకకు పుట్టెఁ" డన్నట్లు కారుచౌక కాదు. అది యెంతో దుర్లభవస్తువని, యిపుడు మనము మహాకవు లనుకొనుచున్న యీ మహనీయులే భావించియున్నారు. ఇందుకు కాళిదా సెంతో జంకుచు నేమన్నాఁడో చూడుఁడు:

"మందః కవియశఃప్రార్థీ
గమిష్యా మ్యుపహాస్యతామ్."

అబ్బా! అంతటి కవిత్వకళామూర్తి కెంతటి సంకోచము! ఇది యహంకారనిరాసావచన మన్న ననవచ్చును గాని, చదివినంతనే తోఁచెడి యర్థమో! కవియన్నకీర్తి నపేక్షించుట నవ్వులపా లగుట యఁట! కవిపదము దుర్లభాతిదుర్లభ మనుట కింతకంటె వేఱె సాక్ష్య మేల? ఇదే యంత దుస్సాధ మైతే మహాకవిపదము మాట? ఆ విషయము నిరూపింప మనము సమర్థులము కాము. ఆనందవర్ధనాచార్యుఁ డేమన్నాఁడో చూడడమే మన పని:

"అస్మిన్నతివిచిత్రకవిపరంపరావాహిని సంసారే కాళిదాసప్రభృతయో ద్విత్రాః పంచషా వా మహాకవయ ఇతి గణ్యంతే."

అతివిచిత్ర మైన యీ కవిపరంపరారూపసంసారములో కాళిదాసాదు లిద్దఱు ముగ్గురు, లేకపోతే అయిదాఱుగురు మహాకవులుగా గణింపఁబడుచున్నారని నిర్దాక్షిణ్యముగా చెప్పినాఁడు. మన లెక్కను బట్టి చూచినా, ధ్వన్యాలోకములోని యితరకవుల శ్లోకములనుబట్టి చూచినా, యితనినాఁటికి గణనకు వచ్చిన కవులు సుమారు వందమంది యుందురు. అయితే నేమి? ఏప్రతిభావిశేషము పాఠకులయు, శ్రోతలయు హృదయము నానందమయము గావించునో, అట్టి ప్రతిభ గల మహాకవులు వారిలో నాలుగురికంటె నెక్కువ లేరని యొక్కమాట చెప్పి విడిచిపెట్టినాఁడు. అయిదాఱుగు రయినా, తమంతఁ దాము మహాకవుల మని యనుకొన్నవారు కారు; నలుగురిని చేరఁదీసి యనిపించుకొన్నవారు కారు. లోకములో వారి కున్న ప్రఖ్యాతినిబట్టి యితఁడు గణించినవారే. సెబా సానందవర్ధనా! గొప్ప ధైర్యశాలివి. మహాకవిబిరుదమునకే నీ వింతయాగ్రహము చూపినావు, దీనిని తలదన్నే నేఁటి బిరుదులు నీనాఁ డున్నచో నీనిర్ణయ మెట్లుండునో! ఏ మయితే నేమిలే! ఆకాలము గనుక నీమాట చెల్లినది. నీవిపుడు మా దేశములో నుదయించి యుంటివా యందువా, నీపని యేమగునో!

అర్వాచీన సంస్కృత కవులలో కొందఱు దుర్గర్వదురహంకారముల చేతనో బిరుదులు తగుల్చుకొని విజృంభించినమాట నిజమే కాని, వారైనా చెప్పడానికి వీలులేనంతగా మితిమీఱినవారు కారు, పాపము! వారి కావ్యము లైనా బయటికి రాలేదు. ఇఁక నట్టివారి గొడవ యెందుకు?

ఇంతదనుక సంస్కృతమందలి కవిలక్షణ మెట్టిదో, కవులు, మహాకవులు ననఁదగినవా రెట్టివారో కొంచెము తెలిసికొన్నాము. ఇట్లే తెలుఁగునఁగూడ కొంతవఱకు చూతము.

నన్నయార్యుఁడు మొదలుగా పోతనార్యునివఱకు మహనీయు లెందఱో యున్నారు. వారందఱు ననువాదకులే రైనను, అలోకసామాన్యమైన ప్రతిభచే విచిత్రవిషయము లెన్నో చూపినవారు గావున దర్శనవర్ణనములు రెంటను వారు కవులై దేశీయులకు మృదుమధురభాష ప్రసాదించి కవిత్వభిక్ష పెట్టినవారై వంద్యు లగుచున్నారు. అవకాశ మున్నను వారు తమ

పోషకప్రభువులవల్ల బిరుదులు గైకొన్నవారు కారు. అట్టివారికి బిరుదు లెందుకు? వారి పేరే బిరుదు. శ్రీనాథుఁ డొకఁడు తప్పనిసరి యగుటచే గౌడడిండిమ భట్టుకంచుఢక్క పగులఁగొట్టించి, దేశమంతట వెలసినాఁడు కాని, యతఁడైనా, తన కవిత్వశక్తికి మెచ్చి చంద్రశేఖరు క్రియాశక్తిరాయలు నిండుపండితకవి సభలో నిచ్చిన కవిసార్వభౌమబిరుదము పరిగ్రహించి యొక చాటుపద్యములో నొకమాఱు స్మరించినాఁడే కాని దానిని ఖజాన వేసికొని యూరేఁగలేదు. అరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురి కన్నాఁడు గాని పోవునపుడు కూడా పట్టుకొనిపోవుట కుద్యమించలేదు. అల్లసానిపెద్దనార్యుని యాంధ్రకవితాపితామహబిరుదము నట్టిదే.

కాని, ఇక్కడ నొకమాట—పూర్వసంస్కృత కవులవలె పూర్వాంధ్రకవు లందఱును నిర్మత్సరులు, నిరహంకారులు కారు. వీరి కర్వాచీన సంస్కృతకవుల గుణములు కొన్ని యబ్బినవి. ఇఁక నర్వాచీనాంధ్రకవు లందుమా, వా రర్వాచీనసంస్కృత కవులను మించివా రనిపించినవా రైరి. ఈ పోలికలు గుణములందే కాని, కవితాశక్తిని కాదు. మన ప్రస్తుత విషయ మదే కదా! కాని,

"అంతా కవులను కామా?
అంతంతగ కందపద్ద మల్లఁగలేమా!"

అన్నట్లున్న యీ రోజులలో- వేమనశతక సుమతిశతకకర్తలు మహాకవు లనఁబడుచున్న యీకాలములో- కవితాశక్తిపరీక్ష కాకదంతపరీక్షయే యైనా, మనవారు చెప్పిన కవిలక్షణ మెట్టిదో యొకింతచూచుట కేమి? కవిలక్షణము నిర్వచించినవారిలో నత్యంత మర్వాచీనుఁ డయ్యు, నాద్యుఁ డనఁదగినవాఁడు పింగళిసూరనార్యుఁడు. ఇతఁడు కళాపూర్ణోదయములో కలభాషిణిమాటలుగా—

"పొసఁగ ముత్తైపుసరుల్ పోహళించినలీల—"
"చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము గలిగినను-"

అను రెండుపద్యములలో నిట్టి కవిత్వము చెప్పినవాఁడు 'సుకవి'యన్న సిద్ధాంతము నెలకొల్పినాఁడు. అందఱికి నాహోపుట్టించెడి యద్భుత, మపూర్వము నైన కథాసన్నివేశముతో కళాపూర్ణోదయము నిర్మించిన యితఁడే దీనికి లక్ష్య మగునో కాఁడో యని యొకానొక రన్నట్లు మనము సంశయించినచో నీఁత నితని కవిలక్షణము సార్థకము గావించు కావ్యకర్త యేఁడీ?

ఏది కంటఁబడినంతనే చదువ నుత్సాహము పుట్టించునో, ఏది చదివి యొక్కమా ఱాలోచించినంతనే హృదయము నానందపరవశము గావించునో, ఏది మఱిమఱి చదువబుద్ధిపుట్టించునో, ఏది విన్నంతనే మనస్సు నాకర్షించునో మధుమయఫణితి నున్న యట్టి సరసకావ్యము సారస్వతమున శాశ్వతము. అట్టిదానిని నిర్మించినవాఁడు కవి. అంతే కాని, పదిమందిని పోగుచేసి తన కావ్యమును తానే నుతించుకొనుచు పాడి వినిపించి యెన్నాళ్ళు బళీయనిపించుకోఁగలఁడు? ఆ దెన్నాళ్ళు నిలుచును?

కాలకర్మవశమున నాలుగువందలయేళ్లణఁగి యున్న యుత్తరహరివంశ మిపు డుత్తమకావ్యముగా పొగడ్త కెక్కుటకు నాచనసోముని యత్న మేమున్నది? దాదాపు మూఁడువందల యేండ్లు మూలఁబడియున్న కళాపూర్ణోదయ మిపుడు సకలజనవంద్య మగుటకు సూరనార్యుని యత్న మేమి? నిజముగా వారు కవులు, అవి హృదయంగమము లైన కావ్యములు: అంతే కారణము. మూఁడువేల సంవత్సరముల క్రిందట నుదయించిన రామాయణ భారతములు నేఁడు పుట్టినట్లున్నవి. ప్రపంచ మున్నంతవఱకును భాస కాళిదాస భవభూత్యాదుల కృతులు నిలిచియుండవా? కారణము? వారు చెప్పఁదగిన కవులు, అవి చెప్పఁదగిన కావ్యములు. కవిత్రయమువారి భారతము కల కాలము నిలుచును గాని, దానితో నిలుచు మఱియొక పురాణ మేది? అట్లు తన కావ్యముతో శాశ్వతముగ జీవించువాఁడు గాక మఱియొకఁడు కవి యగునా?

కావ్యమందు గుణమున్నదా, అది పుట్టినంతనే రాణించలేదని విచారింప నక్కఱలేదు. భవభూతి చెప్పినట్లది రాణించుట కనంత మైన కాల మున్నది. సంస్కృతమున నుదయించిన కావ్యము లెన్ని వేలో! అందు నిలిచిన వెన్ని, వాటిలోఁగూడ నేఁటికిని పాఠకుల నాకర్షించుచున్న వెన్ని యొక్కమాఱు పరిశీలించినచో, కవికావ్యతత్త్వము కంటఁ బడును. అట్లే కడచిన తొమ్మిదివందల సంవత్సరములలోని తెలుఁగు కావ్యముల స్థితిగతులను వివేకించినచో, కవి యెవఁడో, కావ్య మేదో గోచరించును.

కవి సరియైన యధికారి యైనఁ గాని కావ్యము చిరస్థాయి కాదు. అధికారి కానివాని రచన మదురు మీఁది చికిలింత. అది తాత్కాలమం దొక్కమాఱు పామరజనరంజక మైతే కావచ్చును గాని, ఒక్క మట్టు మధ్యాహ్నములో దాని యేపు సరి. ఉభయ భాషలలోని పెక్కు గ్రంథములు చదువుట, ఉభయ కవిమిత్రు లగు పెద్దలతోడి సహవాసము, లోకజ్ఞత, గుణదోష విమర్శకత, సౌశీల్యముతోడి రసికత మెండలగు సుగుణములు కలవాఁడు కావ్యరచన కధికారి. తన్నుఁ దా మఱచి కావ్యములో నైక్య మందినవాఁడే కవి. నిష్కామబుద్ధితోడి యాత్మధ్యాన మెట్టిదో నిరహంకారముతోడి కవితోపాసన మట్టిది. అధికారము కొఱఁతవడినా, అహమిక విజృంభించినా, అట్టివాని కావ్యము పుబ్బలో పుట్టి మఘలో మాడినదే. అట్టి దాని కిదే లక్షణము:

"కోవిదగ్రంథపరిచితి గుండుసున్న
వస్తుపాత్ర రసజ్ఞత బండిసున్న
నిర్మమాహంకృతిస్థితి నిండుసున్న
యైన కవికర్మ హళ్లికి హళ్లి సున్న!"

కావున బుద్ధిశాలియగువాఁ డధికార మార్జించి, యహంకారదూరుఁడై, వాగ్దేవతను తన్మయుఁడై యుపాసించి కవికీర్తి గాంచుఁగాక.



మిత్రుని స్మృతి

— శ్రీ 'సహజానంద' —

"పౌర్ణమి!

యౌవనమునకు మదిర!

వయసు తెరలు తొలగించి, తుపానుల రేగ గొట్టును.

ఆరాత్రి సముద్రమం దెంత కోలాహలము!

అలఅలలో ఎంత రొద!

ప్రాణమం దెంతటి మధురఘోష!

ఏమి యీ జ్వాలానృత్యము !

యౌవనము చిగిర్చిన చోట ఎన్ని కోకిలలు విసుగులేక గొంతుక కోసుకొనునది!

ఎంత ప్రచండశక్తి—ఈయౌవనము!

దీని విజృంభణముందు జనులు పాదధూళి!

దీని తృష్ణముందు సింహాసనములు పిల్లికూనలు!

దీని పరవశములో అద్వితీయమైన దేదీప్య సౌందర్యము పంజరములో చిలక!

ఆకాశమందు చూడుము—మబ్బులు మాత్సర్యము క్రమ్మి వలంపెక్కెను. దీపము లారి, చీకటి వ్యాపించును. తుల్లిపడి, తుపానులు లేచి, సృష్టి యొక్క కోకటి వేలుల పెకలింపనైన చూచును. మృత్యువు చీకటిగుహలందు గర్జించు గర్జనలకు రోదసి అదటే నేలపై పడునా అని తోచును.

తరువాత......శాంతి!

కాని...

ఎంత వినాశనము?

ఎంత ప్రాణనష్టము!

ఎన్ని ఓడలు సముద్రపుఒడిలో ఒదిగిపోయినవి!

ఎన్ని భవంతులు కూలి, ఎంత మందికి గోరీలైనవి!

అనాధప్రకృతియం దెంతటి పౌరుషము ప్రచ్ఛన్నమై యున్నదో!

రాతిని గీటుము!......శతాబ్దములరక్తతృష్ణతో అగ్నిజిహ్వను చాపును—

వీటితో పోల్చుము—యౌవనమును!

ఎంత పిపాస!

ఎంత ఉద్వేగము!

కన్నులం దెంతటి కామన!

వెలుతురు చొఅరాని కీకారణ్యము-యౌవనము.

ఆహా!

మన్మథుని నృత్యశాల!

వసంతుని ఉద్యానవనము!

ఈదవానలాన్ని చవిచూడని ప్రాణి ఎవరు!

కాని యౌవనమునకు అనాది, అజేయశత్రువు మృత్యువు!

ఈరెండిటి ఘోరసంగ్రామమే మానవచరిత్ర!

మృత్యువుకు ముదుసలు లన్న మురిపి!"

మిత్రుడు తన ఆవేశాన్ని ఆపాడు. తీవ్రమై, తీక్షణమైన వ్యాధి దాపరించినపుడు జీవుని అంతరాత్మ మేలుకొని, తన ఆకృతిని విమర్శించుకొనును. దేహము యొక్క శక్తి సన్నగిలునపుడు, మత్తు వదలి మనసు విచారణమగ్నమవును. ఈజీవి ఏమి? దీని గతి ఏమి?— ఈ కఠోరప్రశ్నల కాళచ్ఛాయలు రోగికన్నుల నావరించును. మిత్రుని ముఖంలో ఈ క్రొత్త ఆందోళన

నన్ను చాల కంగారుపఱచినది. ఆతురతతో చెప్పాను: "ఈ ఆలోచన మంచిది కాదు." అని.

"ఆలోచన! మంచిమాట చెప్పావు? ఈ ఆలోచన వెనుక ఎట్టి ప్రచండదవానల మున్నదో నీకు తెలియదు. మృత్యువు నీ..."

వినలేక, గట్టిగా అన్నాను:

"నీకు మతిపోతోంది. ఈ వెఱ్ఱి ఊహలతో. మనస్సు మార్చుకో".

"అవును. మృత్యువు నీ గడపవద్ద గంటమోగించినప్పుడైనా నీ అంతర్యము నీవు తెలుసుకోవద్దూ? అదిగో...అప్పుడే నాపై మృత్యువునీడలు కమ్ముకుంటున్నయ్...ఓ... (భార్య నుద్దేశించి) దుఃఖించి, ప్రయోజనం లేదు. శతాబ్దాలుగా సృష్టి అనుభవిస్తున్న ఈ శాపభారం ఇవ్వాళ నువ్వూ, నేనూ తప్పించుకోలేం."

అతని భార్య అతనికంటె ఎక్కువ బాధపడుతోంది. ఆమెహృదయంలో ఎంత చిచ్చు రగులుతోందో నే చెప్పలేను.

చంటిపిల్ల ఉయ్యాలలో నిద్రపోతోంది.

మఱల మిత్రుడారంభించెను:

"నీకు తెలియును నాప్రకృతి. రెండురోజుల క్రితం కృష్ణానదిఒడ్డుకు వెళ్లాను. సూర్య డింకా చీకట్లో మునిగిపోలేదు. మారాన శివాలయంలో ఎవడో శంఖం పూరించాడు. ఎవ్వరో నలుగురు వచ్చి చితిని పేరుస్తున్నారు. కాసేపటికి ఒక పాడె... జనం...

ఇందులో విశేషము లేదు. కాని?

ఆ చితి!

చీకటిపడుచున్నది.

కాని శవమును వీడ రా ఆడవాండ్రు!

ఏమిది?

ఇది విచిత్రముకాదా?

ఘోరమైన రుద్రభూమిలో ఈ దృశ్య మెవ్వరైన చూచిరా?

విగతమైన జీవము. బొమికెల పటము. ఆ చెల్లెళ్లు, ఆ తల్లి, ఆ తండ్రి...పవిత్రమైన తమ బిడ్డను నదిలోనికి విసరుచున్నట్లు; ఏమి ఆ రోదనము!

మృత్యుశకం బెంతటి సంక్షోభ!

శూన్యమం బెంత భ్రాంతి!

ఆకృతియం బెంత మక్కువ!

పురాణములందుకూడ ఈశ్మశానదృశ్యము కానరాదు.

నా కాళ్లు వణకినవి!

చితి నిప్పంటుకొన్నది!

నెత్తురు చిమ్మినట్లు!

దగ్గఱకు పోయి తెలిసికొంటిని. ఈ పూరువారు కారనియు, కార్యార్థమై వచ్చిన తమ కొడుకు హఠాత్తుగా గుండె ఆగి, ఇక్కడ మరణించెననియు."

మిత్రుడు నాకేసి చూశాడు. అతని చూపు యొక్క తీక్షణతముందు నేను మూగనైతిని.

"అవును. ఇందులో విశేష మేమున్నది? ఈ సంఘటనలో ఏమి విచిత్రమున్నది?

అదే! మృత్యువుయొక్క నీడలోగాని మనిషి నిజాన్ని తెలుసుకోలేడు.

చూడు! ఆ తల్లి తండ్రులకు ఒకే ఒక కొడుకు అతడు. పాతికేళ్లు వచ్చి, పరీక్షలు ప్యాసయి, చేతికి అక్కఱకువస్తాడుగదా అని అనుకొనే సమయంలో, మృత్యువాతపడ్డాడు. నలుగురు చెల్లెళ్లు! 'శిలలు ద్రవించేట్టు ఏడ్చారు! ఏమైనది అతని కథ! ఎవడనుకున్నాడు ఇలా జరుగుతుందని! ఆ తల్లిగుండె దేహంలో గుప్పెడు బూడిదై, గిలగిల తన్నుకుంటోంది! తండ్రి! కట్టుకట్టిన గాయం! ఆ ఇల్లు!

ఇక ఆలోచించు మనుష్యుని ఐశ్వర్యము, అభివృద్ధి! మృత్యువును ముఖాముఖిగా కలుసుకోటానికి ధైర్యం లేకపోతే, చాటునైనా దాని కాటు తినక

తప్పదు. మన ఈ వ్యర్థకాలయాపన, కాలక్షేపం—మనవెనుక మృత్యువును పెట్టుకునే!

కాని అతడు పెళ్లి చేసుకోలేదట...అందుకని ఆ అదృష్టం ఉంటుందా ?"

మిత్రుడు సొమ్మసిలి కళ్లు మూశాడు. వంటిపై చెయ్యివేశాను. చల్లగా ఉంది. దీపపు వెలుతురులో ఆ మెకుంకుమ నెత్తురుదివ్వవలె కనబడుతోంది. నాకు శక్తి నశించింది. ఈఘటనలో ప్రళయగంట మోగి నట్లున్నది. చూస్తూవుండగా చెఱువుమెట్లపై నుండి జారి పిల్లవాడు నీళ్లలో మునిగి పోవుచున్నట్లు!

నాకేమీ తోచలేదు. వైద్యులకు ప్రాణమన్న-అవయవముల ఆటుపోటని!

మిత్రుని ముఖం భయంకరంగా ఉంది.

ఇంటిలో పెద్దవాళ్లులేరు.

మర్నాడు...

జ్వరం...తగ్గలేదు. వైద్యుడింటిలో కంగారు మాటలు చెప్పిపోయెను. నే వెళ్లేప్పటికి చంటిపిల్ల కాళ్లువిరిగిన గుర్రంతో ఆడుకుంటోంది! ఆ చంటి ముఖాన పట్టరాని సంతోషము! మిత్రుని ముఖంలో అగ్నిహోమం!

"నే చెప్పలేదూ! మృత్యువు గంట మోగించిం దని. నీ, నా మైత్రి కిక ముగిం పిది. ఈ నాలుగేళ్ల మన స్నేహంలో పూర్ణసంతోషాన్ని అనుభవించాను. నువ్వెవడవు? నేనెవడిని? నీ కీసంబంధ మేమిటి? ఇది మన మనోజీవితము. నీ కాశ్చర్యం వేయవచ్చు—నా వైఖరి చూసి! కాని నాకు పిఱికలేదు. మృత్యువుకు నే ఏడ్పులతో, పెడబొబ్బలతో స్వాగతం చేయ దలచుకోలేదు...కాని... "

మిత్రుని కళ్లలో నీళ్లూరినయ్.

ఇది దారుణపరీక్ష!

"ఈ ఇల్లు....నేను....నాభార్య...పిల్ల....నువ్వున్నావు—ఇలాంటి సౌఖ్యము ఎంతమంది కున్న దని. కాని ఈనాడు..."

మిత్రుని స్వరం గాద్గదికమైంది.

కాని ఈనాడు ?

ఇది దారుణ ప్రశ్న !

ఈప్రశ్న బాణం నామనస్సును గాయపఱచింది.

"ఈ జీవితమున కర్థమేమి ? ఈ తల్లి బిడ్డల గతి యేమి ? ఇది అని, అది అని చెప్ప మార్గులు పెక్కు మంది. ఈ దాంపత్య మేమి ? కొలదికాలపు సాంగత్య వినాశనంలో ఇంత దారుణబాధ ఏమి ? నాకు తెలుసు...నాభార్య వేదన మరణవేదనకన్న హెచ్చు! నీవంటివి—"నీ జీవితము ధన్యమైన"దని. కాని ప్రాణుల మధ్య ఈ బంధనముల రహస్య మేమి ? ఎడబాటులో ఇట్టి కఠోరసంక్షోభ మేల?...నా ఈ అభాగ్య జీవితంతో ఎంత దారుణ విషాదగాథ వ్రాసిపోతున్నాను-నా వెనుక !"

నేను మాటలాడు స్థైర్యము తప్పినది. మృత్యు ప్రేరితమైన మిత్రుని ఈ ఝంఝామారుతము ముందు నేను గడ్డిపోచను.

నాలుగవరోజు సూర్యునితోపాటు మిత్రుడు అస్తమించాడు ! ఆ వినిర్మలముఖంలో జీవితపు తుది తేజస్సు ఉద్దీప్తమై ఉంది. సుపరిచితమైన ఆ ముఖంలో కాలం ఒక్కసారి గిర్రునతిరిగినట్లుతోచింది.

కాలం !

మనుష్యుని కన్నీటి కావేరి !

శరచ్చంద్రఛటోపాధ్యాయ ఇలా వ్రాశారు: "పోతూ పోతూ పాంథుడు వండుకొన్న కుండలను పగలగొట్టిపోతాడు" అని. ఇది అందఱు పాంథుల విషయంలోనూ వర్తిస్తుంది!

ఆహరహస్సు ; అనుక్షణం ; ప్రతిచోట ; ప్రతి కార్యకలాపంలో అదృశ్యంగా దృశ్యమయ్యే నా మిత్రుడు 'సోక్రటీస్'ని జ్ఞప్తికి తెస్తాడు !

ఉత్తేజితమైన ఓ జిజ్ఞాసువా ! నీ ఆత్మకు అమర శాంతి.

నీ వలన స్వర్గమున కెంత శోభ ! !

“మే గ్నా కా ర్టా!”

= శ్రీ బాలగంగాధర తిలక్ =

మేం మనుష్యులం
మేం మహాస్సులం
గుండెలోపలి గుండె కదలించి
తీగలోపలి తీగ సవరించి
పాటపాటకి లేచు కెరటంలాగ
మాటమాటకి మ్రోగు కిన్నరలాగ
మేం ఆడుతాం
మేం పాడుతాం.


మేం ఉపాసకులం
మేం పిపాసువులం
భూమిఅంచుల వెలుగుతెర కట్టి
తారకల గతి కొక్క శ్రుతిపెట్టి
పాటపాటకి వెండిదారంలాగ
మాటమాటకి మండు దూరంలాగ
మేం సాగుతాం
మేం రేగుతాం.

మేం నవీనులం
మేం భావకులం
పాతలోకంగుండెలో శతఘ్ని పగిలించి
భావికాలం చంద్రకాంతపుశిలల కరగించి
పాటపాటకి సోకు స్వర్గంలాగ
మాటమాటకి దూకు సింహంలాగ
మేం నిలుస్తాం
మేం పిలుస్తాం.

మేం మనుష్యులం
మేం మహాస్సులం
మాకు దాస్యం లేదు
మాకు శాస్త్రం లేదు
మాకు లోకం ఒక గీటురాయి
మాకు కరుణ చిగురుతురాయి.

* * *


మేం పరపీడన సహించం
మేం దివ్యత్వం నటించం
గాలిగుర్రపు జూలు విదలించి
పూలవర్షం భువిని కురిపించి
పాటపాటకి పొంగు మున్నీరులా
మాటమాటకి జారు కన్నీరులా
మేం ఆడుతాం
మేం పాడుతాం.



— రాయలనాటి చిత్రకళా ప్రశస్తి —


లేపాక్షి దేవాలయము లోకప్పులోనున్న కొన్ని వర్ణచిత్రములు


(Courtesy : Archæological Survey of India.)



1. దేవర్షి భక్తగణపరివృతుడైన శ్రీ హరిహరనాథుడు







3. కాలభైరవస్వామి. 4. తనబిడ్డ రాకుమారుని రథచక్రముల క్రిందబడి నలిగిపోగా

చూళిక

●

— శ్రీ శతావధాని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి —

చూళికఅంటే యేమిటో కొంచెం వ్యాఖ్యానించవలసిన ప్రసక్తి కలిగి వ్యాఖ్యానిస్తూన్నాను. ఎందుకు ప్రసక్తి కలిగిందో వివరించడం ప్రస్తుతం కాదు. ఎవరో ("జ్ఞానాతాత్పర్యంతో"నే అనకోవాలి) ప్రశ్నిస్తారు. వారికిమాత్రమే చెపితే అంతే-ఆవొక్కరికి తెలియడమే కాని అంతకంటే అధికసంఖ్యాకులకు తెలియదు. పత్రికాముఖాన్ని ప్రకటిస్తే పదిమందికీ తెలుస్తుందని వ్యాసరూపంగా ప్రకటిస్తూన్నాను. ఆయాపదము నాటకసంప్రదాయజ్ఞులకు సులభంగా తెలిసేదే.

విష్కంభం, ప్రవేశకం, అంకాస్యం ఆయా తరాలకు చూళిక సహోదరి. వాట్లవల్ల నాటకానికి జరిగే ప్రయోజనం యేలాటిదో (వృత్త వర్తిష్యమాణ కథాసూచనన్నమాట) దీనికల్లకూడా ఆలాటిప్రయోజనమే కలుగుతుంది. ఆయా చూళిక సర్వమూ పండితరాయల కవిత్వంలాగ అన్యాపదేశంగా వుంటుంది. తెలుఁగులో స్వతంత్రించి రచించిన నాటకాలే లేవు. యేకొంచెమో వున్నప్పటికీ అవి "రంగాలూ మోర్కేమలూ"గా వుంటాయి గాని ప్రాచీనసంప్రదాయంగా వుండవు. అందుచేత పూర్వసంప్రదాయాన్ని అంతోయింతో అనుసరిస్తూ వ్రాసిన మాపాండవవిజయంలోన్నుంచే దీనికి వుదాహరణం చూపవలసి వచ్చింది. తొట్టతుది అంకంలో కాఁబోలు (పుస్తకం దగ్గిఱ లేదు. అందుచే పాఠభేదంకూడా రావచ్చు. ప్రధానాంశం చూచుకోఁగోరుతాను) ఆయా పద్యం వుంటుంది—

"ఆజనిలోఁగల సీటికోల
    నక్కడఁ బూచిన తమ్మికి౯ విధి
ప్రేరణ రాలిపోయినవి
    రేకులు తొంబదితొమ్మిదిప్పుడా
నీరజమందుఁ దా మిగులు
    నే? యొక్కరే కటు లయ్యోనే వలం
కారములౌనె! యాకొలను
    గాని సరోజముగారి భూమికి౯."

ఆయా పద్యం యావత్తూ చూళికకు వుదాహరణం. చూళికకు లక్షణం తెరలో వున్న పాత్రలచే కథాసూచన(అన్యాపదేశంగా)చేయుట. ఆయావాక్యం సంజయునిది. అప్పటికి దుర్యోధనుఁ డొక్కఁడు విహాగా ధృతరాష్ట్రపుత్రు లందఱూన్నూ వీరస్వర్గాన్ని అలంకరించారు.

"పలపలని మూఁకలోఁ గాల్
నిలువక గుత్తుగుత్త డిగ్గి నీకొడుకు గదా
కలితభుజుఁ డొచు నొక్కఁడు
తొలఁగి చనియె నేమి సెప్పుదుం గురునాథా."

ఆ స్థితిలో వుంది కౌరవపక్షం. అప్పుడు వైవిధంగా విలపించాఁడు పాపం సంజయుఁడు. దీనికి వ్యాఖ్యానం అవసరం లేదు. ఇది తి. వెం. కవుల కవిత్వం. ఆబాలగోపాలమూ అక్షరాస్యులందఱికీ తెలిసేదే. అయితే దీనిలో కొందఱు విద్వాంసులూ, కవులూ యేవో శంకలూ, సమాధానాలూ పుచ్చుకొంటూ వుండఁగా విన్నానని శ్రీయుతులు పిరాట్ల సత్యనారాయణగారు చెపుతూ "అయ్యా! యీ పద్యంలో 'ఆజని' అనే విశేషణం యెందుకండీ" అని ప్రశ్నించేటప్పటికి నాకు ఆశ్చర్యం కలిగింది. యెందుచేతంటారా? ఈ సత్యనారాయణగారి తెలుఁగుసాహిత్యం అల్లా టప్పా సాహిత్యం కాదు. ఈయనకు భారత భాగవతరామాయణాదులలో వుండే ముఖ్యఘట్టాలే కాదు, మనువసుచరిత్రలలో ఘట్టాలే కాదు అన్నీ

కంకోపాఠం. మా పద్యాలేకాదు, వచనాలుకూడా యీయన తూ-చా తప్పకుండా వొప్పచెపుతారు. యిందులో అత్యుక్తి లేదు. కవిత్రయకృత భారతం అలా వుండఁగా, జంగంకథగా యెవరో మహాకవి వ్రాసిన భారతం (విరాటపర్వం మాత్రమే) యీయన ముఖతః నేను విన్నాను. యీయనధారణాశక్తికి నేను ఆశ్చర్యపడ్డాను. యీయనకు యిప్పుడు జంగంకథగా పాడే బొబ్బిలికథ గాక వేఱొక జంగంకథగా పాడే బొబ్బిలికథ కంఠతః వచ్చును. నేను విన్నాను. కొన్ని విశేషాంశాలు ఆయీ కథలో గోచరించాయి. యే మాత్రం రసంగా వున్న కవిత్వమేనా సరే యీయన నోటికి వచ్చి తీరుతుంది. "యత్ర యత్ర రసవత్త్వమ్" అని వ్యాప్తి కూర్చడానికి యీయన పనికివస్తారు. పూర్వగ్రంథాలలో చాలా భాగం యీలాటి రసజ్ఞుల మూలంగానే నిల్చివున్నాయనుకోవచ్చును.

"...లోకులరసనలె
ఆ కులంగా నఁడునట్టియవి వో కవితల్"

"...నీరసపుఁగావ్యశవముల
దూరమునన పరిహరింపుదురు నీతిజ్ఞుల్" (కవికర్ణ)

అన్న సంకుసాల మహాకవి వ్యర్థవచస్కుఁడు కాఁడు. తత్తథాస్తామ్.

ఆయీ సత్యనారాయణగారు యింతటి నీరసపు శంక చేస్తే ఆశ్చర్యం నాకే కాదు–యెవరికేనా కలిగి తీరవలసిందే. తర్వాత నేను "అయ్యా! యీ 'అజని' విశేషణం వ్యర్థంగా ప్రాసకోసం పడ్డది కాదు. యిక్కడ యీ 'కొలనుపదంవల్ల గ్రహించతగ్గది కౌరవవంశం. ఆయీ వంశం ధృతరాష్ట్రపుత్త్రులతో అంతరించక పాండవులద్వారా చిరకాలం నిల్చివుండడాన్ని సూచిస్తూ ఆ విశేషణం వాడఁబడింది. (సంభవ వ్యభిచారాభ్యాం స్యా ద్విశేషణ మర్థవత్)" అని నా హృదయాన్ని వ్యాకరించాను. అప్పుడు ఆయన యీశంక స్వకపోలకల్పితం కాదనిన్నీ, తనకన్న విశేషజ్ఞులు చేస్తూవుండఁగా విని మిమ్మల్ని అడిగినాననిన్నీ చెప్పినారు. ఆలాగైతే మన జీవితకాలంలో మన అభిప్రాయాన్ని వెల్లడించడం యుక్తంగా వుంటుందని యీ కాస్త వ్రాశాను. "జీవతః కవేః ప్రష్టవ్యమ్."

ఆయీ చూళికాపద్యంవంటి పద్యం ఆ పాండవ విజయంలోనే కాదు—మా భారతనాటకాలలోనే లేదేమో? ఆయీ పద్యమే వ్యర్థపదభూయిష్ఠ మయే యెడల యిఁక అందులో ఆఁగే పద్యమే వుండదు. అయినా కవికి వున్న అధికారం యెంతవఱకంటారు? యేదో తోఁచింది వ్రాసేటంతవఱకే. ("రసారసవిచారము మాయది కాదు" చూ) తక్కిన యావత్తు బాధ్యతా రసజ్ఞలోకానిదే. అందుచేతనే "సహృదయాః ప్రమాణమ్" అంటారు వ్రాసి వ్రాసి కావ్యవ్యాఖ్యాతలు; సహృదయ శబ్దానికి సామాన్యంగా అదే అర్థం హృదయం కలవారు అని మాత్రమే. కాస్త శాస్త్ర సాహిత్యం కలవారికి అదే అర్థం "ప్రశస్తమైన (నిర్దుష్టమైన) హృదయం కలవారు" అనేది. ('భూమ నిందాప్రశంసాసు' చూ) ఆలాగే కాకపోతే లోకంలో హృదయం వుండడం సమస్తప్రాణిసామాన్యం కదా? శాస్త్రజ్ఞత లేనివారికి "నష్టే మృతే ప్రవ్రజితే క్లీబేచ పతితే పతౌ, పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే" అన్న శ్లోకం సరిగా సమన్వయిస్తుందా! తత్తథాస్తామ్.

"ఊరుమతీ కన్యా" వగయిరా ప్రయోగాలన్నీ యిట్టివే.

లోకంలో పాండిత్యం వున్నచోట సర్వత్రా సహృదయత్వం వుండదు. సహృదయత్వ పాండిత్యాలు భిన్నాధికరణాలు కావనిన్నీ, సహృదయులే పండితులు, పండితులే సహృదయులు అనీ లేని సామానాధికరణ్యాన్ని చెపుతారు గాని అది నాకు రుచింపదు. పక్షపాతాదిదోషరహితమైన హృదయం కలవారై, మంచి సాహిత్యం, అనఁగా "అబ్రవీత్పురాణ"వ్యాకర్తలకుండే సాహిత్యంవంటిది కాని నిశితమైన సాహిత్యం యెవరికి వుంటుందో అట్టివారి వ్యాఖ్య యీలోకంలోనే కాదు స్వర్లోకంలోకూడా గౌరవింపఁబడుతుంది. అంతో యింతో శబ్దశాస్త్ర

ప్రవేశం వుంటేనేకాని వ్యాఖ్యకు అధికారం వుండదు. మచ్చు చూపుతాను.

"న మానినీ సంసహతేఽన్యసంగమమ్" - యిది భట్టికావ్యంలోది. స్త్రీ (తన భర్తకన్న మాట) అన్యసంగమమ్=అన్యపురుషసాంగత్యమును సహించదు అని శాస్త్రసాహిత్యం లేనివారు వ్యాకరిస్తారు. యథార్థంలో అన్యస్త్రీసాంగత్యమును సహించదు అని అర్థం రావాలి. శాస్త్రసహాయం లేనిదే యేలా వస్తుంది అభిమతార్థం? శాస్త్రం సమగ్రంగా చదివినవారికికూడా "సర్వనామ్నో వృత్తిమాత్రే పుంవద్భావః." అన్న వార్తికం సమయానికి జ్ఞప్తికి రావాలి. అప్పుడు అభిమతార్థసిద్ధి కలుగుతుంది. అందుకేకదా ఒక విద్వన్మహాకవి "జనిత్వా కింను స్యాత్ కృతమపి యది శాస్త్రం నవిదితమ్" అన్నాఁడు. అభియుక్తోక్తి వొకటి యీలాగు వినఁబడుతూ వుంది! "మహాభాష్యంవా పాఠయేత్ మహారాజ్యంవా పాలయేత్" మహారాజ్య పరిపాలన వాపత్తుంగా మనపెద్ద లంగీకరించారు. దీనివల్ల మన పూర్వులకు శాస్త్రాధ్యయనమందు యెంతటి అభిమానం వుండేదో వ్యక్తమవుతుంది.

యేదో సహృదయశబ్దాన్ని వ్యాకరిస్తూ ప్రసక్తంగా మతోపుంతలోకి దిగినట్లుంది. ఆయీసహృదయులమీఁద యెక్కువగా ఆధారపడేది కవిత్వమేకాని యితరం (శాస్త్రం) కాదు. శాస్త్రం వారివారి పాండిత్యాన్నిబట్టి పూర్వపక్షసిద్ధాంతాలు చేసికోవడానికి అవకాశం వుంటుంది. కవిత్వమో? రసవంతమా కాదా అనేవిషయం కేవలమూ సహృదయాధీనం. కొంచెం మచ్చుచూపి చర్చిస్తాను. యెఱ్ఱాప్రగడ—

"ఈలోకము యశుఁ గొందఱ
కాలోకము కొందఱకు నిహంబును బరమున్
మేలుగఁ గొందఱ కధిపా!
యేలోకము లేదుమావెఁ యిలఁ గొందఱకున్"

అంటూ వొక పద్యం రచించాఁడు. యీపద్యం చదువుతున్నప్పుడల్లా నాకు వొళ్లు పులకరిస్తుంది. యిది సంస్కృతభారతంలో వున్నదాన్నిబట్టే రచించాఁడో, లేక స్వకపోలకల్పితంగానే రచించాఁడో! నేనెప్పుడూ పరీక్షించి చూడలేదు. యెందుకు నాకు వొళ్లు పులకరిస్తుందో చెప్పమంటే నేను చెప్పలేను. చెప్పలేక వూరుకోను. వూరుకోక యేంచేస్తానంటే? పైమీఁది బట్ట మెడకు చుట్టుకొని ఆలా ప్రశ్నించే మహనీయులకాళ్లకు "ఉరసా మనసా—ప్రణామోఽష్టాంగ ఉచ్యతే" చేస్తాను. ఆయీ విషయంలో అంతకంటె కర్తవ్యంలేదు. ముమ్మాటికీ లేదు. యేమన్నాఁడు? దశరూపకంలో "తస్మై నమ స్స్వాదు పరాఙ్ముఖాయ" అనలేదా? నే నుదాహరించిన భారత పద్యంలో యేవిధమైన వ్యంగ్యం గాని, శబ్దాలంకారం గాని, అర్థాలంకారంగాని లేనట్టే నాకు తట్టుతుంది. అయితే యీజగత్తు నాతోటే వుందా యేమిటి? యేదో వ్యంగ్యం దీనిలోకూడా వుందనేవారు బయలుదేరితేనో. అందుకేకదా 'నాకు తట్టుతుంది' అనవలసి వచ్చింది! యీలాటిచోటకూడా వ్యంగ్యాలు తీసి పెద్దపెద్దవుత్తరాలు వ్రాసి సమాధానాలు కోరేవారున్నా బయలుదేరి కోలాహలం చేస్తున్నారు. తేభ్యో మహద్భ్యో నమః. వారి సాహసం వర్ణనీయం.

ఆయీ విషయం-అనఁగా పైభారతపద్యంలో వ్యంగ్యమేదేనా వుందా లేదా అనే విషయం తేల్చవలసివస్తే యెవరికి అధికారం వుంది? 'సహృదయాః ప్రమాణమ్' అనడంకన్న గత్యంతరం లేదు. లేని వ్యంగ్యం వుందనడం యెందుకు ప్రసక్తమవుతుంది అని ప్రశ్నిస్తారేమో? వున్న కుళ్లంతా అక్కడే వుంది. సహృదయమాత్రగోచరమైన యీవిషయంలో యెవ లేలాటిపికివాదం చేసినా చలామణీ అవుతుంది కదా? "కాదన్నవాఁడు కరణం." ప్రమాణములలో వొకప్రమాణం ఆప్తవాక్యం. కాని

"ఆప్తవాక్యంబు విశ్వాస్య మంటివేని
ఆప్తుఁ డెవ్వఁడో? తెలియంగ వలవి యనునె?"
(దేవీ భా. ౭ స్కం)

"ఆప్తస్తు యథార్థవక్తా"
అట్టి యథార్థవక్తలు లోకంలో వుంటారా అని

సంశయించి యీ భారం మనుష్యులమీఁద పెట్టక "వేదాః ప్రమాణమ్" అని, అంతమాత్రంతో సంశయ నివృత్తి కాకపోవడంచేత నేకదా వేదాలకు అపౌరుషేయత్వాన్ని కల్పించవలసి వచ్చింది. యిదంతా దేని మీఁద వచ్చింది? "సహృదయాః ప్రమాణమ్" అనేదాని మీఁద. అక్షరాస్యు లందఱూ సహృదయులు కారు. నిష్కళంకహృదయులైన విద్వాంసులే సహృదయ శబ్దవాచ్యులు. అయితే లోఁగడ చూపిన భారత పద్యం "సహస్ర వృశ్చిక క్షిప్తమశ్వక్రే" అన్నట్టు (అయ్యవార్ల గారి నట్టిల్లులాగు) వుంది. దీనిలో వ్యంగ్యార్థాన్ని తీయడం కష్టసాధ్యం కాదా? అంటే వినండి.— అబద్ధానికి అర్థమేమిటి? సహృదయైకగమ్యం కదా యీ "అస్తినా స్తివిచికిత్స". అందుచేత ఆత్మవంచనకు వెఱవకపోతే యిష్టం వచ్చినట్లల్లా వాదింపవచ్చు. (సుఖమస్తీతి వక్తవ్యం. అథాతో బ్రహ్మజిజ్ఞాసా. సీయమ్మ జ్ఞాసా. సా... సా... సా...) కొందఱు "అందులో యేదో వుంది కాఁబోలును. లేకపోతే ఆయన అలా అంటాగా" అనుకొనేవారున్నూ వుంటారు. అందుచేతనే "కో వేత్తి కవితాతత్త్వ మీశ్వరో వేత్తి వా నవా" అనవలసి వచ్చింది. ఆ యీ విషయం వాదంవల్ల తేఁదు. ఈ లోకంలోనే తేలదనికూడా చెప్పడం సాహసం కాదు. కొన్ని వ్యంగ్యాలు గ్రంథకర్తకు అభిప్రేతములు కాకుండా స్ఫురించేవిన్నీ వుంటాయి. మచ్చు చూపుతాను—

"సోమయాజుల మార్గంబు సొంపు గనక
పిన్న పెద్దల మర్యాద పేరుకొనక
భట్టరీతిని వాపోవునట్టి నట్టి
కాకవులు కాకవులు నొక్కకడుపువాఁర."

(శ్రవణా)

యిందులో శబ్దశక్తిమూలకమైన ధ్వనివల్ల తిక్కన, పినవీరభద్రుఁడు (పిల్లలమఱ్ఱి), పెద్దన్న పేరు స్ఫురిస్తున్నారు. ఆ పద్ధతిని భట్టుపదమువల్ల వసుచరిత్ర కర్త కాఁడని నేను యెంతగా ప్రమాణం చేసి చెప్పినా ప్రయోజనం లేదు. నిజానికి నాకు భట్టుమూర్తికి ఆ దెబ్బ తగలడం స్వప్నేపి యిష్టం లేదు. ఆ పదం వేయని పద్ధతిని ఆ పద్యం సరసంగా పూర్తి కాదు. పోనీ, పద్యమే మానుకోరాదా—యీ పూజ్యపూజావ్యతిక్రమం యెందు కంటే: మా ముత్తాతగారు (పెద్దకవీంద్రుఁడై పేరు చెందినవాఁడు పిన్నముత్తాత సర్వన్న గారు) కాకవులను గూర్చి వ్రాస్తూ "కాకవులు, ఘూకవులు (గుడ్లగూబలు) నొక్క గూటివార" అన్నారు. ఆ పద్యంమాదిరిపద్యం చెప్పాలని చిన్ననాటినుంచీ నాకు కుతూహలం. అసలే మానితే ఆ వుబలాటం తీరడం యెట్లా? అందుకోసం యీ పాపానికి వొప్పుకోవలసి వచ్చింది. నాకు పెద్దన్నగారి మనుచరిత్రమీఁదకంటె భట్టుగారి వసుచరిత్రమీఁదనే (యిప్పుడు కాదు, ఆ వయస్సులో. యిటీవల మాటేంది అభిప్రాయం) పక్షం జాస్తి. అట్టి స్థితిలో ఆత్మాభిప్రాయవిరుద్ధంగా అలా యెందుకు వ్రాస్తానంటాను.

చెప్పొచ్చేదేమంటే? స్ఫుటంగా దుర్వాసనగాని, సువాసనగాని కొడుతూవున్నప్పుడు అన్యథా అపలపిస్తే (అది నిజమైనా సరే) దాఁగదు. "నహి కస్తూరికామోద శ్శపథేన నివర్తతే"

యేదో చాలా దూరం వచ్చాం. వ్యంగ్యాని కేనా తోవా తెన్నూ వుండాలి. అంతే కాని సుద్దేస్తు జొన్నచేను మాదిరి వీలు పడదు. "అస్తమేతి గభస్తి మాన్" ఆయీవాక్యం వాళ్ల వాళ్ల మనస్సుకు, వృత్తికి, శీలానికి అనుగుణంగా యెన్నో సందర్భాలను స్ఫురించేటట్టు చేసిందంటే అది సహృదయు లామోదిస్తారు గాని "మహదైశ్వర్యాభివృద్ధిరస్తు. అష్టపుత్ర బహుధనమస్తు. దీర్ఘాయుష్యమస్తు" అని ఆశీర్వదిస్తే "యీ ఆశీర్వచనంలో యిదివఱకు ఆయీ సంపత్తులు లేవు కనక యివి క్రొత్తగా కలగాలని ఆశీర్వదించినట్లయింది" అని వ్యంగ్యం తీసే బుద్ధిమంతు లున్నారని నే నెఱుఁగను. కాని యిటీవల అట్టివారున్నట్లు గోచరించింది. యిది కాలం చేసిన సాయం. "కాలో హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ"

భవతు. ప్రకృతమనుసరామః. సహృదయులను సుఖింపచేసిన్నీ, వ్యంగ్యాన్ని సుఖించిన్నీ యేకొంచెమో ప్రసక్తానుప్రసక్తంగా ముచ్చటించినట్లయింది. విశేషణం అంటే యేమిటో, దాన్ని కవిత్వంలో యేవిధంగా వ్యాఖ్యాతలు పాటించాలో, శాస్త్రంలో యేవిధంగా పాటించాలో కొంచెం వివరిస్తే "ఆఅనిలోఁతు నీటి కొలను" అనే పద్యంలో వున్న "ఆఅని" అనే విశేషణం యెందుకు అనే ప్రశ్నకు సమాధానం యిచ్చినట్లవుతుంది. వ్యాకరణసూత్రాలలో వుండే తు - చ వగయిరాలకుకూడా సార్థక్యం చెప్పితీరాలి. శాబ్దికుల అనుగ్రహాలకుకూడా డిటో. మీమాంసశాస్త్రంలో తౌతాతికమతం అంటూ వొకమతమే బయలుదేరినట్లు ఆశాస్త్రజ్ఞులవల్ల విన్నాను. ఆమతం 'తు'అనే అక్షరానికి ఒకానొక బుద్ధిమంతుఁడైన శిష్యుఁడు చక్కని సమన్వయం కనపఱచి చూపేటప్పటికి గురువుగారు సంతోషించి ఆశిష్యుణ్ణి 'తుతాత' అని సంబోధిస్తూ వచ్చారనిన్నీ, పిమ్మట అతఁడు యేర్పఱచిన సిద్ధాంతాన్ని తౌతాతికమతంఅని వ్యవహరించడం కలిగిందనిన్నీ గురువులద్వారాగా వినడం. శాస్త్రంలో సమన్వయించినంత నిక్కచ్చిగా విశేషణాలకు సార్థక్యం చెప్పవలసిందని నిర్బంధిస్తే చెప్పనూలేఁడు; చెప్పవలసినదిన్నీ లేదు. "సుప్పక్కణాం పరిపోషనం సహతే శాస్త్రేషు భిన్నాత్మనామ్." అన్నారు కాళిదాసుగారు. శ్రీనాథుఁడు "విద్వాంసుల్ రాజమహేంద్రపట్టణమునన్ ధర్మాసనంబుండి ప్రధ్వంసాభావము ప్రాగభావమనుచున్ దర్కింతురు" అని గేలిచేశాఁడు. యెవరో వొకమహాకవి "వయం బకుళమంజరీ గళదకీణ మాధ్వీఝరీ ధురీణ ఘభణితిభిః ఫణితిభిః ప్రమోదామహే" అన్నాఁడు. వాసవదత్తలో "సత్కవికావ్యబంధ ఇవ అనవబద్ధ తుహినః." అంటూ గ్రీష్మఋతువును వర్ణిస్తూ తు + హి + న ఇత్యాది పాదపూరణమాత్ర ప్రయోజకములు సత్కవుల కవిత్వాలలో దొరలవని సూచించాఁడు. అది శ్లేషలో వాడిన వాక్యం. దానిని అంత నిక్కచ్చిగా పాటించడం యుక్తిసహం కాదు.

"శాలాయ నీలవపుషే నవకింకిణీక
జాలాభిరామజఘనాయ దిగంబరాయ
శార్దూల దివ్యనఖభూషణ భూషితాయ
నందాత్మజాయ నవనీతముషే నమస్తే"

ఆయీ శ్లోకంలో శార్దూలపదానికీ, నఖపదానికీ మధ్య "దివ్య" అనేది పాదపూరణానికేనా, లేక అవశ్యకమా? అంటే ఛందోవాఙ్మయంలో ఆమాత్రం సహ్య మనేదే సరసమైన జవాబు. పెద్దపులిగోళ్లల్లో కొన్ని చెడ్డవిన్నీ వుంటాయి కనుక తన్నివృత్త్యర్థం అనిన్నీ చెప్పేవా రుంటారు. కాని వారు చేదస్తులోనివారు—అతిసాహసులు.

"స్వాధీనో రసనాంచలః పరిచితా
శ్శబ్దాః కియంతః క్వచిత్
క్షోణీంద్రోవనితామకః సమద
శ్వాంతాస్స్వతంత్రంజగత్,
తద్యూయం కవయో వయం వయమితి
ప్రస్తావనాహుంకృతి
స్వచ్ఛందం ప్రతిసద్మగర్జత వయం
మౌనవ్రతాలంబినః"

'శార్దూలనఖభూషణ' అంటే నఖపదం మంచిదానికీ, చెడ్డదానికీకూడా సామాన్యంగా వాచకమైనా భూషణానికి వుపయోగించుకొనేది, అందులో శ్రీ కృష్ణమూర్తివంటివానికి వుపయోగించుకొనేది చెడ్డదేల కావలెను కనుక విశేషణం అంతగా ఆవశ్యకం కాదు. యింకా దీనిలో చేస్తే పిచ్చికేంకలు కొన్ని చేయవచ్చు. రసజ్ఞులు చేయరు. శుష్కపండితులు చేస్తారు. తేభ్యో మహద్భ్యో నమః.

"సంభవవ్యభిచారాభ్యాం స్యా ద్విశేషణ మర్థవత్"—ఆయీ శ్లోకార్థం వాల్మీకికి తెలియదా? తెలిస్తే "తంతు దేశం నపశ్యామి యత్ర భ్రాతా సహోదరః" అంటాఁడే? రాముఁడూ, లక్ష్మణుఁడూ సహోదరులేనా? కవితాసమన్వయం వేఱు; శాస్త్రసమన్వయం వేఱు. యింతటితో దీన్ని ఆఁపుతాను.

మా పాండవవిజయంలోని 'ఆఁటిలోఁకు' విశేషణం శాస్త్రిలలో విశేషణాలమాదిరిగా సమన్వయించినా తీరుపోదు. యెంత లోఁతైన కొలనైనా యే ద్వాదశవర్షక్షామమో తటస్థిస్తే ఆటే (యెండి) పోవచ్చును. ఇది అప్పుడుకూడా యెండదన్నమాట. ఆ యీ పద్యం చూళికకు వుదాహరణం అని లోఁగడనే వ్రాశాను. మఱికొన్ని సందర్భాలు జిజ్ఞాసువులకుపకరిస్తాయని వ్రాశాను గాని లేకపోతే యింత వ్రాయవవసరం లేదు. యీవత్తూ అన్యాపదేశం. యీ నీరజం కుశేశయమ్. 'సహస్రపత్రం కమలం శతపత్రం కుశేశయం'. దుర్యోధనాదులు నూర్గురూ నూటుకేకులు. అప్పటికి దుర్యోధనుఁడే మిగులు. తక్కినది 'పున్నకు పున్న హళ్లికి హళ్లి.' ఇంతతో ఆఁపుతాను. 'వచ శంకా నచోత్తరం.'



సంగీత సాహిత్యాలు: అక్షరరమ్యత*

= శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ =

సంగీతానికీ, సాహిత్యానికీ స్నేహ మెంత ప్రాచీనమో స్పర్ధకూడా అంతే ప్రాచీనం. ఈ రెండూ మొదటినుంచీ ఒకటి కొకటి ఎంతో సహాయంగానే సంసారం చేస్తూవుండినా, ఒకదాన్ని మరొకటి అడగదొక్కవలెనన్న పోటీ ఎప్పుడూ మరచినట్లు కానరాదు. దీని ఫలంగా రెండూ తెగబలిసి స్వాతంత్ర్యానికై ప్రబలమైన ప్రణయకలహం చేసినవి. పరిణామమేమంటే, రెండూ ప్రాయం ముదిరిన అన్నదమ్ములవలె ఆస్తిని పంచుకొని వేరువేరుగా వ్యవహారం జరుపుతూవున్నవి. అప్పుడప్పుడు యథోచితంగా పరస్పరం ఉపకరించవచ్చును. కలిసి మెలిసి సుఖించనూ వచ్చును. అంతేకాని నిజానికి దానిల్లూ దీనిల్లూ వేరు. సాహిత్యం లేని సంగీతమే, సంగీతం లేని సాహిత్యమే ఇప్పటికి మన కెక్కువగా లభిస్తూవున్నవి. కావ్యాలు చదివేటప్పుడు అపస్వర సుస్వర చింతగానీ, పాటపాడేటప్పుడు సుశబ్దాపశబ్ద వివక్షగానీ అంతగా ఉండనవసరం లేదని మనమిప్పుడు నేర్చుకుంటున్నాము.

సౌభ్రాత్రం వదలితే బదుకే లేదు

ఐతే ఈ రెండూ పుట్టిననాటినుంచీ కూడా పెరిగినవి. కనుక సౌభ్రాత్రాన్ని పూర్తిగా వదలి బదకడం కష్టం. ఎందుకంటే - చిన్నప్పటినుంచీ భాషను మెట్లుమెట్లుగా మనమందరమూ నేర్చుకుంటూ వున్నాము. కనక సాహిత్యం మనలను సహజంగా, స్వతంత్రంగా, త్వరగా ఆకర్షిస్తుంది. కాని నాదలయ విద్యను అట్లు నేర్చే పద్ధతి మనలో లేదు. కాబట్టి దాని రుచీ, రహస్యమూ చెవిమట్టాన్ని దాటి మనస్సు దాకా దిగవలెనంటే ఏ కొందరికో కాని అందరికీ అది సాధ్యం కాదు. కాబట్టే భాషాసాహాయ్యం లేని నాదలయకళారచనలను - అంటే రాగాలాపన, తానం, స్వరకల్పన మొదలైనవాటిని - మనలో సంస్కారపూతులైన గొప్పవారే అర్థంచేసుకొని అనుభవించలేకున్నారు. భాషాదృష్టితోనే సంగీతకళను విమర్శించే మట్టాన్ని దాటినవారు మన దేశంలో ఇప్పుడు చాల మంది లేరు. కాబట్టే, సాహిత్యపు యాజమాన్యం సంగీత సంసారంలో ఇంకా చెల్లవలసే వుంది. చెల్లుతూనే వుంది.

హద్దులుమీరితే ప్రమాదం పెద్దదవుతుంది

యాజమాన్యమిస్తే చాలు, యజమానుని యిష్టానిష్టాలన్నీ మనమూ నెత్తిన వేసుకోవలసి వస్తుంది. భావసహాయాన్ని సంగీతం కోరిన వెంటనే వ్యాకరణం, అలంకారాలు, గుణదోషాలు, రసాలూ ఇత్యాది సాహిత్యనియమాలన్నీ సంగీతరచనలోకూడా ప్రవేశించి నిలుస్తుంది. సంగీత గంధం లేని సాహిత్య పండితులందరూ సంగీత విమర్శకు లౌతారు. త్యాగయ్యగారి 'దాశరథే దయాశరధే' అనే కీర్తన విని ఒక గొప్ప సంస్కృత పండితుడు 'ఇదేమయ్యా త్యాగయ్యకు థధల భేదమే తెలిసినట్లు లేదే' అని ఆక్షేపించినాడు. తెలుగు వ్యాకరణాన్ని కంఠపాఠం చేసిన ఆరవ సంగీత విద్వాంసు డొక్కడు త్యాగయ్యగారి కృతుల్లో సాధ్యమైన చోట్లలో అంతా వ్యావహారి

* ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రమువారి అనుమతితో.

కంగా వున్న పదవాక్యస్వరూపాలను తిద్దివేసినాడు. ఇంక భాషను సరిగా చేర్చని కీర్తనకర్తలు ఈ లాక్షణికుల తృప్తికై పడే పాట్లు చూస్తే అయ్యో పాపమనిపిస్తుంది. పూచి శ్రీనివాసయ్యంగారు 'సద్భక్తిని గల్గజేసి సంతసించి బ్రోవుమయ్య' అని చక్కని వర్ణమెట్టులో కృతి రచిత్తినారు. ఐతే, అనుపల్లవిలో ప్రాసానికి ఇంకొక ద్భకారం సంపాదించడం కష్టమైంది దాయనకు. మరి ప్రాసాన్ని వదలే ధైర్యమూ లేదు. గనక తమిళ సంప్రదాయంలో ద్భ, ప్ప, రెంటికీ రాతలో భేదం లేదు కాబట్టి 'శతపూర్వమునై త్యజని విదళించిన సంతానరామ' అని అతికించి ప్రాసం వచ్చిందనిపించి కృతకృత్యుడైనా డాయన. త్యాగయ్య, దీక్షితులు మొదలైన మహామహులుకూడా ఇటువంటి కష్టాలకు అప్పుడప్పుడు చిక్కి నలిగి సంగీతాన్ని కొంత నలిచినారనే చెప్పవలసివుంది. సాహిత్యంలో వా రెంత సమర్థులై వుండినా వారి సంగీతంలో వున్నంత వర్చస్సూ, ప్రతిభా దానిలో కానరాదు. కనక సాహిత్య నియమాలూ, సంకేతాలూ వారిని కొంతైనా కష్టపెట్టక వదలలేదు. కాబట్టి, నాదాభిమానం కల రచయితలు భాషాభిమానాన్ని చాలా హద్దులో వుంచుకోకపోతే మూలద్రవ్యానికే లోపం వచ్చే సంభవం కద్దు. అట్లు హద్దులో ఉంచగలిగిన భాష, సాహిత్యం సంగీతానికి ఎన్నో విధాల సహాయం చేయగలదు. అందులో ముఖ్యమైన ఒక విషయాన్ని మాత్రం గురించి ఇప్పుడు నాల్గుమాటలు మనవి చేస్తాను.

నన్నయ్యగారి నాణెమైన ఉపదేశం

ఆదేదంటే, నన్నయ్యగారు సాహిత్యంలో మనకుపదేశించిన అక్షర రమ్యత. సంగీతంలో దీని విలువ అపారం. సంగీతం - అంటే నోటిపాట - అచ్చుల మూలాన బతికే కళ. హల్లులకు స్వతంత్రంగా- అనగా వెనుకో ముందో అచ్చులేకపోతే - శబ్దాన్ని వ్యక్తం చేసే సామర్థ్యమే లేదు. ఇక నాదం మాట చెప్పనక్కర్లేదు. మరిన్నీ హల్లుల శబ్దం ఖండంగా వుంటుంది. అఖండనాదాన్ని వ్యక్తపరిచే శక్తి అచ్చులకే వుంది. కనక నాదదృష్టికి హల్లులు ప్రతిబంధక సామగ్రి. అట్లే అచ్చులకున్నూ స్వతంత్రంగా పదాలుగా, వాక్యాలుగా కూడుకొని అర్థాన్నీ, భావాన్నీ వ్యక్తపరిచే శక్తి లేదు. ఒక అచ్చునుంచి ఇంకొక అచ్చుకు దూకవలెనంటే నడుమ హల్లు ఊతలేనిది సాధ్యం గాదు. ఇట్లు ఇవి రెండూ అన్యోన్యాశ్రయాలైనా నాదరచనకు - అంటే సంగీతానికి - అచ్చులున్నూ, శబ్దరచనకు - అంటే భాషకు - హల్లులున్నూ జీవాలని చెప్పవలెను. కాబట్టి, భాషలో అచ్చులకంటే హల్లులమీదనే దృష్టి ఎక్కువగా నిలుపుతాము మనం. అచ్చులను సాధ్యమైనంతా నములివేస్తావుంటాము. సంగీతంలో వ్యవహారం దీనికి ఎదురు. అచ్చులను పొడిగించుకుంటూ యథాశక్తి హల్లులను నమలవలసి వుంటుంది. మరిన్నీ నాభిలో పుట్టి, కంఠంమూలాన ధారాళంగా వచ్చే అచ్చుల నాదధారను నోటిలో భిన్న భిన్న స్థానాలలో పుట్టే హల్లులు అరికట్టుతాయి. కాబట్టి సంగీతంలో అక్షర రమ్యత అంటే హల్లుల ప్రాజాపత్యం మితంగా వుండే అచ్చుల సామ్రాజ్య మన్నమాట.

మరిన్నీ ఋ, ౠ అనే కృత్రిమాచ్చులను అట్లుండనిచ్చి తక్కినవాటిని గమనించినా మంటే, అచ్చులన్నీ స్వతః రమ్యంగా కానవస్తాయి. నాదాన్ని ఆ, ఈ, ఊ అని యే అచ్చుమూలాన వ్యక్తంచేసినా, దాని వన్నెలో భేదముంటుందే కాని, రమ్యతలో భేదముండదు. హల్లు లట్లా కాదు. పరుషాలు, మహాప్రాణాలు, ఒత్తక్షరాలు, అందులోనూ క్వ, ద్మ, ష్ట్రీ వంటి విజాతీయ సంయోగాలూ, ఒకటి తర్వాత ఒకటి కటుతరంగా మనకు తోస్తుంది. కాబట్టి నాదవ్యక్తికి సహాయంగా వచ్చే భాష అసంయుక్త పరుషపరశమయంగా వుంటేనే గానకళ తలయెత్తుకొని మెరుస్తుంది. లేకుంటే ఒదిగి కుంటుతుంది. పై కటువర్ణాలను పూర్తిగా తోసివేసి పాటలు రాయడం ఏభాషలోనైనా అసాధ్యమే. ఐతే వాటివల్ల పాటకు కలిగే అడ్డంకి మనసుకు అర్థమైతే రాసేటప్పుడు వాటిని ఎంతో హద్దులో పెట్ట గలుగుతాడు కవి.

ప్రాచీనగీతకవుల ప్రకృష్టసాక్ష్యం

ఈ అక్షరరమ్యతాతత్త్వాన్ని ప్రాచీనగీతకవులంతా చాలవరకూ మననం చేసినవారే. సంగీతరత్నాకర రాగాధ్యాయంలో ఉదాహరించిన ప్రతిపాటా దీనికి సాక్ష్యమిస్తుంది. మచ్చుకు భిన్నతానరాగ లక్ష్యంగా వున్న ఈ క్రిందిపదం చూడండి :

"హరవరముకుటజటాలలితం
అమరవధూకుచపరిమలితం
బహువిధకుసుమరజోరుణితం
విజయతే గంగావిమలజలం"

హల్లుల వైవిధ్యానికీ, విచిత్రసంయోగాలకూ సంస్కృతభాషలో వున్నంత ప్రచారం మన దేశంలో మరేభాషలోనూ లేదనే విషయం గమనిస్తే పైరచన చేసినవాడు ఎంత సంయమము గలవాడో తెలుస్తుంది. ఇతరభాషల చరిత్రమంతా ఆ హల్లుల వేగను తగ్గించుకొనే ప్రయత్నంగానే కానవస్తుంది. సంస్కృతభాషలో బంధమంతా పరుషమే నన్నాడు ఒక ప్రాచీనప్రాకృతకవి. కనకనే నేమో ప్రాకృతాది దేశభాషలలో వున్నంత యెక్కువగా గీతవాఙ్మయం సంస్కృతంలో లేదు. ఒకవేళ ఉండివుండినా సంగీతపు సరణితో అతుకకపోవడంచేత నశించిపోయిందేమో. ఆభాషను వాదవ్యక్తికి సహాయంగా సవరించడమంటే గొప్ప సాహసం మాత్రమే కాదు. త్యాగం కూడా. అందుకై కవి యెన్నో అర్థాలూ, భావాలూ వదులుకోవలసివుంటుందిగనక. ఈకార్యంలో నెగ్గినవారిలో అంతా జయదేవుడు అగ్రగణ్యుడుగా గానవస్తాడు. అతని గీతగోవిందం పాటలూ, పద్యాలూ మేళగించిన అద్భుతరచన. అందులో పాటలే ముఖ్యం; పద్యాలు చదవడానికి, పాటలు పాడడానికి; కనక భాషావిషయంలో జయదేవుని దృష్టీ, ప్రయత్నమూ ఆరెంటిలోనూ భిన్నంగా కానవస్తుంది. తన సరస్వతి 'మధురకోమలకాంతపదావళి' అన్నాడతడే. కాని యీధర్మాలు అతనిపద్యాలకంటే పాటల్లో ఎక్కువగా వ్యక్తమైవుంది. అతని పద్య మొక్కటి:—

"రాసోల్లాసభరేణ విభ్రమభృతా
మాభీరవామభ్రువాం
అభ్యర్ణే పరిరభ్య నిర్భరమురః
ప్రేమాంధయా రాధయా
సాధు త్వద్వదనం సుధామయమితి
వ్యాహృత్య గీతస్తుతి
వ్యాజాదుద్భటచుంబితః స్మితమనో
హారీ హరిః పాతు వః"

అతని పాటలలోని తునక ఒకటి:—

"సంచరదధరసుధామధురధ్వని
ముఖరితమోహనవంశం
చలితదృగంచలచంచలమౌళిక
పోలవిలోలవతంసమ్
రాసే హరిమిహ విహితవిలాసం
స్మరతి మనో మమ కృతపరిహాసం"

గీతగోవిందాన్ని అనుకరించి వ్రాసినవారెందరో వున్నారుకాని, వారికెవరికీ భాషపైన ఈ సంయమం లభించలేదు.

ఈ క్రిందిది ప్రాచీనాంధ్రవాగ్గేయకారకులలో నొకరైన తాళ్లపాక అన్నమయ్యంగారి రచన:—


"ప. అలరులు కురియఁగ నాడెనదే
అ. అలకల కులుకుల నలమేలుమంగ
చ. అరవిరిసోబగుల నతివలు మెచ్చగ
అర తెరమరుగున నాడెనదే
వరుసన పూర్వదువాళపు తిరుపుల
హరి గరగించుచు నలమేలుమంగ.
చ. మట్టపుమలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాటెనదే
పెట్టిన వజ్రపు పెండెపు తళుకుల
నట్టిటు చిమ్ముచు నలమేలుమంగ."

అచ్చుల రమ్యత

ఇట్లే అచ్చులుగూడా పాటకు కావలసినట్లు లొంగిపోతూ రమ్యతను హెచ్చించుకోవలసివుంటుంది.

అవి స్వతోరమ్యమైన వర్ణాలు. కాని భాషలో వాటికి కాలనియమ ముంది; లఘువు కొక్కమాత్ర, గురువుకు రెండు, ప్లుతానికి మూడు. అంతేకుమించి భాషలో అచ్చులను పొడిగించనక్కరలేదు. కాని పాట కంతచాలదు. జయదేవాదుల రచనలలో తొంభై పాళ్లు ఈ నియమాన్ని మీరకుండానే పాట నడుస్తుంది. కనకనే నాదవ్యక్తికి విస్తరానికి అవకాశం వాటిలో చాలదనిపిస్తుంది. కాబట్టి, పాటలలో లఘువుకు ఒకటికంటే, గురువుకు రెంటికంటే, కావలసినన్ని మాత్రలెక్కువయిచ్చి, స్వేచ్ఛగా ఈడ్చి, రచించినారు తరువాతి వాగ్గేయకారకులు. ఇదే సంగీతంలో అచ్చుల రమ్యత. ఈ జాతిబయకారపద్ధతే ఇప్పుడూ నడుస్తూవుంది. జయదేవాదుల పాటలలో అక్షరాలనుబట్టి మాత్రాకాలమును చాలవరకూ కనిపెట్టవచ్చును. కాని క్షేత్రయ్య, త్యాగయ్య, దీక్షితులు మొదలైనవారి రచనలలో అది సాధ్యమే కాదు. త్యాగయ్య 'కొలువై యున్నాడే కోదండపాణి' అనే పద్నిమిదిమాత్రలు గల పదకొండక్షరాలను ౧౨౮ మాత్రల కాలంలో అతికించి భావసంకెళ్లను పక్కకు తోసివాడు.

సంగీతసాహిత్యాల పరస్పరస్పర్ధలో సంగీతము పై చెయ్యిగా నిలచినప్పుడు కలిగే సహజపరిణామాలలో ఈ అక్షరరమ్యత ఒకటి. అంతేతప్ప నియమమూ, శాస్త్రమూ కాదు. నిర్మాణోత్సాహం సంగీతంలో ఎక్కువగా వుంటే సాహిత్యం తనంతట ఈ రమ్య వద్ధకు దిగుతుంది. అట్లుగాక భక్తి, శృంగారం మొదలైన భావాల వుద్రేకం ఎక్కువగా వుంటే సాహిత్యమిచ్చే అక్షరాలెటువంటివైనా వాటితోనే సంగీతం సవరించుకోవలసివుంటుంది. మహామహులైన వాగ్గేయకారులందరి రచనలలోనూ దీన్ని మనం చూడవచ్చును.



కంపెనీప్రభుత్వంనాటి ఆంధ్రదేశం

విదేశవర్తక సంఘాల వాణిజ్య విధానాలు

❁

= శ్రీ అజ్జరపు వెంకటరమణరావు =

భారతీయ ప్రాచీన వస్త్ర పరిశ్రమలు ప్రపంచ విఖ్యాతిని సంపాదించుకొంటే తెనుగుదేశం ఏనాడూ యీ ప్రఖ్యాతిని పంచుకోని కాలం లేదు. చైనా, పర్షియా, గ్రీసు, రోము, అరేబియా, మలాకా దీవులు, మలయా ద్వీపకల్పం, యిటీవల యింగ్లాండు, ఫ్రాన్సు, పోర్చుగల్లు, హాలెండు దేశాలు మన బందరు అద్దకాలే, చింజిలే, పాలంపోరులే, తల గుడ్డలే, రుమాళ్లే అంటే ఎంతో మోజుపడేవి. మనం పంపించిన బట్టలే కట్టుకొనేవి. విదేశపు అంగళ్లలో మన తెలంగాణపు వస్త్ర పరిశ్రమలకోసం విపరీతమైన వ్యామోహం వుండేది. ప్రజలు ఎంత ఖరీదయినాసరే యీ రంగురంగుల తళతళ మెరిసే మన బట్టలు దొరికితేనే చాలునని కొనుక్కునేవారు.

క్రీ. శ. ౧౬-వ శతాబ్దంనాటికి మలయా ద్వీపకల్పం ప్రసిద్ధిపొందిన అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం. అనేక దేశాలనుంచి బేహారులు అక్కడకు తమతమ వర్తక సామగ్రితో చేరుకొనేవారు. ఒక దేశం యింకొక దేశంతో తన సామగ్రిని మార్చుకొని, తనకు కావలసిన సామగ్రిని తీసుకొనిపోయేది. కాని ఆనాటి వర్తక వ్యాపారాలలో మన తెలంగాణం సముద్రతీరంనుంచి అనుపచ్చటి శాలువలు, చీరలు, అద్దకాలు, రంగురంగుల మజిలీలు, చలువలు, నీలి, ఎర్రగుడ్డలు తెచ్చి అమ్మే అరబ్బీ పారసీక వర్తకుల వాణిజ్య ప్రతిష్ఠ అపారమయినది. వారి అంగడిలోకి వచ్చే యీబట్టల కోసం ప్రతిదేశంనుంచీ వచ్చిన వర్తకులు ఎంతో మోజుపడి, వారి సుగంధ ద్రవ్యాలను, యితర సామగ్రిని ఎంతధనం యివ్వగలిగిన దేశాలకయినా సరే, యీ గుడ్డల మార్పుదలలకు యిచ్చివేయడం జరిగేది. ఈ వాణిజ్య కేంద్రాలలోని పాశ్చాత్యదేశాల అనుభవమే వారి నీ తెలంగాణంపైకి దృష్టి పారింపజేసిందని సర్ విలియం హంటర్ వ్రాశాడు.

క్రీ. శ. ౧౬౦౬ నాటికి పోర్చుగీసు వర్తకులు బందరుతీరంలో తమ వర్తకస్థానాన్ని స్థాపించుకొని యిక్కడ బట్టలు కొని తమ దేశానికి పంపుకొంటున్నారు. క్రీ. శ. ౧౬౦౭ లో యీ వర్తకానికి భాగదేయులుగా హాలెండు దేశీయులు యిక్కడికి చేరుకొన్నారు. క్రీ. శ. ౧౬౦౯ లో లండనులో వర్తక సంఘానికి Florence weboyne అనేహాలెండు దేశీయుడు ఈ దేశంతో వర్తకం చేసుకోడానికి తగినసాయం చేస్తానని బయలుదేరాడు. క్రీ. శ. ౧౬౧౧ లో 'గ్లోబు' అనే ఓడలో అతను బందరు తీరాన్ని చేరుకొన్నాడు. గోల్కొండ నవాబును సందర్శించి, కొన్ని దస్తవులను సంపాదించుకొని తిరిగి యింగ్లాండుకు ప్రయాణమయినాడు. అతడీ తెలంగాణం తూర్పుతీరంనుంచి తన దేశానికి అమ్మకమునకయి తీసుకొనిపోయిన వస్తువులపై ౨౧౮% లాభం కనిపించింది. ఆనాటినుంచీ యీతూర్పుతీరపు వర్తక వ్యాపారంలో ఇంగ్లీషువర్తక సంఘానికి స్థిరమయిన నమ్మకం ఏర్పడింది. నాటినుంచీ వారి వర్తకకేంద్రం ఒకటి బందరులో స్థాపించుకొని, వారూ వచ్చి, పోర్చుగీసు వర్తకులలాగే యిక్కడ బట్టలు కొని తమ దేశాలకు ఎగుమతి చేసుకోవడం ప్రారంభించి అధికారులుగా మారినారు.

భీమునిపట్నం, విశాఖపట్నం, బెండమూర్లంక, కోరింగ, కాకినాడ, నరసాపురం, నీలపల్లి, ఇంజరం, మదపోల్లం, మచిలీపట్టణం వంటి అనేక తూర్పుతీరపు తెలంగాణపు ఓడరేవులనుంచి ఏటేటా కొన్నికోట్ల రూపాయల విలువ కలిగిన చేనేత వస్త్రాలు యీ విదేశాలకు అమ్ముడు పోయేవి.

క్రీ. శ. ౧౬౮౭ నుంచీ మొగలాయీలు మన ప్రభువులు. ఔరంగజేబు చక్రవర్తికి మనసంగతి ఆలోచించడానికి సావకాశం లేకపోయింది. మరాఠీల ఆందోళనతోటే ఆతనికి కాలం సరిపోయింది. ఆనాడు దక్కను సుబేదారు హైదరాబాదు నవాబు. నామకః మనం మొగలాయీ ప్రభుత్వాధికారంలోని వాళ్లమే అయినా, యితనినే ప్రభువుగా పాటించడం ప్రజాసామాన్యానికి పరిపాటయిపోయింది. క్రీ.శ. ౧౭౦౭ లో ఆలంఘీరు పాదుషా చనిపోవడంతోటే మొగలాయీ సామ్రాజ్యపతనం ఆరంభమయింది. దేశమంతటా అరాజకం ప్రబలిపోయింది. తాబేదారులు సుబేదారులుగా, సుబేదారులు నవాబులుగా మారిపోతున్నారు. ఢిల్లీ సింహాసనంకోసం దేశమంతటా తగవులాట లారంభమయినాయి. ఒకవైపు దేశంలో వున్న రాజకీయ వర్గాలన్నీ అటువైపు దృష్టి మరల్చిన కాలంలో, సమయం కనిపెట్టి యీ విదేశవర్తకసంఘాలు తమ వ్యాపారాలు విరివిగా సాగే ప్రయత్నాలు చూచుకోవడం ఆరంభించినాయి.

దేశీయప్రభుత్వాలు అధికారంలోవున్న కాలంలో దేశీయ పరిశ్రమలకు కావలసినంత రాజాదరణ వుండేది. సాలీలు యిబ్బందిపడిఎరుగరు. కాని దేశంలో రాజకీయాధికారం నశించిపోయి, ప్రజాజీవితం దుర్భరమయిన అరాజకంలో వేగిపోయే ఆ కాలంలో వారికి ధనం పెట్టుబడిపెట్టి పనియివ్వగలిగే నాథులు కావలసివచ్చారు. ఈ అదను కనిపెట్టి, విదేశవర్తకసంఘాలు వారికి కావలసిన మదుపు యిచ్చి వారి కిష్టమయిన రకరకాల బట్టలు కూలికి యీ సాలీలచేత నేయించుకొనే సావకాశాలు లభించాయి.

క్రీ. శ. ౧౭౦౮ లో యింజరంలో యీ ఇంగ్లీషువర్తకులకోసం తయారయే చలువనేతగుడ్డల పరిశ్రమలు యావద్భారతదేశంలోనూ ఆనాడు అగ్రస్థానాన్ని వహించినవని అప్పుడు యీ దేశానికి వచ్చిన సర్ జాన్ హామిల్టను వ్రాశాడు. ప్రతివర్తకకేంద్రంలోనూ ఇంగ్లీషువర్తకులు సాలీలచేత బట్టలు నేయించుకుంటున్నారు. "కాని ఎటు చూచినా దేశం దుర్భరమయిన అరాజకంతో వేగిపోతోంది. ఒకవైపునుంచి జమీందారుల సైన్యాలు, ఇంకొకవైపునుంచి తురుష్కప్రభుత్వాల పటాలాలు దేశంమీద పడి దోచుకుంటున్నాయి. అందుచేతనే బట్టలు యథావిధిగా పంపడానికి వీలులేకపోయిం"దని విశాఖపట్నం ఓడరేవులోని వర్తకసంఘాధ్యక్షుడూ, సభ్యులూ వారి ప్రభుత్వానికి విన్నవించుకొన్నారు. కాని కొన్నివేలమైళ్ల దూరంలో సముద్రంవెనకాల వున్న వారి అధికారులకు యిక్కడి దేశపరిస్థితులు బోధపడే మార్గం లేకపోయింది. వారికి మామూలుగా ఎగుమతులు తగ్గిపోయినట్లయితే వారి వర్తకలాభాలకు మోసం వస్తుందన్న భయంతో వారి తాబేదారులను అదమాయించడం ఆరంభించారు. వీ రింక విధిలేక, యీ సాలీలను వారి వర్తకకేంద్రాల ప్రాకారాలలో బంధించి వారిచేత గుడ్డలు నేయించడం ఆరంభించారు. వారికి యిచ్చే కూలీలు తగ్గించడం ఆరంభించారు. తమ లాభాలను అధికంచేసుకోవడానికి చేసే ప్రయత్నాలన్నీ కాక, సాలీలు తమరు చెప్పినంత సన్నగా నేయలేకపోతే యెంత కష్టపడి పనిచేసినా ఆ గుడ్డలను తీసుకోవడం మానేసేవారు. దీనితో యీ బాధ భరించలేక, ఏమయినాసరే, యీ ఇంగ్లీషువర్తకులకు గుడ్డలు నేయకూడదని మన తెనుగుసాలీలు నిశ్చయించుకొన్నారు. ఊరూరుకూ తిరిగి ప్రచారంచేశారు. ఇంగ్లీషువర్తకుల ఆధ్వర్యంలో వున్న నేతపరిశ్రమలకు అవసానకాలం ఆరంభమయినట్టే అనిపించింది.

ఈ సమయం కనిపెట్టి ఫ్రెంచి, డచ్చివర్తకులు సాలీలకు ఎక్కువకూలీలను యిచ్చి అంత నిర్బంధించకుండా వారికి కావలసినంత సావకాశాన్ని యిచ్చి బట్టలు నేయడానికి ఆలస్యమయినా ఇంగ్లీషువర్తకులవలె బంట్రోతులను నిలబెట్టి బాధించకుండా గడువు యిచ్చి గుడ్డ కొంచెం అలికీగా వున్నా ఏదోవిధంగా బేరం స్థిరపరచుకొని తీసుకొనేవారు. "ఈ యితర

విదేశవర్తకులు చూపించే కనికరానికి, వారిచ్చే సరసమయిన ధరలకు, వారు న్యాయంగా పరిష్కరించేసుకొనే విధానానికి సంతుష్టిపడి, సాలీలు వారికోసం ఎన్ని గుడ్డలయినా నేయడానికి ఒప్పుకుంటారేగాని మనకొక్క గుడ్డనయినా నేసియిచ్చే సాలీ కనిపించడంలేదు. నన్ను మీరు యథాప్రకారం బట్టలను ఎగుమతిచేయడం లేదని బాధించి ఏమీ ప్రయోజనం లేదు. దయయుంచి నన్నీస్థానంలోనుంచి తొలగించండి. ఈ వుద్యోగం మానుకొంటున్నాను. ఇంకొకరిని నియమించుకొనే ప్రయత్నాలు మీరు చేసుకోవడం మంచి"దని యీ తెలంగాణపు వర్తకరేవులలోని యింగ్లీషు వర్తకులు లండనులోని వర్తకసంఘానికి వ్రాయడం మొదలుపెట్టారు. దానితో లండనులోని వర్తకసంఘాధికారులలో కొంత చైతన్యం కలిగింది. కాని అది ఏపాటిది? ఎటువంటిది? "సాలీలతో కూలీలు తప్పకుండా ఎక్కువ యిస్తామని చెప్పి చూడండి" అన్నారు. యథాప్రకారం మందర బట్టలు నేసియిచ్చే విధానం చూడమన్నారు. "మేము ఎన్నో వాగ్దానాలు చేస్తున్నాం. మా మాటమీద గౌరవం పూర్తిగా నశించింది. అయినా మనలను యింకోసారిగా నమ్మి ఎనభైవేలరూపాయల విలువయిన గుడ్డలు మదపొల్లం, యింజరం వర్తకులు యీ సాలీలచేత నేయించి యిస్తున్నారు. ఇవి కేవలం నిర్బంధంవల్ల సాధ్యమయ్యేవేగాని, మనమంటే సాలీలకు యిష్టంవుండి ఎంతమాత్రం కాదు" అని మచిలీపట్నంలోని వర్తకసభ్యులు లండనుకు రాశారు. "మనం యిదివరకు అక్కర్లేదని తిప్పివేసిన గుడ్డలనే యిప్పుడు మనం కావాలంటే తెచ్చియిస్తున్నారు. అవి నేతలో మనం కావాలన్నంత సన్నంగా లేకపోయినా, రంగులు మటుకు బాగున్నాయని పుచ్చుకుంటున్నాం" అని రాశారు ఇంజరంవర్తకులు. ఇంకొక వర్తకకేంద్రమయిన మదపొల్లంనుంచి "నేను సాయశక్తులా బాధపడి, వారిని మన వర్తకసంఘానికి గుడ్డలు ఎలాగయినా నేయాలని సావధానంగా చెప్పి చూశాను. కాని ఏమీ లాభం లేకపోయింది" అని వ్రాశాడు వారి ప్రతినిధి.

దేశపరిస్థితులుమాత్రం మారినాయా! "కొన్ని దినాలనుంచి ఎక్కడా దురంతాలు జరగకుండానే వున్నాయనుకుంటే మళ్లీ తిరుగుబాట్లు ప్రారంభమయినాయి. దేశమంతా విప్లవవాతావరణంతో మునిగిపోయింది. బట్టలకోసం గ్రామాలకు పంపిన బంట్రోతులు వెనక్కు తిరిగిరావలసివచ్చింది" అని విశాఖపట్నంరేవునుంచి వర్తకసభ్యులు అధికారులకు వ్రాశారు. "ఎంతోమంది పనివాళ్లు వాళ్ల సమస్తంతోటీ తలదాచుకోడానికి అడవులలోనికీ, కొండలలోనికీ పారిపోయా"రని ఇంజరంనుంచి వర్తకసంఘంవారింటికి వ్రాశారు. కాని స్వల్పకాలంలోనే యీ గందరగోళం తగ్గింది. "పారిశ్రామికులు వారివారి గ్రామాలకు చేరుకొంటున్నారు. ఈసారి మనకు బట్టలు నేసే ఏర్పాట్లు తప్పక చేస్తా"మని మచిలీపట్నంవర్తకులు ధైర్యంగా మాట్లాడారు. ఈసారి, సర్కారులలోని భూములను, కిస్తువిషయాలను పరిష్కరంకోసం రాబోతూవున్న హైదరాబాదునవాబును చూచి వారికి వున్న యిబ్బందులను యీవర్తకులు చెప్పాలని అనుకుంటున్నట్టు విని, మొగలాయీరాయభారి "మీరు మా ప్రభువు ఆప్రాంతాలకు వచ్చినప్పుడు నావుత్తరువు లేనిదే ఏవిధమయిన మహజర్లు పంపడానికి వీలులేదు; ఒకవేళ నాఆజ్ఞను అతిక్రమించి ప్రవర్తించారా, యినుపసంకెళ్లు తగిలించి ఖైదుకు పంపిస్తాను" అని వుత్తరం వ్రాసి మచిలీపట్నంవర్తకసభ్యులకు పంపించాడు. ఇంతటితో యింకొకసారి యింగ్లీషువర్తకులు తమ వర్తకవ్యాపారాల విషయంలో పెట్టుకొన్న ఆశలు అంతర్ధానమయినాయి.

డచ్చివారు మటుకు, యీగందరగోళం ఎలావున్నా, వారి వర్తకాన్ని వారు అభివృద్ధిచేసుకొంటున్నారు. ఏడువందలమంది రంగులపనివాళ్లను గోలకొండనుంచి రప్పించి, వారిచేత అనేకరకాల రంగులబట్టలను చేయించుకొంటున్నారు. వారికి సాలీనా ౨000 పెగోడాలు యిచ్చి పోషిస్తున్నారు. ఈవిషయంలో తమరూ జోక్యం కలగజేసుకొని, నాలుగయిదుకుటుంబాలను విడదీసి తమకోసం పనిచేసేలా ప్రయత్నిస్తామని యింజరంఇంగ్లీషువర్తకులు లండనులోని అధికారవర్గాలకు వ్రాశారు. కాని వారికి యీసాలీలకు యితరవర్తకసంఘాలకంటె ఎక్కువకూలీలు యివ్వడంగాని, అధమం వారిచ్చినంతమాత్రమయినా యివ్వడంగాని అలవాటులేదు. అదీగాక దీనికి లండనులోని

అధికారులు అనుమతిస్తేగాని, స్వతంత్రించి కూలీ హెచ్చు చేయడానికి వీరికి స్వాతంత్ర్యం లేదు. కాని యితరవర్తకసంఘాలకు యీ యిబ్బంది లేదు. ఏదో విధంగా వారి వాణిజ్యం పెంచుకోవడమే వారి ప్రధానోద్దేశ్యం గనుక సాలీలడిగిన ధరలను వారిచ్చేవారు. అందుచేత సాలీలు వారి నేతవస్త్రాలను యీయితరవర్తక సంఘాలకే అమ్ముకొనేవారు. బరంపురంపట్టుపరిశ్రమలు కూడా యీవిధంగానే విదేశీయులకే అమ్ముడు పోతున్నాయని యింగ్లీషువర్తకులాక్రందనంచేసేవారు.

క్రీ. శ. ౧౭౩౩లో రాజమండ్రి రుస్తుమ్‌అలీ ఖానుపరిపాలనక్రిందికి వచ్చినప్పటినుంచి పరిస్థితులు కొంత బాగుపడ్డాయి. ఇంగ్లీషువర్తకుల వ్యాపారాలు కొంత తేరుకున్నాయి. మళ్లీ వారి వర్తకం బాగా సాగే సూచనలు కనిపించాయి.

ఇంజరం, మదపొల్లంవంటి వర్తకకేంద్రాల నుంచి వర్తకాభివృద్ధికి వున్న భవిష్యత్సావకాశాలను గురించి వర్తకసభ్యులు పదేపదే వ్రాయడం మొదలు పెట్టారు. మళ్లీ ఏదో కొంతమంది సాలీలను కుదుర్చుకొని వారిద్వారా నేతపరిశ్రమలను యిదివరకుకంటె జోరుగా సాగించడం ప్రారంభించారు.

ఈసారి ఫ్రెంచివర్తకులకే కొన్ని విషమపరిస్థితులు ఏర్పడినాయి. షరాబులు వారి నాణేములకు తగ్గించి విలువలుకట్టుట ప్రారంభించారు. వారి సామగ్రులను ఒకచోటునుంచి ఒకచోటికి పోనివ్వడానికి అభ్యంతరాలు ఆరంభమయినాయి. వారికీ వారి సాలీలు బట్టలు నేసియివ్వమని పేచీలు పెట్టడం ప్రారంభించారు. ఇంజరంలోనున్న ఇంగ్లీషువర్తకు లీపరిస్థితులకు పైకి సానుభూతి చూపించినా, లోపల చాలా సంతోషపడ్డారు. తమరు ముందరికి రావాలంటే యిదే సరి అయిన సమయం అనుకొని "ఫ్రెంచివర్తకులు, హాలండు దేశీయులు చాలా దుర్మార్గులు. తమ వాణిజ్యవిధానం చాలా న్యాయమయినదిగనుక తమరొక్కరికే యీ వర్తకవ్యాపారాలు చేసుకునే హక్కు వుంచి తక్కిన వారికందరికీ తీసివేయవలసిం"దని నవాబుతో రహస్యంగా చెప్పిచూశారు. కాని ఆనాటి నవాబులకు యితరవర్తకసంఘాలకంటె ఇంగ్లీషువర్తకుల ఆధిక్య తను అదనంగా గౌరవించవలసిన అగత్యం ఏమీ కనిపించలేదు. "ఎవరు నవాబుకు వర్తకసురికాలు చెల్లిస్తే వారికి యీదేశభాగంలో వాణిజ్యం జరుపుకోవడానికి సావకాశం వుంది. ఎవరికీ ప్రత్యేకంగా యీ హక్కును వదిలిపెట్టి యితరులను తొలగించడం జరగదు. వెళ్ల"మని యీ ఇంగ్లీషువర్తకసంఘాధ్యక్షులకు జవాబువచ్చింది. దానితో యీ మచిలీపట్నపు నవాబు అవడంతోటే ఇంగ్లీషువర్తకులకు ఒళ్లుమండింది. ఇతర వర్తకసంఘాలదగ్గర దట్టంగా లంచాలు పుచ్చుకున్నాడుగనుక తమ కోర్కెలను నిరాకరించాడని వాదించడం ప్రారంభించారు. యీ ఆరోపణ కేవలం నిరాధారమయినది. మళ్లీ నిజం వారే ఒప్పుకున్నారు. "మన కోర్కెనే అతడు అంగీకరించినాడంటే అతని పీకరొమో, లేక అధమం అతని ఉద్యోగమో ఎగిరిపోయి వుండేది. అందుకనే మనకున్న యిబ్బందులను ప్రభుత్వానికి తెలియజేసి తగిన పరిష్కారానికి అవకాశాలుంటే చూస్తానన్నా"డని వారే అన్నారు. అసలు వారి భయమేమిటంటే "మళ్లీ ఫ్రెంచివర్తకసంఘం అధికారం సంపాదించుకొంటోంది. ఫ్రెంచివాళ్ల వాణిజ్యవిధానం అత్యంతప్రాముఖ్యస్థితిలోకి వచ్చేస్తుంది." నిజంగా పరిశీలిస్తే యిదే వారి కున్న ప్రతిబంధకం.

ఇంతట్లోకే క్రీ. శ. ౧౭౪౮లో దక్కను సుబేదారు చనిపోయాడు. అతని స్థానంకోసం అన్నదమ్ముల తగాదాలలో ఫ్రెంచివర్తకసంఘం, యింగ్లీషువర్తకసంఘం చెరియొక వైపున చేరుకొన్నాయి. వాటి భావిఅదృష్టాన్ని యీయుద్ధఫలితాలకు విడియాచేసి, అంటుకుంటున్న నిప్పును రగిలించి హైదరాబాదునవాబుకుటుంబాన్ని యుద్ధంలోకి దుమికించాయి. తామూ దిగినాయి. క్రీ. శ. ౧౭౫౭ లో జరిగిన బొబ్బిలియుద్ధంతో ఆంధ్రతేజం అస్తమించింది. పరాసు దేశీయులపరాభవంతో ఇంగ్లీషువర్తకసంఘం చిరస్థాయి అయి, క్రీ. శ. ౧౭౬౬ దాకా కేవలం వర్తకవ్యాపారాలనే చూచుకొంటూవుండి, క్రీ. శ. ౧౭౬౬ లో నైజాము దానరూపేణా యీ ఉత్తరసర్కారులను సంపాదించుకొని, అధికారస్థానాన్ని ఆక్రమించుకొంది.

పాపభారం

[కథానిక]

— శ్రీ 'అమరేంద్ర' —

"ఇంకా రాలేదా? ఇంకా రాలేదా?" అని తల్లి మూల్గింది.

"వచ్చే వేళయింది. ఈ పాటికి సగందోవలో వుంటుంది. వస్తుందమ్మా, కొంచెంసేపు కళ్లు మూసుకుని పడుకో" అని కూతురు శారద తల్లిపక్కలో కూచుని విసురుతూ బదులు చెప్పింది.

"అమ్మాయీ, నీకు తెలియదే తల్లీ, నీకు తెలియదు. కళ్లు మూసుకుంటే ఇక తెరవటం ఉండదమ్మా. మూసుకు పోతుంటే బలవంతాన తెరుచుకుంటున్నాను అది వస్తుందేమోనని. ఇంకా రాలేదేమే? అసలు రాదేమో?"

"వస్తుందమ్మా, తప్పకుండా వస్తుంది. ఎక్కడున్నా వెతికి తీసుకురమ్మని మనుషుల్ని పంపాను. ఈ పాటికి వచ్చేస్తూ వుంటుంది."

"ఇక నాకు వ్యవధి లేదే తల్లీ! అంతా అయిపోయాక వస్తుందేమో? అయ్యో! ఇంకా రాలేదేమే? ఇంకెప్పుడు వస్తుందే?" అని ఆందోళనతో వణికిపోయి, సొమ్మసిల్లి, క్షణంసేపు మాట్లాడకుండా పడుకున్నది. శారదకు ఏమీ పాలుపోవటం లేదు. తల్లి ధోరణి చూస్తుంటే భయం వేస్తోంది. ఆమె బతకదని వైద్యులంతా నిర్ధారణచేసి ఆశవదులుకున్నారు. అప్పటినుంచీ శారదమనసు మనసులో లేదు. తనను కంటికి రెప్పగా కాపాడి పెంచిన తల్లిని విడిచిపెట్టి తానొక్కర్తే ఈ లోకంలో ఎల్లా బతకగలదు? తండ్రి స్వర్గానికి తరలివెళ్లినప్పటినుంచీ తల్లితప్ప వేరే ప్రపంచమే శారదకు తెలియదు. అటువంటి తల్లి మరణకాలంలో కోరిన కోరిక తాను నెరవేర్చకపోతే ఎల్లాగు? శారదను చిన్నప్పుడు ఎత్తుకుని సాకిన దాసీ ఒకతె వుంది. అది తమ ఇంట్లోనే వుండి శారదను నాలుగోయేడు వచ్చేదాకా పెంచింది. దాని భర్త కలరా తగిలి చచ్చిపోయిన తరవాత దానికి మతి చలించిపోయింది. ఎంత చెప్పినా వినకుండా తన పిల్లల్ని వెంటపెట్టుకుని ఆ వూరు విడిచి వెళ్లిపోయింది. ఇది పదేళ్లకిందటి సంగతి. అప్పటినుంచీ ఆ దాసీదాని జాడ తెలియలేదు. ఈ పదేళ్లలోనూ ఆ దాసీదాన్ని గురించి తల్లి శారదతో ఒక్కమాటయినా మాట్లాడలేదు. తాను బతకనని తెలుసుకున్నదగ్గరనుంచీ ఆ దాసీదానికోసం తల్లి ఒక్కవరసన తపిస్తోంది. మరణసమయంలో ఆప్తబంధువుకోసమైనా అంతగా పరితపించరేమో! ఎప్పుడో పదేళ్లకిందట పని మానుకుని ఎక్కడికో వెళ్లిపోయిన దాసీదానికోసం తల్లి అంత తహతహపడటం చూస్తుంటే శారదకు ఏమీ తెలియటం లేదు. తల్లి మళ్లీ అంటున్నది: "అమ్మాయీ, ఇంకా రాలేదుటే? ఇంక రాదేమో? నాకు వ్యాధి అయిపోతోందమ్మా, ఇంకా రాదే?" శారద తల్లి తలకింది దిండును సరిచేసి "వస్తుందమ్మా, తప్పక వస్తుంది, నువ్వు ఆందోళనపడబోకు. ఎక్కడ వున్నా గాలించి తీసుకొస్తాం" అంటుండగానే బైట అడుగుల అలికిడి వినబడింది. వెతకటానికి వెళ్లిన మనుషులు దాసీని వెంటపెట్టుకుని వచ్చారు. ఆ శేగిపోయిన చింకిరితలా, చినిగి పీలికలైపోయిన చీరే, చిక్కిపోయిన రూపూ

చూడగానే శారదగుండె చివుక్కుమన్నది. అమాంతంగా పకేళ్ల నాటి చిన్నపిల్లలాగే శారద "లక్ష్మీ"అని కేకపెట్టి పరిగెత్తింది. దాసీది తాను పెంచిన పాప పద్నాలుగేళ్ల పడుచుగా మారటం చూసి విస్తుపోతూ నిలబడిపోయింది. మంచంమీదినుంచి తల్లి "వచ్చిందా" అని పెనుల్చుకుని అరిచి మంచెతులమీద అమాంతం లేచి కూర్చొబోయింది. దాసీది పరుగున వెళ్లి "అమ్మగారూ, వచ్చాను. మీపాదాలకాడికి మళ్లీ వచ్చాను. నన్ను మరచిపోయా రనుకున్నాను" అని రోగిపాదాలు కళ్లకద్దుకుంది. రోగి నీరసించిపోతున్న గొంతుతో "లక్ష్మీ...నిన్నా...మరచి..." అంటూ దాసీదాని చేతులను తన చేతుల్లోకి తీసుకుని దాని కళ్లలోకి రెప్పవాల్చకుండా చూసింది. ఏదో చెప్పబోయింది. పెదవులు వణికినయ్. ధ్వని పెగిలిరాలేదు. ఇంతలోనే చేతులు కట్టెబారిపోయినయ్. నిలువుగుడ్లు పడినయ్. దాసీది 'అమ్మగారూ' అని ఘొల్లుమన్నది. శారద 'అమ్మా' అని ఒక్క శోకం పెట్టింది. మాటలకు లొంగని బాధ ఏదో ఆశవంలోపలే అణగిపోయింది. ఎందుకోసం దాసీదాన్ని పిలిపించిందో, ఎందుకు దాన్ని చూడాలని ఒక్కవరసన కలవరించిందో ఎవరికీ తెలియదు. కలవరించిన దాసి వచ్చి కంటపడేసరికి ఆ రోగికి కాలం తీరిపోయింది. దట్టంగా అలుముకుంటున్న చీకటిలో శారదా, లక్ష్మీ ఒకరికేసి ఒకరు చూసుకుంటూ, ఏంచేస్తా దరితెలియని అయోమయంలో పడిపోయారు. శవం మాత్రం నిశ్చలంగా వుంది తనకిక చీకటివెలుగుల భేదమేమీ లేనట్టు!

౨

"దాచలేను, ఇంక దాచలేను" అన్న మాటలతో గది అంతా గింగురుమన్నది. ఆ మాటలు ఎంతో బాధతో క్రుంగిపోతున్న గుండెలోతులలోనుంచి దూసుకొనివచ్చినయ్. అద్దంలో, మల్లెపూల రెక్కలకంటె తెల్లని దుస్తులలో వున్న తన నీడను చూసుకుంటోంది మార్గరెట్. ఎదురుగా గోడమీద ఉన్న క్రీస్తుబొమ్మ అద్దంలో కనబడుతోంది. శిలువమీద నిలబడి దారుణమైన బాధతో, దీనమైన ముఖంతో, తడిసిన కళ్లతో క్రీస్తు తన మనసులోకి తొంగిచూస్తున్నాడు. ఆ చూపుకు అందకుండా ఏ పాపం దాగుతుంది? ఆ పవిత్రమైన కాంతిలో ఏ మలినం మాయమైపోదు? ఆ చూపు నర్సుమార్గరెట్ గుండెను చీల్చివేసింది. ఆమె కళ్లకు ఒక్కసారిగా ఇన్నాళ్లనుంచీ తన తెల్లటి వేషంలో దాగిన పాపమొకటి కొట్టవచ్చినట్లు కనబడింది. అణుచుకోలేని ఆవేగంతో ఆమె చిందులు తొక్కసాగింది. ఆమెలోపల దాగిన విషసర్పమొక్కసారిగా ప్రతిరక్తనాళాన్నీ బద్దలుకొట్టి బైటపడాలని బుసలుకొడుతోంది. వణికిపోతున్న కనురెప్పలనొకసారి పైకెత్తి చేతులు జోడించి "ప్రభూ! నిన్ను మోసగించలేను" అని గద్గదస్వరంతో విన్నవించుకున్నది. దూరంగా చర్చిగంట మోగింది. ప్రాణప్రదంగా దాచుకునే బైబిలును చేతపుచ్చుకుని మార్గరెట్ వడివడిగా నడిచిపోయింది.

దోవలో తనను తాను నిందించుకుంటూ అడుగువేసింది. "ఈ నాడు అగ్నిపర్వతంలాగా బద్దలై నా పాపం బైటపడిపోతుంది. నా కలుషాన్ని కన్నీటితో కడిగివేస్తాను" అనుకుంటుండగా మతగురువు ఎదురైనాడు. మార్గరెట్ అతన్ని దారిలోనే నిలవేసింది. ఆమెకల్లోలాన్ని గమనించి మతగురువు విషయమేమిటి అన్నాడు. మార్గరెట్ వణికిపోతూ అన్నది: "నేనొక గొప్పపాపం చేశాను. అది మీ ముందు బైటపెట్టుకుందామని వచ్చాను. ఈ పాపభారాన్ని భరించలేను." మతగురువు చకితుడై "ఏమిటీ, నర్సులు పాపం చేస్తారా?" అన్నాడు వాళ్లమీద తనకున్న గౌరవాన్ని వెల్లడిస్తూ. మార్గరెటు సిగ్గుతో తల వంచుకుని "ఇంత పవిత్రమైన వేషంలో ఎంత పాపం దాగివుందో! నిజం చెబుతున్నాను. వినండి. విని నాకు ప్రాయశ్చిత్తం విధించండి. ఈ పాపభారంతో నే నిక జీవించలేను. నన్ను అనుగ్రహించండి" అని దీనంగా వేడుకున్నది. మతగురువు కరుణతో కరిగిపోతున్న మనసుతో మార్గరెటు హృదయసంక్షోభమంతా విన్నాడు. అంతా చెప్పినాక మతగురువుకు మోకరిల్లి "నాకు మనశ్శాంతి

లేదా? నాకు విముక్తి లేదా" అని ప్రశ్నించింది. "లేకేమి? ఉంది, ఉంది" అని మతగురువు ఆశకలిపించాడు. "ఏమిటో చెప్పండి. ఎంత కఠినమైన ప్రాయశ్చిత్తం విధించినా సహిస్తాను" అని మార్గరెటు వేడుకున్నది. మతగురువు దయతో నిండిన కంఠంతో "ఎవరికి ఎడబాటు కలిగించావో వారిని వెళ్లి క్షమార్పణ వేడుకో. నీకు మనశ్శాంతి లభిస్తుంది" అన్నాడు. దూరంగా మళ్లీ చర్చిగంటలు గణగణ మోగినయ్. వాటితో కలిసిపోయి మార్గరెటుమనసుకూడా ఆశతో ఝుణఝుణ మన్నది.

ప్రార్థనలు ముగియగానే మార్గరెట్ పరుగు తీసింది. "ప్రపంచంలో ఎక్కడ వున్నా సరే వాళ్ల దగ్గరికి పోయి కాళ్లమీద పడతాను. కన్నీళ్లతో నా పాపకథ వినిపిస్తాను. వాళ్ల గుండెలు కరిగించి క్షమాభిక్ష వేడుకుంటాను" అనుకుంటూ బయలుదేరింది.

దొరికింది, దొరికింది. అణచివేసే పాపభారం నుంచి బైటపడే దోవ దొరికింది!

3

"శాంతమ్మగారూ! శాంతమ్మగారూ!" అన్న పిలుపు విని శారద బెదిరిపోయింది; కంపించిపోయింది. తల్లి పోయి ఎంతో కాలమైతే ఇవాళెవరో వచ్చి ఆ విడను పేరుపెట్టి పిలుస్తున్నారు. మళ్లీ అదే పిలుపు: ఇందాకటికంటె దగ్గరగా. లక్ష్మి పరుగుపరుగున వెళ్లి వచ్చి "ఆసుపత్రిలో దొరసానిగారు వచ్చారమ్మా. వారి చేతిమీద ఎన్నో పురుళ్లు పోసుకున్నాను. అమ్మగారికోసం వచ్చారంట. అరుగో వారే వస్తున్నారమ్మా" అని చెప్పింది. నడచినడచివచ్చిన బడలికతో నర్సు మార్గరెట్ లోపలికి వచ్చింది. రాగానే నలువైపులా తేరిపార జూచింది. శారదను చూడగానే ఆమె ముఖంలో ఒక్క మెరుపు మెరిసింది. పధ్నాలుగేళ్ల నాడు తాను బొడ్డుకోసిన పసిపాపయేనా ఈ యువతి?

"కూర్చోండి, ఏం పనిమీద వచ్చారు?" అని శారద మర్యాదగా పలకరించింది. లక్ష్మి కుర్చీ తెచ్చి మార్గరెట్‌ను కూర్చోమన్నది. వద్దని ఆమె నేలమీదనే చతికిలబడి "శాంతమ్మగారు చనిపోయారా పాపం?" అన్నది. శారదకూ, లక్ష్మికీకళ్లనిండా నీళ్లు తిరిగినయ్. ఏమీ మాట్లాడలేక కళ్లు అద్దుకుంటూ నిలబడ్డారు. కొంచెంసేపున్నాక మార్గరెటు "అమ్మాయీ, ఇల్లా రా అమ్మా, కూచో, నీ పేరేమిటి?" అంది. శారద చెప్పేలోగానే లక్ష్మి అందుకుని "అమ్మగారు మనసుపడి శారద అని పెట్టుకున్నారు. లేక లేక కలిగారని అమ్మాయిగారంటే అమ్మగారు ప్రాణం విడిచేవారు" అన్నది. ఆ మాటలు వింటుంటే మార్గరెట్‌కు కొరడా దెబ్బ తగిలిన ట్లనిపించింది. "నీ పేరేమిటమ్మా" అని దాసీని అడిగింది. "దొరసానిగారూ, నా పేరు లక్ష్మి. మీరు మరిచిపోయారేమో గాని నేను మరిచిపోలేనమ్మా. మీ చేతిమీదుగా ఎన్నో పురుళ్లు పోసుకున్నాను. మీ ఋణం ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేను దొరసాని గారూ!" పాపం పుణ్యం ఎరగని అమాయక స్త్రీ తనను మెచ్చుకోవటం వింటుంటే మార్గరెట్‌కు తన మీద తనకు మితిలేని రోత కలిగింది. తన పాపాన్ని తలుచుకుంటే గుండె భగ్గుమంటున్నది. ఇంతలో దాసీది "దొరసానిగారూ, ఏమైనా పనిమీద వచ్చారా తెలవియ్యలేదు" అన్నది. మార్గరెట్ మాట్లాడలేక పోయింది. ఎంతో ప్రయత్నించి "నీతోనే పనివుండి వచ్చాను లక్ష్మి" అంది. "నాతోనా, దొరసాని గారూ, నాలాటి దిక్కుమాలినవాళ్లతో తమలాటి మహారాజులకి పనేమిటండీ" అని లక్ష్మి దీనంగా అడిగింది. మార్గరెటు మారుచెప్పలేదు. దూరంగా నిలబడి అంతా వింటున్న శారదకేసీ, దగ్గరున్న లక్ష్మికేసీ తేరిపారజూచింది. ఆమెకళ్లు తడిసినయ్. "శారదా! ఇల్లా రా, తల్లీ. మీ అమ్మ చనిపోలేదు; చనిపోలేదు. నిన్ను మీ అమ్మదగ్గరికి తీసుకుపోతా రా" అంది. ఈ మాట విని శారద నివ్వెరబోయింది. "ఏదీ మా అమ్మ?" అని అప్రయత్నంగా అడిగింది. "తొందరపడకమ్మా, నీకు మీ అమ్మను చూపిస్తాను" అంది మార్గరెట్. లక్ష్మి ఆశ్చర్యంతో కళ్లు ఇంతచేసి గోడకు ఆనుకుని నిలబడింది.

"పధ్నాలుగో ఏడు కామా శారదా నీకు?" అని అడిగింది నర్సు. అవునని శారద తల ఊపింది.

"అవునవును, పధ్నాలుగే. ఆకాన్పు నాకూ, అమ్మగారికీ ఒక్కసారే వచ్చింది. ఇద్దరం ఒక్కరోజే కన్నాం. నాపిల్ల చచ్చిపోయేపుట్టింది" అని లక్ష్మి మార్గరేటుముఖంలోకి చూసింది. ఇది వినగానే నర్సు గుండెలలో కత్తితో పొడిచినట్లయింది. గిర్రున కళ్లలో నీరు తిరిగింది. అమాంతంగా లక్ష్మిపాదాలను చేతులతో చుట్టివేసి "నన్ను క్షమించు తల్లీ, నన్ను మన్నించు" అని వణికిపోతున్న కంఠంతో అరిచింది. లక్ష్మి తత్తరపాటుతో "లేవండి దొరసానిగారూ, అయ్యో ఇదేమిటి, ఈ దిక్కుమాలినదాని కాళ్లమీద పడతారు? లేవండి" అని దూరంగా జరిగింది. మార్గరెట్ శారదగడ్డం పుచ్చుకుని "తల్లీ, నాతప్పు మన్నించవూ?" అని బతిమాలింది. ఏమీ అర్థంకాక శారద ఆశ్చర్యపోతూ అన్నది: "ఏమిటో చెప్పండి. నాకేమీ తెలియకుండా వున్నది." నర్సు "చెబుతాను తల్లీ, అందుకోసమే ఇంతదూరం వచ్చాను. మీముందు సిగ్గుపడను. నాపాపమంతా మీముందు విప్పి చెప్పుకుని కొంచెం మనశ్శాంతి పొందుదామని వచ్చాను. లక్ష్మి, శారదా, మీ అమాయకహృదయాలకు ఈపాపాత్మురాలి మాటలు చాలా ఘోరంగా వుంటయ్. మీముందు నిలబడటానికే సిగ్గుతో చచ్చిపోతున్నాను." అంటుంటే కనుగొనలలో నీరునిండి చెక్కిళ్లమీదుగా రాలినయ్. ఆమెముఖంలో భరింపలేని వేదన, చెప్పలేనంత సిగ్గూ అలముకొన్నయ్.

"దొరసానిగారూ, మీమాటలు వింటుంటే నాకేదో భయం వేస్తోంది. ఎందుకమ్మా అల్లా కళ్లంట నీళ్లు?" అంది లక్ష్మి.

"పధ్నాలుగేళ్లకిందటి సంగతి నేను చెప్పేది. నీకు గుర్తుందా లక్ష్మి ఎంత బాధపడ్డావో? నీరసించిపోవటంవల్ల నీకాను పెంతో కష్టమైపోయింది. నువ్వెల్లా బతికి బైటపడతావా అని అందరం దిగులుపడ్డాం. చివరకు అర్ధరాత్రివేళ నీకు పురుడువచ్చింది"

"అవును దొరసానిగారూ, గుర్తుంది. చచ్చిపుట్టిన పిల్లను చూసుకుని గొల్లుమన్నాను. ఇప్పుడున్నట్లుంది"

"లేదు, లక్ష్మి, నీపిల్ల చచ్చిపుట్టలేదు. సుఖంగా వుంది"

"మీ మాటలు నాకు తెలియటంలేదు దొరసానిగారూ. చచ్చిపోయిన పిల్లను నేను కళ్లారా చూశాను; కాదంటారేమిటి?"

"లేదు, లక్ష్మి, నీపిల్ల సుఖంగా వుంది. చచ్చిపోయిన పిల్లను నీకు చూపిన పాపాత్మురాలిని నేనే. నీకు ఘోరమైన అన్యాయం చేశాను. దానికే నీకాళ్లమీద పడి క్షమించమని వేడుకుంటున్నాను" అని లక్ష్మిపాదాలను తాకబోయింది. లక్ష్మి వద్దని వారించి "అయితే దొరసానిగారూ, నాపిల్ల యెక్కడ దాచారో చెప్పండి?" అని అడిగింది.


"నీకూ, శాంతమ్మగారికీ ఒకేసారి పురుడు వచ్చింది. నీకు పురుడు వచ్చేసరికే శాంతమ్మగారు కన్నారు. ఆవిడకు చచ్చిపోయిన శిశువు పుట్టింది. రాకరాక కాన్పు వచ్చింది. వచ్చింది వచ్చినట్లుగానే చచ్చిపోయిన శిశువును కన్నది. శిశువును చూసుకుని ఆవిడ ఎంతో దుఃఖించింది. నీకు ఎంత కావాలన్నా ఇస్తాను; నాబిడ్డను బతికించు అని ఎంతో దీనంగా వేడుకున్నది. నాకు ఆతల్లి దుఃఖం చూడగానే గుండె కరిగిపోయింది. ఇంతలో నీగదిలో పిల్ల కెవ్వుమనటం వినిపించింది. పురుడురాగానే పసిపిల్లల బొడ్డు కోసి స్నానం చేయించి, పాపలందరినీ మూడు పూటల దాకా మేమే పెంచుతాం. గుర్తుకోసం పాపలకాలికి తల్లి పేరు రాసిన చీటీ దారంతో కడతాం. పురుడు వచ్చినాక నీకు మత్తువదలలేదు. సొమ్మసిల్లి సోయ తప్పివున్నావు. అప్పుడు ఈ పాపాత్మురాలు ఏం చేసిందనుకున్నావ్? నీ శిశువుకాలికి శాంతమ్మగారి పేరు కట్టి పడుకోబెట్టి శాంతమ్మగారి చచ్చిన శిశువును నీపక్కన పడుకోబెట్టాను. ఇదంతా పైవాళ్లెవరూ చూడకుండా రెప్పపాటులో చేశాను. నీకు స్మృతివచ్చాక నీపిల్ల పోయిందని శోకం పెట్టావు. తన పిల్ల చచ్చిపోయినా, ముద్దులుమూటకట్టే పసిపాప పక్కలోకి వచ్చిందని శాంతమ్మగారు పొంగిపో

యారు. ఆసుపత్రినుంచి ఇంటికి వెళ్లేవాడు నన్ను చాటుగా పిలిచి ఇదుగో ఈ ఆరువందల రూపాయలు లంచమిచ్చారు. అప్పటినుంచీ వాటిని నేను ముట్టుకో లేదు. నాపాపమంతా వాటిలోనే దాగి నన్ను క్షణ క్షణమూ శూలంతో పొడిచేది. ఇదుగో లక్ష్మి, ఈ డబ్బు నువ్వు తీసుకో. దానితో నీబిడ్డలు సుఖపడితే నాపాపం కొంత శమించినట్లే. నామాట వినవూ? తీసుకోవూ?

"శారదా! విన్నావమ్మా నేను చెప్పినదంతా? నన్ను ఏవగించుకుంటున్నావుకదూ? మీకు నేను పిశాచిగా కనబడటంలేదూ? అవును తల్లీ, పాపమెరుగని పసిమనసులకు నావంటి పాపాత్ములు భూతాలుగా కనబడరా మరి? కాని నిన్నొక్కటి వేడుకుంటున్నాను తల్లీ, ఒక్కసారి నేను వినేట్లుగా లక్ష్మిని 'అమ్మా' అని పిలూ; చెవులారా విని నేచేసిన పాపం కొంత శమించిందని పొంగిపోతాను. శారదా, నిన్ను మీ అమ్మనుంచి ఎడంచేసిన పాపిని నేను. మరొక పరాయి స్త్రీని తల్లిగా భావించి భ్రమపడేట్లుచేసిన పిశాచిని నేను. ఇదుగో ఇప్పుడు నిన్నూ, మీ అమ్మనూ ఒక్కచోటికి చేర్చాను. ఏ చేతులతో మిమ్మల్నిద్దరినీ విడదీశానో ఆ చేతులతోనే మిమ్మల్ని కలిపివేస్తాను. లక్ష్మీ, ఇదుగో నీ బిడ్డ. నువ్వు తొమ్మిదినెలలూ మోసిన బిడ్డ. ఇన్నేళ్లనుంచీ నీకు ఎడమయింది. ఆ ఆపేక్ష అంతా ఒక్కసారిగా తీర్చుకో" అని మార్గరెట్ ఆగిపోయి కళ్లు తుడుచుకుంది.'

ఉన్న కుర్చీలోనుంచి ఒక్కసారిగా పెకలించి ఎక్కడికో విసిరివేసినట్లు శారద స్తంభించిపోయింది. అంతా శూన్యంగా కనబడుతోంది. పధ్నాలుగేళ్ల బతుకూ పేకమేడలాగా, నీటిబుడగలాగా ఆ శూన్యంలో కలిసిపోతోంది. "నా తల్లీ, నాతల్లీ!" అని లక్ష్మి శారదను రెండుచేతులతోనూ పసిపిల్లలాగా ఎత్తుకుని ముద్దులతో ఉక్కిరిబిక్కిరయేట్లు చేసింది. లక్ష్మి ఆనందం చూస్తున్నకొద్దీ మార్గరెట్‌కు కన్నీరు ఆగటంలేదు. తను తల్లీపిల్లలను విడదీయటంవల్ల ఎంత పాపం చేసిందో ఆ క్షణంలో గ్రహించగలిగింది. అక్కడ నిలవలేక వడివడిగా వెళ్లిపోయింది. శారదా, లక్ష్మి ఎంత బతిమాలినా వెనక్కు తిరగనైనాలేదు. ఆ పాపాన్ని కడిగివేయగల శక్తి కన్నీటి కున్నదా అనుకుంటూ వెళ్లిపోయింది.

గోడమీద వేలాడుతున్న శాంతమ్మగారి ఫోటో ఒక్కసారి కదిలి "అమ్మయ్య!" అని నిట్టూర్చినట్లు వినిపించింది. ఏదో మోయలేని బరువు కిందికి దింపినట్లు! ఆ బొమ్మకేసి చెమ్మగిలిన కళ్లతో చూస్తున్న శారద అప్రయత్నంగా "అమ్మా" అని పిలిచింది. అమాంతంగా లక్ష్మి వచ్చి శారదను గట్టిగా కౌగిలించుకుంది. తన కౌగిలి నింకెవరు సడలింపగలరు? తన బిడ్డ నింకెవరు దొంగిలింపగలరు? తమ నింకెవరు ఎడం చేయగలరు?



నవసంధ్య

=శ్రీ వేమూరి వేంకటరామనాథం=

మొయిలుముట్టక యారవోసిన వెన్నెలల్
సాగిసాగని చిఱుచాయ లవిగో
రాలిన తెలివెదురాకుల పాన్పుపై
గలగల మ్రోగెడు గాలివాలు
వేకువసలి కొనవ్రేలి పసుపునీట
తడిసిన నీరెండ పొడలచలువ
వ్రాలిన మొలదేటి వరుసల తనియింప
జాలులై సోనలై రాలు తేనె
పసుపువన్నెల పరువులపైన దొరలె
నీలితెలికెంపురంగుల పూలసరులు ;
పైడిపూతలు పన్నిన పట్టుపైట
దాల్చె వనలక్ష్మి నవ్యసంధ్యాంగణమున.

సురలోకభామినీ చుంబితకేకినీ
సందోహ మందలాస్యమ్ము లవిగో
బృందావనోద్యాన వీథీ సుధాపాన
మత్తబంభరరవోన్మాద మదిగో
విద్యాధరీస్నిగ్ధ బింబస్మితోన్మత్త
పికలోకగీతికానికర మదిగో
గంగాతటరసాల ఖాదనోత్సుకకీల
శుకపుటాగతనవాశువులు నవిగో
నిత్యకల్యాణకుసుమమందిరనికుంజ
సానుజీవనశోభాప్రసార మదిగో
వెలది, వనమెల్ల నందనబింబమయ్యె
దశదిశావృతమౌ నుషాదర్పణమున.

'కై౧). ౧౪౪౬ వఱకు గల్గు ప్రౌఢదేవరాయల'ని నిశ్చయించిచె ప్పుటకు ఆధారము లెద్వి? 'లక్ష్మణో పేంద్ర ప్రౌఢరాయక్షితీంద్ర' 'ప్రౌఢ దే వేం ద్ర రా య భూ పా ల వ రు వి షణ్ముఖంబున దయఁజూడుమమ్మసుకవి'అను శ్రీనాథుని చాటూక్తు లే యనునా? అగునేని యవి శ్రీనాథుఁడు దర్శించినది కై౧). ౧౪౪౬ వఱకుఁ గల్గు(ఇమ్మడి) ప్రౌఢరాయలనని నిర్ధారించుటకు సాధకములు గాఁజాలవు. క్రీ. శ. ౧౫-వ శతాబ్దమున ప్రౌఢదేవరాయనామాంకితులు నలుగురు రాజులు విద్యానగరమున రాజ్యమొనర్చిరి. ప్రథమప్రౌఢదేవరాయలు క్రీ. శ. ౧౪౦౪ వఱకును రాజ్యపాలన మొనర్చిన రెండవహరిహరరాయల కుమారుఁడు. సామాన్యముగ శాసనములయం దితని పేరు దేవరాయలనియే కానవచ్చుచున్నను ప్రౌఢ దేవ రాయలని యితనిఁ బేర్కొను శాసనములు లేకపోలేదు. 2 రెండవప్రౌఢదేవరాయలు మొదటి ప్రౌఢదేవరాయల మనుమఁడు; విజయరాయల పుత్రుఁడు. క్రీ.శ. ౧౪౨౨ మొదలు ౧౪౪౬ వఱకు నితఁడు రాజ్యముచేసెను. మూఁడవ ప్రౌఢదేవరాయలు రెండవ ప్రౌఢదేవరాయల కుమారుఁడు. ఇతని వాస్తవమైన పేరు మల్లికార్జునరాయలు; పెక్కుశాసనము లితని ముమ్మడిప్రౌఢదేవరాయలనియే పేర్కొనుచున్నవి. క్రీ. శ. ౧౪౪౬ మొదలు ౧౪౬౫ వఱకు నితఁడు ప్రభుత్వమునల్పెను. నాల్గవ ప్రౌఢదేవరాయలు రెండవ విరూపాక్షరాయల కుమారుఁడు; ఇతఁడు క్రీ. శ. ౧౪౬౫ ప్రాంతమున విద్యానగరసింహాసనము నధిష్ఠించెను. ఇతనిచే సాళువనుండ నరసింహరాయల పక్షమున నరసానాయకుఁడు విద్యానగరమునుండి వెడలనడచి కర్ణాటకసామ్రాజ్యమును స్వాధీనము గావించుకొనినది.

పైఁబేర్కొనఁబడిన ప్రౌఢదేవరాయలు నలువురిలో శ్రీనాథుఁడు దర్శించిన దే ప్రౌఢదేవరాయలనో కనుఁగొనవలసియున్నది. శ్రీనాథుఁడు కొండవీటిని పాలించిన యనవేమారెడ్డి కాలమునుండియు రాజమహేంద్రవరము నేలిన వీరభద్రారెడ్ల యవసానకాలము వఱకును రెడ్డిరాజుల నాశ్రయించియుండెనని యాతని గ్రంథములవల్లఁ దెలియుచున్నది. తరువాతఁ గూడ కొంతకాలము జీవించియుండెనని 'కాశికావిశ్వేశుఁ గలసె వీరారెడ్డి' యను నతని చాటువువల్ల విదితమగుచున్నది. అనవేమారెడ్డి క్రీ. శ. ౧౩౬౧ ప్రాంతమున కొండవీటిగద్దెనెక్కెను; క్రీ. శ. ౧౪౩౬ తరువాత వేమవీరభద్రారెడ్లు రాజ్యముచేసినట్లు నిదర్శనము లెవ్వియుఁ గానరావు. కావున క్రీ. శ. ౧౩౬౦ మొదలు ౧౪౫౦ పర్యంతము శ్రీనాథుఁడు జీవించియుండెనని మనము స్థూలముగఁ దీర్మానింపవచ్చును.

ఇట్లు నిర్ణీతమైన యెనుబదియేండ్లకాలమున విద్యానగరమున పైఁబేర్కొనఁబడిన ప్రౌఢదేవరాయనామాంకితులు నలుగురిలో ముగ్గురు ప్రభుత్వమునల్పుచుండిరి. ఈముగ్గురిలోఁ గడపటివాఁడగు ముమ్మడి ప్రౌఢదేవరాయలు క్రీ. శ. ౧౪౪౬ లో సింహాసనము నధిష్ఠించియుండుటచేతను, అప్పటికే శ్రీనాథుఁడుముసలివాఁడై దూరమున నుండిన విద్యానగరమునకు బయనము సేయు స్థితియందుండకపోవుటచేతను అతఁడు దర్శించిన రాయలుముమ్మడిప్రౌఢదేవరాయలు గాఁడని మనము నిశ్చయింపవచ్చును. ఇఁక మిగిలియుండువారిరువురు. వీరిలో నెవ్వరనుట ప్రస్తుతము చర్చనీయము. ఇంతవఱకు లభ్యమైన గ్రంథసామగ్రినిబట్టి ఈ యంశము స్పష్టముగఁ గనుఁగొనుటకు వీలుగాదు. సర్వజ్ఞ దేవరాయలనియో, ప్రౌఢదేవరాయలనియో కానవచ్చుచున్నది. అతఁ డిన్నవ దేవ, లేక ప్రౌఢదేవరాయలని యూనవాలుపట్టుటకుఁ దగు సాక్ష్యమెందును గానరాదు; కావున నీ విషయమును వేరుమార్గమున సాధింపవలసియున్నది. చంద్రభూషక్రియాశక్తి యెప్పటివాఁడో కనుఁగొనఁగలిగితిమేని ఈ విషయము నందుమూలమున నిశ్చయింపవచ్చును. ఇతఁడు కొండూరుశాసనమునఁ బేర్కొనఁబడియున్నాఁడనియు, నది క్రీ. శ. ౧౩౪౫ నాఁటిదగుటచే నతఁడు శ్రీనాథుని కాలమువాఁడు గాఁడనియు శ్రీ ప్రభాకరశాస్త్రిలుగారు వ్రాసియున్నారు కదా. వారు శాసనకాలమును జక్కఁగ పరీక్షించక

2. ARE. 399 of 1926

పోవుటచే వారి కీయభిప్రాయము గల్గినది. అందు శాసనకాల మిట్లు చెప్పియున్నది:

"అథ నిజతపోరాజ్యే జగత్క్షేమంకరే జాగ్రతి కలికాలే ఏకసప్తత్యధికద్విశతాధికసహస్రాబ్దపరిమితే గతే సంవత్సరే పర్యాయస్య ద్వావింశత్యావర్తే సాధారణనామసంవత్సరే వర్తమానే శ్రావణమాసే కృష్ణపక్షే చతుర్దశ్యా మిందువాసరే యతీంద్రస్య క్రియాశక్తిగురోః పర్వణి తస్యేదం ప్రీతయే శ్రీ చంద్రభూషణాచార్యః......ప్రాదాత్."

ఈ శాసనకాలవిషయమును జర్చించుచు, బ్రహ్మశ్రీ వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రులుగారి సమ్మాన సంపుటమున "కవిసార్వభౌముఁడు-కనకాభిషేకము" అను శీర్షికగల వ్యాసమున నిట్లు వ్రాసియున్నాఁడను: "కలికాలమున ౧౨౭౧ సంవత్సరములు గతించిన పిమ్మట చంద్రభూషణాచార్యులవారి తపోరాజ్యము జరుగుచుండఁగా క్రియాశక్తియతీంద్రగురునియొక్క ౨౨ దియగు పర్వదినమునకు సరియైన సాధారణసంవత్సర శ్రావణ బ. ౧౪ సోమవారమునాఁడు ములికినాటిమధ్యస్థితమైన కొండూరుగ్రామము నగ్రహారీకరించి యాచార్యులవారు బ్రాహ్మణుల కొసఁగిరని తెలియుచున్నది. ఇందు 'కలికాలే' యనునది ప్రమాదజనితము. 'శకకాలే' యని యుండవలయును. మఱియు శా. శ. ౧౨౭౧-వ వత్సరమునకు సరియైన ప్రభవాదివర్షము విరోధికాని సాధారణ కాదు. గణించిచూచిన సాధారణసంవత్సరమునకు సరియగు శకవర్షము ౧౨౯౨ అని తెలియవచ్చుచున్నది. కావున చంద్రభూషణాచార్యులు కొండూరు నగ్రహారీకరించి బ్రాహ్మణులకు దానముజేసినది శా. శ. ౧౨౯౨ నకు సరియైన సాధారణసంవత్సర శ్రావణ బ ౧౪ సోమవారమునాఁడు (౧౯ ఆగస్టు ౧౩౭౦).

"కలికాలే...పరిమితే గతే సంవత్సరే పర్యాయస్య ద్వావింశత్యావర్తే సాధారణనామసంవత్సరే వర్తమానే...యతీంద్రస్యక్రియాశక్తిగురోః పర్వణి" యనుటవల్ల సాధారణ శ్రావణ బ. ౧౪ నాఁడు క్రియాశక్తిగురుని ౨౨-వ యాబ్దికమని తెల్లమగుచున్నది. శా. శ. ౧౨౭౧ కి సరియైన విరోధిసంవత్సరమునకును, సాధారణసంవత్సరమునకును మధ్య ౨౨ యేండ్ల యెడముండుటచేతను, సాధారణసంవత్సరముతో క్రియాశక్తియతీంద్రునికి ౨౨ పర్వములు గడచుటచేతను, శాసనోక్తమైన శా. శ. ౧౨౭౧-వ సంవత్సరము పైఁ జెప్పిన యాక్రియాశక్తిగురువుయొక్క శివసాయుజ్య సంప్రాప్తకాలమని తోఁచుచున్నది. ఆ సంవత్సరమునందే చంద్రభూషణాచార్యులవారును తపోసామ్రాజ్య పట్టాబద్ధులై యుండవలయును."

తరువాత కొంతకాలమునకు బ్రహ్మశ్రీ ప్రభాకరశాస్త్రులవారిని గలుసుకొనినపుడు వారు నాచేఁ జేయఁబడిన కాలనిర్ణయము సరికాదని చెప్పిరి. ఇట్లే మిత్రులు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారును నేఁ జేసిన కాలనిర్ణయ మంగీకరింపఁదగినది కాదనియు, దానికిఁ బ్రబలమగు నాక్షేపముగలదనియు నుడివిరి. ఇంతటి గొప్ప విమర్శకు లామోదించకపోయినను, కొండూరుతామ్రశాసనము కల్పితముగాకుండిన, నాచేఁ జేయఁబడిన కాలనిర్ణయమే సరియైన దను తలంపు నన్ను విడువదాయెను. ఈతలంపు వ్యర్థమైనది కాదని చంద్రభూషణ క్రియాశక్తియొక్క మఱియొక శాసనమువల్ల నిశ్చయమగుచున్నది. ఇది బెంగుళూరు జిల్లా హొస్కోటతాలూకా వోగటగ్రామములోని శివాలయమునందుఁ గలదు. శా. శ. ౧౩౦౦ సంవత్సరమున (అనఁగా క్రీ. శ. ౧౩౭౮-౭౯) వ్రాయించినది. ఇందు దక్షిణవారణాసిస్థిత స్వయంభూత్రియంబక దేవపాదారవింద సేవాసంసక్తుఁడును, కాశ్యపగోత్ర పవిత్రుఁడును.......మండలాచార్య సంసిద్ధచక్రవర్తి ఆచార్యవర్య యభంగరాహుత్తరాయాది బిరుదాంకితుఁడు నగు చంద్రభూషణదేవ ఒడయులవారు మరుదాడుగ్రామమునందలి కొంతభూమిని భాగీరథీపురమున విజయముచేసియుండిన వరదరాజస్వామియాలయమునకు దానము గావించినట్లు చెప్పియున్నది. ఈశాసనగ్రంథమునుగూర్చి కీర్తికాయులు మహామహోపాధ్యాయ ఆర్. నరసింహాచార్యులవారిట్లు వ్రాసియున్నారు. "శాసనమున గొన్ని భాగములు మాసిపోవుట విచారకరము. చంద్రభూషణదేవ ఒడయులకు రెండు బిరుదావళి యాతఁ డొక గొప్ప యాచార్యుఁడని తెలుపు

చున్నది. రెండవ హరిహరరాయల గురువని పెక్కు శాసనములందు పేర్కొనఁబడిన క్రియాశక్తి యను సమకాలీనుఁడైన మఱియొక గొప్ప గురువర్యునికిఁగూడ స్వయంభూ త్రియంబక దేవపాదారవిందసేవా సంసక్తుఁడను బిరుదు గలదు. వీరిద్దరును ఒక్కరని నేను తలఁచు చున్నాఁడను. మఱియు నీదేవాలయమునందే గాన వచ్చెడు క్రీ. శ. ౧౩౮౮ నాఁడు వేయించిన ఇంకొక శాసనమున స్థానికుఁడు గ్రియాశక్తిదేవుడు పేర్కొనఁ బడియున్నాఁడు. ఇది నాచేఁ జేయఁబడిన వ్యక్త్యైకీకరణ మును బలుపుసేయుచున్నది."3

పై రెంటను శాసనమునందలి చంద్ర భూ ష ణ ఒడయలే కొండూరుతామ్రశాసనమునందలి చంద్ర భూషణక్రియాశక్తి. ఇద్దఱును కాశ్యపగోత్రపుత్రులే. ఇద్దఱును దక్షిణ వారాణసీస్వయం భూ త్రియంబక శ్రీ పాదపద్మారాధకులే. ఇద్దఱును యాచార్యవర్యయభంగ రాహుత్తరాయాది బిరుదాంకితులే. మఱియు వారిరువురును నొక్క కాలమువారే. కొండూరును శా. శ. ౧౨౯౨ కు సరియైన సాధారణ సంవత్సరమున బ్రాహ్మణులకు చంద్రభూషణ క్రియాశక్తి దానము చేసెను; మఱియెనిమిదేండ్లకు పిమ్మట శా. శ. ౧౩౦౦ సంవత్సరమున చంద్రభూషణదేవ ఒడయలు భాగీరథీ పుర వరదరాజస్వామికి మరుదాడుగ్రామమున కొంత భూమిని దానము జేసెను. కావున చంద్రభూషణదేవ ఒడయలును, చంద్రభూషణ క్రియాశక్తియు నొక్కరే యగుదురుగాని భిన్నులుగారు.

మఱియు క్రియాశక్తి బుక్కరాయల సంతతి వారికి గురువైనట్లు గ్రంథములవల్లను, శాసనములవల్లను దెలియవచ్చుచున్నది.

బుక్కరాయల కుమారుఁడగు కుమారకంపణ ఒడయల దేవియైన గంగాదేవి తన మధురావిజయ మున—

"అసాధారణసర్వజ్ఞం విలసత్సర్వమంగలమ్,
క్రియాశక్తిగురుం వందే త్రిలోచనమివాపరమ్."

అని ప్రశంసించియున్నది. శా. శ. ౧౩౦౦ లకు సరియైన కాళయుక్తియందు వ్రాయించిన యొక శాస నమున రెండవ హరిహరరాయలు "విరూపాక్ష పాదాబ్జపరమధైకం కులగురు క్రియాశక్త్యాచార్య కలికలధకంఠీరవయశః" అని చెప్పుకొనియున్నాఁడు.4 మఱియు శా. శ. ౧౩౦౧ కి సరియైన సిద్ధార్థి (క్రీ. శ. ౧౩౭౯) నాఁటి దంబాలుతామ్రపట్టికలలో నిజగురు వైన క్రియాశక్తిమూర్తియనుజ్ఞను బొంది గదుగ కీర్తి నారాయణస్వామియాలయమునకు ౭౭ గ్రామములను దానము జేసినట్లున్నది.5 శా. శ. ౧౩౧౨ కు సరియైన శుక్ల నామసంవత్సరమున వ్రాయించిన యొక శాసన మున—

"ప్రాతా పేమ్మడిబుక్కభూప
..............క్రియాశక్తిరి
త్యాఖ్యాతస్య గురో గుణ కోరిన
పతాం శ్రోధ్యద త్ర్కమాత్."6

అని యున్నది. ఇందువలన రెండవ హరిహర రాయల కుమారుఁడైన యిమ్మడి బుక్కభూపాలుఁడు సయితము క్రియాశక్తికి శిష్యుఁడని తెలియుచున్నది. శా. శ. ౧౩౧౯, ౧౩౨౦ నాఁటి రెండు తామ్రపట్టి కలలో స్వయంభూ త్రియంబకదేవపాదపద్మారాధకుఁ డును రాజరాజగురుపితామహ క్రియాశక్తి దేవుఁడు పేర్కొనఁబడియున్నాఁడు.7 మఱియు శా. శ. ౧౩౨౫ కు సరియైన స్వభానుసంవత్సరమునాఁటి శాస నమున విఠప్పఒడయరను రాయసామంతుఁ డొకఁడు దాను "శ్రీమత్క్రియాశక్తిగురుమునీశ్వరచరణకమల మరాళ త్రియంబకపూజాధురంధరుఁడ"నని చెప్పుకొని యున్నాఁడు.7a శా. శ. ౧౩౩౨ కు సరియైన వికృతి యందు వ్రాయించిన శాసనమున ప్రథమ(ప్రౌఢ)దేవ రాయలు

"శ్రీ స్వయంభూ త్రియంబకచరణారవిందారా ధక శ్రీమద్రాయరాజగురుమండలాచార్య ఆచార్య వర్య అభంగరాహుత్తరాయ తపోరాజ్యలక్ష్మీనిజని వాసకాయ శ్రీ క్రియాశక్తిగురువరచరణపరిచరణప్రసా

3. మైసూర్ ఆర్కియాలాజికల్ రిపోర్టు ౧౯౧౯. పారా ౭౩.

4. ఎపి. కర్ణా. సం ౫. చెన్న ౨౫౬.

5. మైసూరు ఆర్కియాలాజికల్ రిపోర్టు ౧౯౧౫ పారా. ౧౦౫.

6. ఎపి. కర్ణా. సం. ౧౦ ముల్. ౧౧.

7. మైసూరు ఆర్కియాలాజికల్ రిపోర్టు ౧౯౧౨ పారా ౯౯.

7 a. ఎపి. కర్ణా. సం. ౮. తీర్థ. ౧౩౩.

దాసాదిత మహితసార్వజ్ఞ సామ్రాజ్యవైభవ శ్రీమద్రా జాధిరాజపరమేశ్వర శ్రీ వీరప్రతాప దేవరాజమహారాజః"

అని ప్రకటించుకొనియున్నాఁడు.8

పైనుదాహరించిన శాసనములలో నొక వోగంటి శాసనమందుతప్ప మఱి దేనియందును చంద్రభూషణా చార్యుని పేరు లేదు. "ఆ కాలమునఁ గర్ణాటాధీశ్వరులకు గురువులుగాఁ గాశీవిలాసక్రియాశక్తిప్రభృతులు క్రియాశక్తిపదలాంఛను లుండిరి" అని శ్రీ ప్రభాకర శాస్త్రులవారు చెప్పియున్నారుకదా. పైశాసనములందు పేర్కొనఁబడిన క్రియాశక్తి యతఁడేల కాఁగూడదు? అను ప్రశ్న యొకటి బయలు వెడలవచ్చును. "ప్రభృతుల" మాట యటుండనిండు. వారు నాకతీతులు. కాశీవిలాసనామధేయుఁడైన క్రియాశక్తిముని యొక్కఁడే కాలమున నుండెననుట వాస్తవము. బుక్కరాయల మంత్రులలో నొక్కఁడైన మాధవమంత్రి కితఁడు గురువని ఇతనిచే విరచితమైన సూతసంహితవ్యాఖ్యయందు కలదు.

"శ్రీమత్కాశీవిలాసాఖ్యక్రియాశక్తీశసేవినా
శ్రీమత్త్ర్యంబకపాదాబ్జసేవానిష్ణాతచేతసా."9

మఱియు శా. శ. ౧౪౭౦ కి సరియైన కీలక సంవత్సరమున వ్రాయించిన శాసనమున "యః సాక్షాద్గిరిశావతారవపుషః కాశీవిలాసేశితుః" అనియు, "శ్రీమత్కాశీవిలాసక్రియాశక్తి శివశైశిక" అనియు రెండుపర్యాయము లితఁడు పేర్కొనఁబడియున్నాఁడు.10 ఇంతకంటెఁ బ్రస్తుత మితనిగురించి మఱి యేమియుఁ దెలియదు. లభ్యమైన శాసనాదిసామగ్రిని బరిశీలించిచూడఁగా నితఁడు కర్ణాటాధీశ్వరులకు గురువని తెలఁచుటకు లేశమైన నవకాశము గాన్పించదు; పైనుదహరింపఁబడిన శాసనములందు క్రియాశక్తికిఁగల బిరుదు లితనికి లేవు; చంద్రభూషణక్రియాశక్తికిఁ గలవు; కావున వానియందుఁ బేర్కొనఁబడిన క్రియాశక్తియాని కాశీవిలాసుఁ డనుటకంటెఁ జంద్రభూషణుఁడనుట యుక్తము. కాశీవిలాసుఁడు క్రియాశక్తిమతమునకుఁ జెందిన సామాన్యశైవసన్యాసిగాని కర్ణాటాధీశ్వరులగురువు గాఁడు. అప్పటి కర్ణాటాధీశుల కులగురువు చంద్రభూషణుఁడేకాని యన్యుఁడు గాఁడు. ఈ పేరటి క్రియాశక్తి యొకఁడు రెండవ ప్రౌఢదేవరాయల కాలమున నుండెనేమో యని శ్రీ ప్రభాకరశాస్త్రులవా రాశంకించిరి. దొరకినంతవఱకుఁ గల చరిత్రసామగ్రిని గాలించి చూచినను రెండవ దేవరాయల కాలమునఁ జంద్రభూషణ క్రియాశక్తి యొకఁడును గానరాఁడు. కావున రెండవ దేవరాయలనే శ్రీనాథుఁడు దర్శించినదని మొట్టమొదట నొక నిరాధారపు సిద్ధాంతమును జేసికొని దానిని నిజముసేయుటకై యాతని కాలమున నొక చంద్రభూషణాచార్యుఁ డుండియుండవలయునని వాదించుటకంటె చంద్రభూషణాచార్యులకు సమకాలికుఁడును, శ్రీ క్రియాశక్తిగురువరచరణపరిచరణ ప్రసాదాసాదితమహిత సార్వజ్ఞసామ్రాజ్యవైభవుఁడును నైన మొదటి దేవరాయలనే దర్శించెననుట సమంజసము.

కావున (౧) కొండూరు వోగంటశాసనములవలన మొదటిబుక్క, రెండవహరిహరరాయలకాలములో చంద్రభూషణక్రియాశక్తి యుండినట్లు తెలియవచ్చుటచేతను, (౨) పెక్కుశాసనములయందు చంద్రభూషణక్రియాశక్తియొక్క బిరుదులే గల క్రియాశక్తిగురుఁ డొకఁడు విజయనగరరాజులకు కులగురువని చెప్పియుండుటచేతను, (౩) ప్రథమ దేవరాయలు చంద్రభూషణాచార్యుల బిరుదావళినే గలిగిన క్రియాశక్తి గురువరచరణ పరిచరణ ప్రసాదాసాదితమహిత సార్వజ్ఞసామ్రాజ్యవైభవుఁడనని చెప్పుకొనియుండుటచేతను, (౪) శ్రీనాథుఁడు 'చంద్రభూషక్రియాశక్తి రాయలకడఁ బాదుకొల్పితి సార్వభౌమబిరుదు' అని వచించియుండుటచేతను, (౫) రెండవ దేవరాయల కాలమున చంద్రభూషక్రియాశక్తి యను పేరు గలవా రెవ్వరును లేకపోవుటచేతను శ్రీనాథుఁడు దర్శించిన దేవరాయలు మొదటి దేవరాయలేయనియు, వతని సన్నిధినే యతని గురువర్యుఁడగు చంద్రభూషక్రియాశక్తి యొడయుల యాధిపత్యముక్రింద నడచిన విద్వత్సభలో శ్రీనాథుఁడు డిండిమభట్టారకు నోడించి సార్వభౌమపదమును, కనకాభిషేకమును బడసెననియు నమ్ముచున్నాము.

8. ఎపి. కర్ణా. సం ౧౧. దావణ. ౨౩.
9. సోర్సెస్ ఆఫ్ విజయనగరహిస్టరీ, పుట ౫౧.
10. ఎపి. కర్ణా. సం. ౮ షికా. ౨౮౧.

ఇలవేలుపు

●

= శ్రీరామకృష్ణశాస్త్రి =

మనిషి మనిషికీ ఒకతత్త్వం. మనిషి - మనిషికీ వేయిమంది మనుష్యుల పెట్టు స్వార్థం:

ఒక్కొక్క స్వార్థానికి..ఒక్కొక్క దేవుడు. ఆ ఒక్కడికే ఇలవేలుపు.

...నీకు అభిరుచులు మాటిమాటికీ మారుతూంటేనే గాని, జీవితంలో తగినంత రుచీ - పచీ అనుభవించలేవు.

అనుక్షణమూ మారుతూండకపోతే, నీ బ్రతుకు అనేక బ్రతుకే కాదు. కాని, నీ దేవుడికి ఆ స్వాతంత్ర్యము లేదు...ఒకే మాట...ఒకే బాణం...ఒకే పత్ని.

నీకు నెత్తిమీది దేవతగా...నీ తీరని కోరికలకు అనుకృతి - లక్షణాలు...నీకు అనువైనంతవరకూ ప్రసాదించి..నీ దైవాన్ని ఒకరూపంగా మూటకట్టావు. అది నీవు ఎట్లా ఆడించితే అట్లా ఆడవలసిన కీలుబొమ్మ...

నీ తప్పులన్నింటికీ పూటకాపు నీ దైవం... కాని ఆ అభాజనుడు, పొరపాటునన్నా తప్పుచేస్తే... దండించకుండా దయతలచి విడిచిపెట్టిన పాపాన పోవు...

అసలు, నీ తాళం తప్పింది: కాని, అడుగు తప్పు చేశాడని, చేతికి అందింది పుచ్చుకుని ఆ లేత కాలు విరిగేట్టు ఒక్క పెట్టు పెట్టావు ఆనాడు: కాని, అందరి పసిపిల్లలలాగా అయ్యో - మయ్యో అనేందుకు వీలులేదు ఆ అర్భకుడు. ఆలా కుంటుతూనే వ్యత్యస్త పాదారవిందుడుగా...నీవు ఆడమన్నట్టు ఆడితీరవలసిందే కాదా...తీర్థులా...

దేవుడు దేవుండవగా దేవుండా సీమనుండి దిగి వచ్చేనా?...ఎదుట ఉన్నవాడే పెళ్లికొడుకు...అని అమ్మవారిని పడకగదిలో బిగించి...అర్ధరాత్రివేళ అశ్వమేధపర్వం పిండించి...నారాతే బ్రహ్మరాత అని రాజునూ, ప్రజలనూ బుకాయించిన మహానుభావుడవు నీవే కాదటయ్యా.

పక్కను చేరుక చెక్కిలినొక్కుచు చక్కగా సొక్కుయుండే వేళ...మీ ఆయనతో నను బ్రోవమని చెప్పవే అని అనుశాసించింది నీవే కాదటయ్యా!... అంతఃపురంలో అణగి మణగి...ఆకాశాన్నైనా నీకు అందకుండా ఉందామన్నా, అక్కడైనా వాళ్లకు నీ అహంకారం, కడగండ్లు తప్పడంలేదు...కవీ, రవీ కానని చోట్ల సొంతు శోధించేందుకు ... నీవే తగిన మొనగాడవయ్యా!

ఔను, మరి. నీ దేవుడు...కర్తనన్నా, లేదన్నా అతడికి నీవే దిక్కు...మనుగడ.

నీ దైవం కుయ్యాలించే దైవం. వాని తలదన్నినవాడు - మరొకడు లేడు...

కాని... నీకూ నీ దైవానికీ...గోవుకూ గోపాలుడికీ ఉన్న లంకె...ఈ అనుబంధం లేకపోతే, ఇద్దరూ ఉండరు...(అని నీకు తెలియదు.)

...ఇంతకూ, దేవుడూ మనిషివంటి వాడేనంటావా?...

* * *

ఇవన్నీ, మనం ఎవరమూ ఒప్పుకోని...ఒప్పుకోకూడని...సంగతులు.

—దేవుడూ మనిషివంటివాడే!

...ఉన్నమాట కాస్తా అనేస్తే, వాళ్లకన్న నిజానికి, మనకే ఉలుకు ఎక్కువ: ఎందుచేతనంటే, అది మన నిర్వ్యాపారకత్వమాయెను!

దేవుడంటే...మనకు కోపం తెప్పించినప్పుడు శుద్ధదయ్యం!...పాపం, అది వట్టి నోరు-వాయ లేని పదార్థం: మనం తినమన్నప్పుడల్లా తినాలి: పెట్టిన నగలన్నీ మోయాలి: మన పలకింపు-సేవముచ్చటలన్నీ తీరిన తరువాత, అప్పుడు అమ్మవారిపక్కకు ఒత్తిగిలాలి: నిద్ర ఉన్నా లేకపోయినా, కోడి కూయక ముందే, మళ్లీ మేలుకుని కూర్చోవాలి: అన్నింటికీ కిక్కురుమనకుండా, సహించి, రాయిలాగా...నల్ల రాయిలాగా పడిఉండాలి: అలా ఉంటున్నా అద్దానికి ఒక్కొక్కనాడు చివాట్లు తప్పవు:

—ఎక్కడున్నాడయ్యా దేవుడు?—ఎక్కడా, మన నెత్తిమీద: నీవుకాని, నేనుకాని...దేవుణ్ణి ఇంకోచోట ఉండనియ్యం. నెత్తిన ఎక్కించుకు కూర్చుంటాము కంచన్‌గా; అలుక వచ్చినప్పుడు ఎత్తికుదేసేందుకు వీలుగా-(అనుషంగికంగా ఇక్కడ ఒక విషయం ప్రస్తావించాలి: సంప్రదాయసిద్ధంగా... నెత్తిన ఎక్కించుకున్నవాళ్లు ఎవరైనా దేవతలే: సర్వసాధారణంగా ఆగౌరవం పెళ్లాం అనే వస్తువుకు దక్కుతూంది. అయితే, పెళ్లాం దేవత అయినప్పుడు, తల్లి దయ్యం కావలసిన అగత్యం ఉన్నదా అంటే... ఆహాఁ, ఓవిధంగా, ఉన్నదనే చెప్పాలి. దేవతకూ-దయ్యానికీ ఉన్న అవినాభావసంబంధాన్ని బట్టి, దేవత-దయ్యం, ఏకకాలమందు తనపెళ్లాం కాలేనప్పుడు...తనపిల్లల తల్లి కాకపోతే, తన తల్లి అయినా దయ్యం అయితీరాలి అని సంప్రదాయం. లేకపోతే, లోకం బొటా-బొటిగా ఉండదు...ఇది యావత్తూ అప్రస్తుతం......)

* * *

—దేవుడులోంచి దేవతల్లోకి విస్తరించాము: ఇంత జనాభా ఎలా పెరిగిందయ్యా అంటే...నీ కులగోత్రాభివృద్ధినిబట్టి నీ యిలవేలుపులసంఖ్యకూడా వృద్ధిఅవుతూనేఉంటుంది: ఎవరి పంచె వారు కట్టుకున్నట్టు...ఎవరి చీరె వారు సింగారించుకున్నట్టు... ఎవరి దేవుడు వారికంటూ ఉండాలి: (అప్పుడప్పుడు, ముచ్చటకొద్దీ, వారిది వీరూ-వీరిది వారూ సింగారించుకున్నా, ఎల్లకాలమూ ఉంచుకునేందుకు వీలు లేదుకనుక ఎప్పుడో అప్పుడు తిరిగి యిచ్చేసెయ్యాలి: ఇలా, వాసిక ఎక్కువకావడంలో కొందరు దేవతలు అరిగి-చిరిగి చివరకు ఎందుకూపనికిరాకుండా పోతారు: కొంతమంది పాతబడి, అట్టడుగున పడిపోతారు: ఎల్లకాలమూ చెక్కుచెదరకుండా మన్నే దేవతలు ఎందరో ఉండరు. ఇక ఉమ్మడివాటి సంగతా?... అది అంత గణుతించవలసిన విషయం కాదు.)— (మునుపు ముక్కోటిదేవతలు ఉండేవారు: ఆతరువాత, లోకం యావత్తూ, మన జనాభా ఎంతో పెరిగింది ...మధ్యమధ్య ఎన్నో అవాంతరాలు వచ్చినవి: ఈ మధ్యనే అయిదారేళ్ల పాటు పెద్ద యుద్ధంకూడా జరిగి నేల కొంతమేర తెరిపి అయిందట: ఇవన్నీ పారజూసుకుని, ఇప్పుడు, ఆలెక్కను వాళ్ల సంఖ్య పెరిగిందో, విరిగిందో తేల్చుకోవాలి. అది, ఎవరో పనీపాటా లేనివాళ్లు తీరుబడిగా తిని కూర్చుని గుణకారం చేయవలసిన విషయం.)

* * *

ఎక్కడివాడయ్యా దేవుడు?—ఎక్కడ ఉంటాడయ్యా?

ఎవరిని అడిగినా, ఎవరికి వారు, ఎవరికి తోచినట్లు వారు...చెపుతారు. అయితే, ఒకరన్నమాట ఇంకొకరికి పొసగదు. 'ఎందెందు వెదకిచూచిన అందందే కలడు' అని, దత్తకొడుకు, వాళ్ల నాన్నతో మొరాయించాడు: కాని అంతకు పూర్వం, 'క్రోడంబై పినతండ్రిని కూల్చిన' సందర్భంలో, వాళ్ల నాన్న ముల్లోకాలూ గద బుజాన వేసుకుని గాలించి చూసినా ఎక్కడా కనబడలేదు. తిరిగి తిరిగి విసివి-వేసారి చివరకు, 'పోనీ, ఎవడో అనామకుడు' అని ఊరుకున్నాడు. హరి హరీ అంటూ యింట్లో పిల్లవాడు అహోరాత్రములూ అదేపనిగా పోరు పెడు

తూంటే...' ఈ సచరాచరములకు వధీనునాచు నేనుండగ, ఈతడు (రామానుజపురవాసుడు)సర్వేశుడు, నా, దేవదురా? హరి అనువా దేవదురా?' అంటూ నిజంగానే, తెలియక అడిగాడు: 'తనయందు నిఖిల భూతములందు నొకభంగి, సమహితత్వంబున' తన తమ్ముని నాశనంచేసిన ఉద్దండుడు ఉండగలిగినదే లౌక్యం అమాయకుడైన దానవాగ్రణి గ్రహించలేక పోయినాడు: అందువల్లనే, ప్రహ్లాదుని భక్తికి జడిసి, స్తంభంకడుపున పుట్టవలసిన ఇరకాటంలో పడ్డప్పుడు కూడా...వాళ్ల నాన్న ఎదుట నిజరూపంతో సాక్షాత్కరించేందుకు జంకాడు: కనుక, ప్రహ్లాదుని యిలవేలుపు అతడు వెదకినచోటల్లా...ఉండమన్న చోటల్లా కనబడ్డాడుకాని...వాళ్ల నాన్నకు అలా అందుబాటులో గోచరించలేదు...

ఎక్కడున్నాడయ్యా దేవుడు ?—

'కలడందురు దీనులయెడ...సకలయోగి గణములపాలన్ ...'

ఈ రెండుముక్కల్లోనూ పిసపాలుకూడా నిజం ఉండేందుకు వీలులేదు: దీనులకు దేవుడు ఇవ్వలేని వరం దైన్యం. అందుచేతనే, దీనులపాలిట ఎన్నడూ దేవుడు ఉండడు. వారు, దైవోపహతులైన భాగ్యశాలురు కాలేని అదృష్టవంతులుకదా !

ఇహ, యోగిగణముల విషయం...యోగులకు దైవసాక్షాత్కారం కలిగితే...ఉన్నంతలో వారు తరించి సిద్ధులుగా మారిపోతున్నారు: యోగులుగా నిలిచే యోగ్యత సమసిపోతూన్నది. దహరాకాశపు పండువెన్నెలలో దాక్కునేందుకు వెంపరలాడే దేవులనందరినీ తరిమివేసి అక్కడ అద్దంలాగా ఉంచుకోవడమే యోగం చేసే సాధన. ఆ పరగణా యావత్తూ దేవుడన్నదానికి 'టాబూ':

ఎక్కడున్నాడయ్యా దేవుడు ?

ఎక్కడ లేడయ్యా ?

—ఆమాటకు ఈమాట తెగులు. అంతటితో యీ మీమాంస అపూటకు...కట్టుబడుతుంది.

దేవుడు వెయ్యేళ్లూ వర్ధిల్లుతూంటాడా ?— ఎక్కే, అది ఎలా పొసుగుతుందయ్యా ? వెయ్యేళ్లకూ నీకు ఎన్నేళ్లు ఆయుస్సో, నీదేవుడికీ అంతే కాదూ? ...నీవు పెట్టింది తిని, నీవు యిచ్చింది కట్టుకుని, ఉండమంటే ఉండి, ఊడమంటే ఊడి...సర్వకాలసర్వావస్థలయందూ, నీకు అక్రీతదాసుడుగా పెట్టిచాకిరీకి తేరగా కుదిరిన దేవుడికి.....నీవు ఊడగానే అంతటితో ఆ నౌకరీకూడా ఊడుతుంది. నీకు, అస్తమించిన అనంతరం, మకేత్రోవా లేకపోతే అధమం పంచభూతాలలో నీకైనంతవరకూ కలసిపోయే వాక్కు అయినా ఉంది...కాని, నీదేవుడు నీలో సమాధిఅయిపోయినందువల్ల ... అక్కడితో ఆతనికి సమాప్తి...

ఏడాది కోసారైనా, ఆబ్దికంనాడు, ఎవరో ఒకరు నీవాళ్లు......నీసుగుణాలనీ (దుర్గుణాలనీ) నీకు యిష్టమైన ఆహార పదార్థాలనీ, తమకు రుచిగా, తలచుకుంటారు. కాని, నీ తద్దినం నాడైనా నీదేవుడి పేరు చెప్పి వాళ్లు పట్టెడు పిండకూడు వెయ్యరు. కాకులూ, కచ్చికలూ, గంగిగోవుపాటి చెయ్యలేదు నీవుపోయిన తరువాత...నీదేవుడు.

నీదేవుడూ నీ అంతటి 'అర్ధాయుష్కు' వాడేను!

నీదేవుడు...నా దేవుడు.

భక్తికొద్దీ మనం వాళ్లని పెట్టే బాధలు పగవాళ్లకైనా వద్దు బాబూ.

నీ ఉమ్మసుకొద్దీ నీవు పర్కారు సొమ్మంతా ఖర్చుపెట్టి సంతర్పణలూ, సమారాధనలూ చేసి... చివరకు ఆనావచ్చేటప్పటికి, ఆబగుబంతా నీదేవుడి నెత్తిన వేస్తే...పాపం ఆ అమానవుడు ఏ తిప్పలో పడి అర్ధరాత్రివేళ వచ్చి ముడుపు చెల్లించిపోవాలి!— అత్తగారి పోరుపుట్టు పడలేక అలసి సొలసి నీవు అలా భక్తిలోకి ఒరిగిపోతే నీదేవుడు, దక్కిన్నూ తన రూపు కూడా మాపుచేసుకుని, కంట్లో వత్తివేసుకుకూర్చుని యింటెడు బియ్యం పిండివిసిరిపోయాలి...!—నీకు కాలునొచ్చినా చెయ్యినొచ్చినా నీదేవుడు, కణుక్కుంటూ ఊడిపడి నీకు దమ్మిడీఖర్చు లేకుండా, చేత్తో తీసివేసినట్టు బాధ మటుమాయంచెయ్యాలి.

—ఏది చెయ్యమంటే అదల్లా చెయ్యాలి. ఎప్పుడు పిలిస్తే అప్పుడు పలికేట్టు ఉండాలి! నీవు విడిచేతే, దులిపేసుకుని పడిఉండాలి: నీకు అనుగ్రహం వచ్చి పిలిస్తే సంతోషంతో చంకలుకొట్టుకుంటూ, వచ్చి వాలాలి.

అంతే, ఏం చేస్తాం. అనుదుట మనం అల్లా వ్రాశాము...ఆ బ్రతుకు అల్లా వెళ్లమారవలసిందే!

ఇంట్లో-వంట్లో కట్టిపడేసుకున్న దేవుళ్ల సంగతి యింత లక్షణంగా ఉంది గనుక, ఇక, గుళ్లో స్తంభించి పోయిన రాయళ్ల సంగతి ఆలోచిద్దామా?—'యింటి కన్న గుడి పదిల'మనే సామెత యీ స్వరూపాలకు దేనికీ అనువర్తించదు: ఈ వాక్యానికి కర్త పూజారి:

పూజారి ఉన్నంతవరకూ ఆ దేవుడికి మైనారిటీ వెళ్లదు...ఏం వరం యివ్వబోయినా అది చెల్లదు ...ఎంత సంపాదనపరుడైనా...ఎంత ఆస్తిఉన్నా... ఏ దేవుడికీ కనీసపుహక్కులైనా లేవు:

కొందరి దేవుళ్లు...పగతీర్చుకునేందుకు బ్రతికుండగానే వాళ్ల కడుపున పుట్టి చేతనైనంతవరకూ పగ సాధించుకున్నారు. కాని, అందరికీ అలా తెగించడానికి భయంకాబోలు: వాళ్లకన్న పైఎత్తుగా... మళ్లీ వాళ్లకడుపున నీలాటి-నాలాటి రాలుగాయలు పుడితే?—(దేవతల కడుపున దయ్యాలు పుట్టడమంటే...అందుకు యిదే హేతువు.)


యుద్ధానంతర పునర్నిర్మాణమంటూ ఇదో హాబి, ఈ నడుమ ఎలాగూ రానేవచ్చింది కనుక... యీ సందర్భంలోనైనా...మన దేవుళ్లకు మనతో పాటు చతుర్విధస్వాతంత్ర్యములలో...పోనీ అన్నీ కాకపోయినా అధమం కొన్నైనా...అబ్బేట్టు చూడటం మనకు విధాయక మానా, కాదా?

—'అన్నివిధాలా అణగీమణగీ పడిఉండని దేవుడు మాకు అసలే అక్కర్లే'దంటారా?—అదీ మాటాకే!—దేవుడు బ్రదికిపోతాడు: కాని, నిరంకుశత్వం చెలాయించడమనేది మనకు యీనాటి పరిపాటా?—మనం పుట్టకముందునుంచి మన తల్లికడుపున ఉంది. ఎవరో ఒకరు ఇంకొకరికి లోకువగా ఉండితీరాలి...ఏ మానవుడూ ఇకనుంచి...అట్లాంటిక్ ప్రణాళిక ననుసరించి — ఇంకొకడికి అడుగులకు మడుగులొత్తేందుకు వీలులేదు కనుక ... ఇహ, అడుగూ-బొడుగూ మిగిలింది ఎవరయ్యా?—'ఎవరయ్యా లోకువ?' — అంటే, వందికొండాయ్ శమ్యుడు ... నీ దేవుడు!-నీ దేవుడు మనిషైనా కాడే, పాపం!

'నీ దేవుడేమిటి, నా దేవుడేమిటి...మనలాంటి భూతాలన్నింటా కలయదిరిగేవాడు ఒక్కడేసుమీ... అన్ని పేర్లకూ మూలపదార్థం శాశ్వతమైన ఆ వ్యక్తికే కదా' అని వాదానికి దిగుతావా?...సరే అలా త్రోవకురా...అందరి ఉమ్మడి ఉపయోగానికి ఒక్కడే ఉంటే...మళ్లీ నీకు విడిగా వీడు ఎందుకూ...అది నీ 'అహం' ఔనా కాదా?—ఇంకోమాట, కుమ్మరి ఒక్కసారి కుండచేసి దాన్ని ఆ రూపంలో తగుల బెట్టిన తరువాత...పగిలిపోతే, పనికిరాకపోతే... పారేస్తాడు కాని...మళ్లీ అసలు మట్టిలోకి మార్చేయ గలడా?—మన చేతుల్లో బడి...ఒక్కసారి పుటం వేసిన తరువాత...దానికి మళ్లీ తనలో కలిసిపోగల సత్తా...తగులబడిపోయింది...ఔనా, కాదా?...

ఎవడికి వాడు, వాడిమానాన 'నా దేవుణ్ణి ఏమైనా రాచి రంపాన పెడుతున్నానా, పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నానుకాని!' అనేవాడే...ఔను! 'వెయ్యితిట్లు ఒక్క పూర్ణంబూరెతో సరికావు' అని అనుకుంటూండబట్టే ... నీ దేవుడు నీ పాలిట పడి ఉన్నాడు!...అదే నీలో ఉన్న గొప్ప! అందుచేతనే నీ దేవుడు ఎప్పుడూ నీకు భక్తుడు:

(దేవుడూ మనిషివంటివాడే!—అని గట్టిగా అనుకునేందుకుకూడా వీల్లేనట్టు తోస్తోంది, చూడగా-చూడగా: మనిషివంటివాడైనా అయితే...మనిషికైనా లేని యిన్ని కడగళ్లు...మరి?...)



రష్యాలో విచిత్ర వైద్యశాస్త్ర పరిశోధనలు

పీనుగుల రక్తమైనా ఫరవాలేదు — చచ్చినవారి గ్రుడ్లతో బ్రతికినవారికి కండ్లు — చచ్చినవారి నాడులను దాచే బ్యాంకులు — క్లోరోఫారానికి విడాకులు — కన్నీళ్లతో క్రిమిసంహారణ — పెన్సిలినుకు పెద్దన్న — మృతసంజీవని.

★

= శ్రీ డి. ఎ. ఎ. యస్. నారాయణరావు =

వైద్యశాస్త్రంలో ఈ మధ్య సోవియటు రష్యాలో అనేకమైన ఉన్నతపరిశోధనలు జరిగేయి. ఆ పరిశోధనాఫలితములు సైనికులయొక్కయు, సామాన్యప్రజానీకముయొక్కయు ఆరోగ్యాన్ని త్వరలో పొగొట్టడానికీ, రోగాలను త్వరలో కుదర్చడానికీ ఉపయోగిస్తున్నాయి. ఇటీవల జరిగిన పరిశోధనల మూలంగానే ఆ దేశంలోని సైనికవైద్యశాఖ గాయపడిన సైనికులలో నూటికి 80 మందిని త్వరలో బాగు చేసి మళ్లా యుద్ధరంగంలోనికి పంపేది మొన్నటి యుద్ధంలో. సోవియటువైద్యశాఖ దేశమంతటా బహుళంగా వ్యాపించుటచేతను, ఉన్నతపరిశోధనల ద్వారాను ఇతరదేశములలోని వైద్యశాఖలన్నిటికంటె అత్యున్నతమైన స్థానాన్ని అలంకరిస్తూంది.

పీనుగుల రక్తమయినా ఫరవాలేదు

గాయపడి, రక్తము నష్టపోయిన వారిలోనికెక్కించుటకు రక్తము విరివిగా కావాలి. ఆరోగ్యవంతులనుండి రక్తమును విరామముగా తీసికొని, దానిని జాగ్రత్తపరచి, యుద్ధరంగానికి పంపి, బ్లడ్ట్రాన్స్ఫ్యూజనుకు ఉపయోగిస్తారు. సోవియటు వైద్యులు బ్రతికియున్నవారినుండేకాక, కొన్ని కారణాలవలన చనిపోయిన వ్యక్తులనుండికూడ సకాలంలో రక్తమును తీసినట్లయితే దానిని బ్లడ్ట్రాన్స్ఫ్యూజనుకు ఉపయోగించవచ్చునని కనుగొన్నారు. ఒక వ్యక్తికి ఆఖరుఊపిరి తీసీతీయగానే శరీరములోని జీవకణములన్నీ నశించవు. కనుక అంటుజాడ్యములవలనకాక ప్రమాదములవలన మరణించినవారి శరీరములనుండి రక్తమును చనిపోగానే తీసినట్లయితే అది బ్లడ్ట్రాన్స్ఫ్యూజనుకు ఉపయోగిస్తుంది. ఇలాగ రక్తాన్ని అదనంగా సంపాదించడానికి వీలయింది.

రక్తాన్ని ద్రవస్థితిలోనే కావలసినంత కాలం ఉంచడం, ఒకచోటినుండి ఇంకొకచోటికి పంపడం కష్టం. కనుక దానిని డిహైడ్రేటుచేసి (నీటిని ఇగరగొట్టి), ఘనస్థితిలో ఉండే పదార్థమును తయారుచేస్తారు. ఆ పదార్థము మరల ద్రావకంలో సులువుగా

కరిగి, ద్రవస్థితిలోని రక్తమువలెనే ఉపకరించాలి. ఇటువంటి ఘనస్థితిలోని పదార్థాన్ని సుళువుగాను, తొందరగాను తయారుచేసే కొత్తపద్ధతిని రష్యను శాస్త్రజ్ఞులు ఇటీవల యుద్ధకాలంలో కనుగొన్నారు. దానివలన బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజను శాస్త్రము అభివృద్ధి పొందింది.

చచ్చినవారి గ్రుడ్లతో బతికినవారికి కండ్లు

రష్యను డాక్టరు ఫిలటోవు అనువాడు కొన్ని రకాల గ్రుడ్డితనమును చాలా ఆశ్చర్యకరమైన మార్గంలో కుదర్చడం ప్రవేశపెట్టేడు. చనిపోయిన వారి కళ్లను పీకి గ్రుడ్డివారికి వాటిని అతికి దృష్టిజ్ఞానాన్నిస్తున్నాడు. అదివరకు వైద్యశాస్త్రప్రయోగంతో దృష్టిని తిరిగి పొందినవారందరికంటె ఎక్కువమంది గ్రుడ్డివారిని ఫిలటోవు ఒక్కడూ తన నూతనపద్ధతితో బాగుచేసేడు.

చచ్చినవారి నాడులను దాచే బ్యాంకులు

ఫిలటోవు చనిపోయినవారి ధాతువులను (tissues) కొన్నిటిని తీసి బ్రతికియున్నవారి కతకడం, చనిపోయినవారి నాడులను గాయపడిన సైనికులకు అతికి వారిని చావునుండీ, పక్షవాతంనుండీ తప్పించడం కూడా కనుగొన్నాడు. రక్తాన్ని విరాళాలుగా తీసికొని, అవసరార్థం బ్లడ్ బేంకులలో ఎలా దాస్తారో, అలాగే శవాలనుండి నాడులను తీసి ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఉపయోగించడానికి నెర్వు బేంకులలో దాస్తున్నారు రష్యను వైద్యులు.

క్లోరోఫారానికి విడాకులు

విష్నెవిస్కీ అను రష్యన్‌శాస్త్రజ్ఞుడు క్లోరోఫారం అవసరం లేకుండానే నొప్పిలేకుండా ఆపరేషనులు చేసే పద్ధతి ప్రవేశపెట్టేడు. సొయకిన్ అనే రసాయనిక పదార్థాన్ని ఆపరేటు చేయవలసినచోట ఇంజెక్టు చేస్తే, ఆ చుట్టుపట్ల ప్రదేశము మాత్రం చైతన్యరహితమవుతుంది. అప్పుడు ఆపరేషనుచేస్తే రోగికి నొప్పి ఉండదు. ఆపరేషను చేస్తున్నప్పుడే కాక, చేసిన తరువాత గాయము మానుట మొదలుపెట్టేదాకా కొన్నాళ్లవరకూకూడా నొప్పి ఉండదు. దీనివలన సైనికులకు బాధ చాలావరకు తగ్గింది.

లీనాస్టెర్న్ అనునామె పరిశోధనలు సోవియటు వైద్యంలో గొప్ప అభివృద్ధి తెచ్చేయి. రక్తంలోనికి ఏ దేనా పదార్థాలను ఇంజక్షను చేసినప్పుడు అవి మెదడులోకీ, సెరిబ్రోస్పైనలు ద్రవంలోకీ వెళ్లలేవు. మెదడులోనుండి వచ్చే నాడుల కణాలూ, వెన్నుముకనుండి వచ్చే నాడుల కణాలూ ఈ సెరిబ్రోస్పైనలు ద్రవంలో ఉంటాయి. సెరిబ్రోస్పైనలుద్రవంలోకి పైనుండి పదార్థాలు సాధారణంగా వెళ్లలేకపోవడంవల్లనే శరీరంలోని రక్తము పాడయినా, మెదడు సుళువుగా పాడవకుండాకాపాడబడుతూంది. కాని ఇలాగ రక్తంలోనికి పంపబడిన పదార్థాలు సెరిబ్రోస్పైనలుద్రవంలోకి వెళ్లలేకపోవుటచేత సిఫిలిస్, టెటనస్, పక్షవాతం మొదలైన కొన్ని రోగాలు రక్తంలోనికి ఎన్ని ఇంజెక్షనులు పంపినా కుదరడంలేదు. ఆ ఇంజెక్షనుమందులు సెరిబ్రోస్పైనలుద్రవంలోకి వెళ్లి, మెదడుమీద పనిచేస్తేనే ఆజబ్బులు కుదురుతాయి. లీనాస్టెర్న్ ఈవిషయాన్ని గ్రహించి, కొన్ని జబ్బులకు ఇంజెక్షనులు రక్తంలోకి కాక నేరుగా సెరిబ్రోస్పైనలుద్రవంలోకి ఇవ్వాలని సూచించింది. అందుమూలంగా సాధారణంగా గాయపడినవారికి కలిగే మతిభ్రమణ (Shock) త్వరగా కుదర్చబడగలుగుతూంది. సెరిబ్రోస్పైనలుద్రవంలోకి కొన్ని రసాయనికపదార్థాలను ఇంజెక్టుచేయగానే, మతిభ్రమణ పోతూంది. ఈవిధానం గాయపడిన చాలామంది సైనికులకు ఉపయోగపడింది. ఇదేవిధానం టెటనసురోగాన్ని కుదర్చడంలోకూడా చాలా ఎక్కువగా ఉపయోగపడుతుంది.

కన్నీళ్లలో క్రిమిసంహారణ

లాలాజలంలోను, కన్నీళ్లలోను, ఇతరగ్రంథుల నుండి వచ్చే ద్రవాల్లోను లైసోజైము అనే పదార్థం

ఉంటుంది. అది బేక్టీరియా క్రిములను నశింపచేస్తుంది. ఆపదార్థాన్ని కాల్పులు మాన్పడానికీ, కొన్ని ఇతర గాయాలు మాన్పడానికీ ఉపయోగంలోనికి తెచ్చిన వాళ్లు సోవియటుశాస్త్రజ్ఞులు. ఈ లైసోజైమును ఇంకొక పదార్థంతో కలిపి దానిని రక్తవిరేచనములు కుదర్చడాని కుపయోగించేరు.

పెన్సిలినుకు పెద్దన్న

కలరాను సూక్ష్మంగా గుర్తించే విధాన మొకటి ప్రొఫెసరు ఎర్మలోవా కనుగొన్నాడు. అనేకవిధము లైన క్రిమివినాశకమందులను అతడు కనుగొన్నాడు. సలోఫ్నిలుద్రవ్యాలకు లొంగని కొన్ని బేక్టీరియా క్రిములు పెన్సిలిను అనే పదార్థానికి లొంగుతున్నాయనీ, ఆపదార్థం యుద్ధసమయంలో గాయాలను మాన్పడానికీ, కొన్ని అంటురోగాలను కుదర్చడానికీ విరివిగా ఉపయోగపడిందనీ అందరికీ తెలిసినదే. సోవియటువైద్యులు పెన్సిలినువలెనే చాలా నేర్పుతో పని చేసే గ్రామిసిడినుఅనే క్రిమివినాశకపదార్థాన్ని కని పెట్టేరు. పెన్సిలినుపనిచేయని కొన్నిరకాల బేక్టీరియాపైకూడా పనిచేస్తూ సోవియటువైద్యులు కని పెట్టిన గ్రామిసిడిను చాలారోగములను కుదర్చడానికి పనికివస్తూంది.

ప్రొఫెసరు నెక్ర్యడావ్స్కీ ఇటీవల కేన్సరు రోగాన్ని కుదర్చడంగురించి కొంత కృషి చేసేడు. నాస్తలినుతైలంలో అల్ట్రాసానికుతరంగాలను పంపి, ఆతైలాన్ని ఇంజెక్షనుఇవ్వడం మూలంగా కేన్సరు రోగాన్ని కొంతవరకూ కుదర్చవచ్చునని చూపేడు.

మృతసంజీవిని

ఒక జీవి మరణబాధ ననుభవిస్తున్నప్పుడుగాని, మరణించినట్లు డాక్టర్లు లెక్కకట్టిన తరువాతగాని ఆజీవిఅవయవాలు మళ్లా సక్రమంగా పనిచేసేటట్లు చెయ్యాలని చాలామంది శాస్త్రజ్ఞులు ప్రయత్నాలు చేసేరు. జీవి ఆఖరుఊపిరితియ్యడంతోటే, దేహంలో రక్తప్రసరణ ఆగిపోవడంతోటే జీవి మరణించినట్లు వైద్యులు చెప్తారు. కాని ఆతరువాత కొంతకాలానికి గాని ఆదేహంలోని జీవకణాలన్నీ చావవు. ఈ మధ్య కాలంలో ఏప్రయత్నంవల్లనైనా ఆజీవిని మళ్లా బ్రతికించవచ్చునా అనేది పెద్దప్రయత్నం. ఇదివరకు ఈరంగంలో హైమన్సు, కామ్సను, ఛీర్ బాష్, కుల్యబోకో, ట్రాకోవ్స్కీ, ఆంద్రియేవ్ అను వారలుపనిచేసి, కొన్నిఫలితాలను తెచ్చేరు. వారందరి ప్రయోగాలలోనూ చనిపోయిన వ్యక్తులయొక్క కొన్ని అవయవాలనుమాత్రం కొంతకాలం బ్రతికించ గలిగేరు. కాని ఆవ్యక్తియొక్క అన్ని అవయవాలూ పనిచేసి మళ్లా ఆవ్యక్తి పూర్తిగా బ్రతికేటట్లు చేయ లేదు.

ప్రొఫెసరు బుర్డెన్కో క్రింద రష్యాలో ఈ సమస్యపై కొందరు శాస్త్రజ్ఞులు ఎనిమిది సంవత్సరాల నుండి పనిచేయడం మొదలుపెట్టేరు. కుక్కలను నెమ్మదిగా చంపి వైద్యాభిప్రాయంప్రకారం అవి చనిపోయినతరువాత, కృత్రిమంగా రక్తప్రసరణమును ఏర్పాటుచేసి, వానిని మళ్లా బ్రతికించేరు. ఆతరువాత మనుష్యులమీద ప్రయోగాలు చేసేరు. ఊపిరి తిరగక చనిపోయిపుట్టిన బిడ్డలను బ్రతికించడానికి ప్రయత్నించేరు. డాక్టర్లు మామూలుగా చేసే ప్రయత్నాలన్నీ విఫలమయి, చావును నిర్ణయించినతరువాత, బుర్డెన్కో శిష్యులు తమ విధానంప్రకారం పనిచేసేరు. ఇలాగ ఆబిడ్డలు బ్రతికేటట్లు చేయగలిగేరు. కాని ఆబిడ్డలు మొదటిలో పునర్జన్మ పొందిన తరువాత కొన్ని గంటలుమాత్రమే జీవించగలిగేవారుకాని ఆతరువాత పరీక్షమూలంగా వాళ్ల ముఖ్యఅవయవాలు కొన్ని సరిగా లేవని తేలింది. యుద్ధరంగంలో గాయాలవలన రక్తనష్టమై చనిపోయినవారిమీద ప్రయోగాలు చేసేరు శాస్త్రజ్ఞులు. వాళ్లలో కృత్రిమంగా రక్తప్రసరణాన్ని గావించి, తరువాత రక్తనాళాలలోనికి రక్తాన్ని ఎక్కించి, చనిపోయిన కొందరు సైనికులను బ్రతికించగలిగేరు. అలా బ్రతికినవారిలో ఇతరజబ్బుల

వల్ల మళ్లా కొన్నిరోజుల్లో కొందరు చనిపోయినా, కొందరుమటుకు పూర్తిగా బ్రతికేరు. కనుక ఏవ్యక్తి అయినా, ఊపిరితిరగక చనిపోయినప్పుడు, ఎక్కువ రక్తనష్టంవలన హఠాత్తుగా చనిపోయినప్పుడు, వైద్య నిర్వచనంప్రకారం చావు సంభవించిన కొద్దినిమిషాల లోగా ప్రయత్నాలు చేసి ఇలాగ మళ్లా బ్రతికించ గలుగుతున్నారు రష్యనుశాస్త్రజ్ఞులు. చనిపోయేక ఇంకా ఎక్కువఆలస్యంగా ఈ విధానం ఉపయోగించి బ్రతికించడానికి వీలవుతుందా, లేదా అని ప్రయత్నాలు చేస్తున్నారు.



శంబుకవధ

[నాటిక]

= శ్రీ గుండిమెడ వెంకటసుబ్బారావు =

[దృశ్యము దండకారణ్యము - శంబుకుని యజ్ఞవాటిక - శంబుకుఁడు యజ్ఞవేదికపై నాసీనుఁడై యుండును. భార్య తుంగభద్ర చెంత నిలచియుండును.]

(నేపథ్యమున వేదఘోషము.)

శంబు—(చేతులు జోడించి నిమీలిత నేత్రుఁడై) హే చరాచరభూతబహిరంతర్విహారీ! హే వేదవేద్యా! హేపరమపురుషా! హే జ్యోతిస్స్వరూపా! హే అనంతసృష్టిస్థితిలయవిధాయకా! హే జగద్రక్షకా! పాహిమాం! పాహిమాం! (ధ్యానంగతుఁడగును)

(ప్రవేశము - శ్రీరామలక్ష్మణులు)

శంబు—(కన్నులు తెఱచి శ్రీరామునిఁ జూచి మహానందముతో) ప్రజ్వలితసర్వదిగంతమూర్తివై, నీలమేఘశ్యాముఁడవై యున్న నీ వెవ్వరవు మహాపురుషా, ఈ యరణ్యదేశమునఁ బ్రత్యక్షమైతివి? నాయజ్ఞఫలస్వరూపుఁడవైయున్న నీ వెవ్వరవు ప్రభూ! ఈమనోహరస్వరూపమే నా నితాంతధ్యానమూర్తి! ఈస్వరూపమే, ఈమహోజ్వలతేజోమూర్తియే నాతపోదృష్టికి సర్వదా ప్రత్యక్షమగుచున్నది! ఆహా! నేను ధన్యుఁడను! ధన్యుఁడను!

పవనాంబుభక్షులై భయదాటవుల ఘోర
తపమొనర్చెడు తపోధనులకైన,
సంసారదూరులై సర్వసంగత్యాగు
లై సంచరించు సంయములకైన
జపహోమయజ్ఞదీక్షాగరిష్ఠాత్ములౌ
బ్రహ్మపథానువర్తనులకైన,
ఆహారనిద్రావిహారనిశ్చలహరి
ధ్యానులౌ భక్తసత్తములకైన,
అందఁగారాని సచ్చిదానందమూర్తి,
సర్వభూతాంతరస్థతేజస్స్వరూపి,
సకలబ్రహ్మాండసామ్రాజ్యచక్రవర్తి,
అహహ! యెంతలో నాకుఁ బ్రత్యక్షమయ్యె!

తుంగభద్రా! రమ్ము, రమ్ము. మనము తరించితిమి.

(శ్రీరామునకు సాష్టాంగప్రణామమొనర్చును.)

శ్రీరా—శంబుకా! నన్ను గుర్తించితివా?

శంబు—గుర్తించితిని. దేవా! నీవు నా ధ్యానమూర్తివి! నాతపస్సమాధియందు ఈ దూర్వాంకురశ్యామలమూర్తియే, ఈ తేజోరాశియే సర్వదా నాయంతర్దృష్టికి గోచరించుచుండును. దేవాదిదేవా! ధన్యోస్మి! ధన్యోస్మి!

శ్రీరా—ఓయీ! నే నెవ్వరి ధ్యానమూర్తినిఁ గాను. తపస్సమాధియందు నే నెవ్వరి హృదయములను వసించువాఁడను కాను. నేను కేవల మొక మనుష్యమాత్రుఁడను.

శంబు—కాదు. కాదు. ఈ నీలనీరద మనోజ్ఞమూర్తినే నేను నిత్యమును నాతపస్సమాధియందుఁ జూచుచున్నాను! ఈ స్వరూపమే! ఈమనోహరాకృతియే! నా యెదుటఁ బ్రత్యక్షమైయున్న యీ దివ్య మంగళవిగ్రహమే యది! అణుమాత్రమును భేదము లేదు. ఈ యాకర్ణాంతవిశాలనేత్రములే యవి! ఈ యాజానుబాహువులే యివి! ఈనీలరత్నచ్ఛటామోహనమూర్తియే యది! మహాపురుషా! నన్నేల పరీక్షించెదవు? నాధ్యానమూర్తివే నీవు! సందియము లేదు.

శ్రీరా—శంబుకా! నేను నీధ్యానమూర్తినిఁ గాను. అయోధ్యారాజ్యమున కధీశ్వరుఁడను నేను! ఎన్నఁడైన రామనామమును వినియుంటివా?

శంబు—రామనామము! వినియుంటిని. అనేకముఖముల వినియుంటిని. తొల్లి యీ వనమునందు నేను దివారాత్రములు శ్రీరామనామమునే జపించుచుంటిని. పితృవాక్యపరిపాలనార్థమై రాజ్యభోగపరిత్యాగ మొనర్చి సతీసమేతముగ నేదినమున నీవు మహారణ్యగామి వైతివో, యాదినమే శ్రీరామనామము నాజపమాలపైఁ బ్రతిధ్వనించుట కారంభము! కాని, రఘుపతీ! ఏదినమున లోకాపవాదహేతుకముగ మహాపతివ్రత, లోకైకపావని, నిరపరాధిని, పూర్ణగర్భధారిణి యగు జానకీదేవిని విభ్రాంతమతివై యరణ్యగర్భమున విసర్జించితివని వినియుంటినో, ఆనాఁటినుండియు రామనామమునందలి మాధుర్యము నా కనుభూతమగుట లేదు! రామనామము ధూమకేతువువలె నాహృదయమున కుత్పాతసూచకమై తోఁచుచున్నది! దివ్యమూర్తి యని నేను భావించిన శ్రీరాముఁడు కేవల మొక క్షుద్రమనుష్యమాత్రుఁడని నేను గుర్తించితిని! ఆదివ్యత్వము అణుమాత్రమైనను నీయందు నా కిప్పుడు గోచరించుట లేదు...... అయినను......అయినను నా ధ్యానదృష్టికిఁ బ్రత్యక్షమగుచుండిన యీ మనోహరమూర్తివే నీవు! సందేహము లేదు. ఇందలి రహస్యమును నేను గ్రహింపఁ జాలకున్నాను!

శ్రీరా—గ్రహింపవలసిన యావశ్యకతయు లేదు. ఓయీ! ప్రస్తుతము నేను నీయెదుట న్యాయాధిపతినై నిలచియున్నాను. నీకు మరణదండనము విధింప నేను వచ్చియున్నాను.

శంబు—మరణదండనమా? రాజేంద్రా! నాయపరాధమేమి?

శ్రీరా—వర్ణాశ్రమధర్మద్రోహివై నీవు సమాజనియమముల నతిక్రమించితివి. నీయజ్ఞకర్మహేతువుచే రాజ్యమునందనావృష్టియు, దుర్భిక్షమును, అకాలమరణములును సంప్రాప్తములగుచున్నవి.

శంబు—(నవ్వి) రాజ్యమునందలి యుపద్రవములకు నాయజ్ఞకర్మమా హేతువు? నీవు సత్యముఁ బల్కుచుంటివా? ఇంతయుక్తిహీనమగు వాక్యము నీముఖమునుండి యెట్లు వెల్వడినది ప్రభూ! ఇదియా నీ న్యాయనిష్ఠ?

కులసతీ విసర్జన మహాకలుషమునను
నీదు మస్తిష్క మిపుడు భ్రాంతిగతమయ్యె!

పాప పుణ్య విచారసందీపనంబు
సాధ్యమగు టెట్లు నీ కింక సార్వభౌమ!

శ్రీరా—శంబుకా! కాలయాపనము వలనఁ బ్రయోజనము లేదు. నీయపరాధము నకు శిక్ష ననుభవించుటకు నీవు బాధ్యుఁడవు.

శంబు—రఘుపతీ! ప్రాణత్యాగమునకు నేను వెనుదీయుట లేదు. కాని, నీధర్మవిచారణమునకు నాకు నవ్వువచ్చుచున్నది! అపూర్వము! అద్భుతము! రామచంద్రా! నీ యధఃపతనమునకు నేను దుఃఖించుచున్నాను. నీపూర్వప్రతిభ చిహ్నమాత్రమైనను లేక సంపూర్ణముగ నశించిపోయినదా? మహారాజా! తెలిసినది!

ఏ రమాదేవి తేజఃప్రసారణమున
నీవు తేజస్విపై యుంటి విన్ని నాళ్లు,
ఆ మహాతేజ మిపు డరణ్యముల కేఁగ,
కాకయున్న నీ కీయధోగతి యదేల?

అకలంకంబగు వంశమా నవసె, స
ద్యశో జీవనాశాలతా
ప్రకరం బెల్ల పదాహతంబయి చనెన్
బాతాళ గర్భంబునన్!
ఇక రాజోత్తమ! పాడు రాచరికమం
దే మున్నదం చీవు మా
నక మోహెత్తితి వాజగజ్జనని వెం
టన్ గానకున్ బోవకన్?

శ్రీరా—శంబుకా! నీతోఁ దర్కవితర్కములు చేయుటకు నేను రాలేదు. నేను యుక్తిజ్ఞానతేజోవిహీనుఁడ నైన నగుదును గాక! శాస్త్రనియమానుసారము నీయపరాధమునకు శిక్ష ప్రాణహరణము. ఆశిక్షా విధానముఁ బాలించుటకు నేను వచ్చితిని. ఎట్టిమరణమును నీవపేక్షించెదవో చెప్పుము. నీవు నాతో యుద్ధముఁ జేయఁగోరెదవా?

శంబు—రాజేంద్రా! రావణవిజేతయగు జగదేకవీరునితో యుద్ధమా? ఇంతకును యుద్ధమున సంహరించుట యొక శిక్షయగునా? నాకుఁ బ్రాణదండనము విధించితివి. ఇదిగో, ఆత్మసమర్పణమొనర్ప సిద్ధముగ నున్నాను. నామూర్ధమును ఖండింపుము. (శిరము వంచును)

తుంగ—(ముందునకు వచ్చి) సూర్యాన్వయసంభవుండును, పుణ్యవ్రతుండు నగు శ్రీరాముఁడవు నీవేనా, మహాపురుషా? నీయెడ నేయపరాధము నెఱుంగని నాభర్తను సంహరింపఁబూనితివా?

శ్రీరా—సాధ్వీమణీ! నీభర్త సంఘవిప్లవకర్తయై దేశారిష్టములకు హేతుభూతుఁడయ్యెను. ఆయపరాధ మెట్టిదో నీకుఁ దెలియదు.

తుంగ—మహారాజా! నాభర్త నిశ్చయముగ నపరాధియే యైనచో, కులకాంతను, అశ్రుధారాసిక్తనై యర్థించుచున్నాను. క్షమాభిక్ష మీయరా? నిరపరాధినినైన నన్ను అనాథను జేసివేయుదురా?

శ్రీరా—కాంతామణీ! నీ భర్తయపరాధము క్షమార్హము కాదు. స్వధర్మత్యాగియై పరధర్మమగు యజ్ఞకర్మానుష్ఠానమును బూని, యావద్రాజ్యమునకు నరిష్టకారియైన నీభర్తయపరాధము రాజదృష్టియందు క్షమార్హము కాదు.

తుంగ—ప్రభూ! రాజదృష్టి మానుషదృష్టి కతీతమైనదా?

శ్రీరా—ఆ జిజ్ఞాసకుఁ బ్రస్తుతము నా హృదయమునందు స్థానము లేదు. కేవల రాజత్వమునకై నేను మానుషత్వమును విక్రయించుకొని చాలకాలమైనది.

శంబు—తుంగభద్రా! నే నొనర్చినది యపరాధము కాదు. నీ వీతని క్షమాభిక్ష మడుగనేల? కేవలము స్వజాతిసంస్కారణమే నాయాదర్శముకాని, పరధర్మగ్రహణము కాదు. మానవసంఘమునందుఁ బరికల్పితమైయున్న స్వార్థనియతిని నేను ప్రతిఘటించితినేకాని సర్వోత్తమమగు ఈశ్వరనియతిని నేను ప్రతిఘటింపలేదు.—రఘురామా! నీశిక్షావిధానమును నీవు పాలింపుము. సిద్ధముగ నున్నాను.

శ్రీరా—లక్ష్మణా! ధనుర్బాణముల నిటు తెమ్ము.

(లక్ష్మణుఁ డందిచ్చును)

తుంగ—(ఇరువురి మధ్యను నిలచి) నిష్ఠురాత్మా! ముందు నా ప్రాణముల హరింపుము. అస్త్రమును బ్రయోగింపుము. ముందు స్త్రీవధాప్రశస్తిఁ బడసి పిదప నిరపరాధిని సంహరింపుము. నిర్దోషియగు మహాసాధ్వియకల్మషహృదయముపై వజ్రాఘాత మొనర్చితివి! లంకారాజ్యమును శ్మశానమొనర్చి యా రుద్రభూమియందు శతలక్షరాక్షసవధూహాహాకారములఁ బ్రతిధ్వనింపఁజేసితివి! ఈవిధానము నీకుఁ గ్రొత్త కాదు. కానిమ్ము. అస్త్రమును విడువుము. నీకీర్తిచరిత్రమును మూడులోకములును గీర్తింపఁగలవు!

శ్రీరా—సాధ్వీమణీ! ప్రభుకార్యమున కంతరాయముఁ గల్గింపకుము.

శంబు — తుంగభద్రా! దూరముండుము. నిర్విచారముగ నుండుము. మన జీవనలీల కిదియే సమాప్తము కాదు. అది యనంతము! అప్రతిహతము!

తుంగ—(ప్రక్కకుఁ దొలఁగి) వధింపుము. వధింపుము. రాజేంద్రా! భర్త ప్రాణముల హరించి నిరపరాధినియగు ధర్మపత్నిని అనాథను జేయుచుంటివా? పాషాణహృదయా! (ఏడ్చును)

శ్రీరా—పతివ్రతామణీ! నీవు సత్యముఁ బల్కితివి. నాహృదయ మిప్పుడు పాషాణమే యైయున్నది. నా తనూమనఃప్రాణసర్వస్వము నిప్పుడు పాషాణమయమే యైయున్నది. లౌకికవ్యథాసముచ్చయము లెంతటి కఠోరములైనను నన్నిప్పుడు బాధింపఁజాలవు. కేవలరాజధర్మమునకై పూర్ణగర్భిణియైన యర్ధాంగలక్ష్మిని విసర్జించితిని! కేవల రాజధర్మమునకై యిప్పుడు నీభర్తప్రాణముల హరించెదను!

శంబు — ఇది రాజధర్మము కాదు. రాజేంద్రా! ఇది రాజధర్మపు నిర్జీవకంకాళము. దానిని నీవు పూజించుచుంటివి. రాజధర్మము, సత్యప్రతిష్ఠ చాలకాలమై నిన్నుఁ బరిత్యజించినవి.

అఖిల భోగత్యాగి యై తొల్లి యేనాఁడు
కాషాయ వస్త్రంబుఁ గట్టినావో!
అధముఁడౌ గుహుని ప్రేమాంజలి చేనాఁడు
శ్రీ పాదయుగళ మర్పించినావో!
శబరి యుచ్ఛిష్టప్రసాదంబు నేనాఁడు
సిద్ధామృతముగ భక్షించినావో!
పగఁబాసి రావణభ్రాత కేనాఁడు లం
కారాజ్యపట్టంబుఁ గట్టినావో!

అహహ ! లోకాభిరామమైనట్టి నాఁటి
ఆ మహోత్తేజ మానాఁడె యస్తమించె !
దండకారణ్యరాజ్యపదంబు విడచి
తిరిగి యేనాఁ డయోధ్యకున్ మరలినానొ !

ఇంకను ధర్మ మెక్కడ? ధర్మమను పేర నధర్మభూతమున కాత్మార్పణ మొనర్చుకొంటివి! ఆ పవిత్రధర్మదేవతా పునస్సంధానము తిరిగి నీ కీజన్మమున లభింపఁజాలదు. —అయినను, నీవు నాయారాధ్యమూర్తివి! నాధ్యానాధిష్ఠాన దేవతవు! ఆ శ్యామసుందర మూర్తివే నీవు! నీయస్త్రాభిఘాతమున నాకు శాశ్వతముక్తి లభించఁగలదు. దేవాదిదేవా! అస్త్రమును సంధింపుము.

శ్రీరా — (అస్త్రసంధానముఁ జేసి) ఆహా!

కడచె సీతాపరిత్యాగకాండ మపుడు,
కడచు నింక శంబుకవధాకాండ మిపుడు,
అహహ ! యీమహారాజత్వమందు నిట్టి
పుణ్యకాండంబు లిఁక నెన్ని మగియవలెనొ !

శంబుకా! నీయపరాధమునకు ఈ దివ్యాస్త్రము నిన్ను భస్మీకృతు నొనర్చి వాయుమండలమున లీనముఁ జేయుఁగాక!

(బాణము విడచును- బాణముతో శంబుకుఁ డదృశ్యుఁడగును)

తుంగ— హా! హా! ప్రభూ! ప్రభూ! (మూర్ఛిల్లి, తిరిగి లేచి) రఘువంశకళంకా! నిష్ఠురాత్మా! పతివ్రతాశాపోపహతుఁడవు నీవు! ముహూర్తమాత్రమైన నీ కీజన్మమున శాంతి యుండదు. అహోరాత్రములు ఆహారనిద్రావిహీనుండవై, సహస్రబంధుమధ్యమున నేకాకివై, మనస్తాపవహ్నిజ్వాలామధ్యంగతుఁడవై నీవు మరణము నపేక్షింతువు! నరరూపరాక్షసా! నీముఖముఁ జూచిన నరకము సంభవించును. నాసమక్షమునుండి తొలఁగిపొమ్ము.

శ్రీరా— దేవీ! అవనతమస్తకుఁడనై చేతులు మోడ్చి నీయభిశాపమును ఆశీర్వాదప్రాయముగ నేను గ్రహించుచున్నాను. లక్ష్మణా! రమ్ము.

(లక్ష్మణునితో నిష్క్రమించును)



అనద

= శ్రీ పురిపండా అప్పలస్వామి =

స్వప్నంలో స్వప్నంలా
పోతూ పోతూ నిలిచిన
సన్నని దోర కాలి దారి
వాకిట్లో జీబురు పొద
పొదలో చీకట్లో నిశ్శబ్దంగా
ఏదో ఒక జాలి పిలుపు
పిలుపే మలుపై తీసిన
తలుపై నను గదిలోనికి
దీనంగా మౌనంగా
కునుకుతున్న గదిలోనికి
మినుకుమినుకు గ్రుడ్డి వెలుగు
ఆరీ ఆరని దీపం
బిగులుబితుకు గదిలోనికి
లాక్కొన్నది.

చవిటినేల పదునారని
చీకు నేల చింకిచాప
పడివున్నది చితిపైవలె
బాలెంత నిషాదుని ని
ష్ఠుర శరమేదో సోకిన
లేడిపోలె.

రొమ్ముమీద
పాలింకిన రొమ్ముమీద
మరణించిన చిన్ని పాప
కొరడువారి చిన్నపాప
రామరామ!
చెక్కులబడి దిగజారిన
కన్నీళ్ళకు తడిసి తడిసి
మలినపు చినిగిన వసనం
పీలికలా ఓదార్పులు!

ఆకలితో శోకంతో
రోగంతో కుమిలి కమలి
పొగలింకిన వా చూపులు
పాతాళం నూతినుండి
వినపడ్డటు మసి గదిలో
ముమూర్షకంఠం జాలిగ
"మాలకొంప బాబా! మీ
పాదం తాకితె పాపం
వదలదు మాకే జన్మల
ఏనాటిదో పాపం మా
కీనాటికి తండ్రీ ఒక
శాపంలా సంఘానికి
అన్నానికి పిడికెడంత
కబళానికి దూరంగా"

(నిట్టూర్పులు గదినిండా
నిట్టూర్పులు రగిలించుక)

"కూలి లేక నను పెంచే
కూడు లేక నాకోసం
ఈ నా ప్రాణం కోసం
పోక పోక రంగానికి
పోయినాడు మహారాజు
పోయిన దారే మళ్ళీ
మళ్ళ లేదు మహారాజు
నీడపట్టు వీడనీక
ఏలుకున్న మహారాజే
జాలి మరచిపోయాడో!"

"నా ప్రాణం నా ముత్తెం
పాలు లేక నీళు లేక
కదలదు నిన్నటి నుండీ
దేవుడికే జాలి లేదు"

"కనికరించు తండ్రీ నా
ప్రాణానికి బాధ లేదు
గరిటెడు పాలే చాలును
కలకాలం మరచిపోను"

ఆరిపోయినది దీపం
నిశ్శబ్దం
బరువై బరువై కాటుక
చెరువై గదిలో చీకటి.

చతురంగయోధులు

[కథానిక]

= శ్రీ క్రొవ్విడి లింగరాజు =

వజీదాలీషా రాజ్యం. లక్నో నగరం పేద సాద అనే వివక్షత లేకుండా భోగవిలాసాల్లో మునిగి తేలుతోంది. ఆటపాటల్లో కొందరూ, నల్లమందు గంజాయి మొదలైన నిషాపదార్థాలతో కొందరూ ఆనందంగా కాలక్షేపం చేస్తున్నారు. జీవితంలో ప్రతిరంగంలోనూ భోగం, విలాసం ఉట్టిపడుతున్నాయి. రాజకీయలోకంలో, సాహిత్యప్రపంచంలో, సాంఘిక వ్యవస్థలో, ఉద్యోగసద్యోగాల్లో, ఆహారవిహారాల్లో అన్నింటిలోనూ భోగపరాయణత్వం ప్రత్యక్షం. ప్రభుత్వోద్యోగులు విషయలోలురు. కవులు ప్రేమవిరహాలమీద తమ కవితాప్రభావాన్ని విజృంభింపజేశారు. జీవితావసరాలను సృష్టించే కమ్మరికుమ్మరివగైరా పారిశ్రామికులు అత్తరు, పన్నీరు, సురమా, బుక్కా, చందనం, గంధం వగైరా సుగంధద్రవ్యాలు తయారు చేయడంలో నిమగ్నులైనారు. అందరి కళ్లకూ భోగవిలాసం అనే మబ్బు కమ్మేసింది. లోకం ఏమయిపోయినా వీళ్ల కేమీ నిమిత్తంలేదు. కోడిపందేలు, డేగపందేలు, జూదాలు అవిచ్ఛిన్నంగా నడుస్తున్నాయి. కొన్నిచోట్ల కొన్నిచోట్ల చతురంగమహాసంగ్రామాలు. ఒక్కటేమిటి? పాదుషా మొదలు ఫకీరువరకూ మూడుపువ్వులూ ఆరుకాయలూగా ఉన్నారు. ఎంతవరకంటే? ఫకీరు కొక పైసా దొరికితే తిండిసామగ్రి కొనుక్కునేందుకు బదులు, నల్లమందో భంగో సేవించే స్థితిలో ఉంది. చతురంగంపాచికలు ఆడడంవల్ల మనుష్యుల బుద్ధి వికసిస్తుందనీ, కఠినసమస్యలను పరిష్కరించే సూక్ష్మాలు స్ఫురిస్తాయనీ వాదిస్తూఉండేవారు జనం. (అలాంటి సాంప్రదాయికులు ఇప్పుడూ ఉన్నారనుకోండి).

అలాంటి స్థితిలో మిర్జా సజ్జాదాలీ, మీర్ రోషన్ అలీ ఇద్దరూ తమ బుద్ధిని రాత్రింబగళ్లూ ఇలా వికసింప జేశారంటే ఆశ్చర్యమేముంది? ఇద్దరికీ పెద్దలబాపతు జాగీర్లున్నాయి. జీవనోపాధికి తడుముకోవాలసిన అగత్యమేమీ లేదు. ఇంట్లో ఊరికే కూచుని చేసే దేముంది? ఈ మిత్రుల దినచర్య ఏమంటే, ప్రొద్దున్నే లేచి అల్పాహారం చిత్తగించడం, సావట్లో తివాచీ పరచడం, చతురంగంపావు లమర్చుకోవడం, అక్కడనుంచి యుద్ధాని కుపక్రమించడం, ఎత్తుపై ఎత్తులు వేయడం! ఆ పైని రెండు ఝాములు కానివ్వండి, మూడుఝాములు కానివ్వండి, సాయంకాలం కానివ్వండి వాళ్ల కేమీ లక్ష్యమన్నమాట లేదు. వంట యిందని ఇంట్లోంచి కబుర్లు వస్తూనే ఉండేవి. "వెళ్లు. వస్తున్నా. పీట వెయ్యమను!" అంటూ జవాబులు చెపుతూనే ఉండేవాళ్లు. చివరకు ఆ వంటవాడికి ప్రాణం విసిగి భోజనంకూడా చావిట్లోకే తెచ్చిపెట్టేవాడు. స్నేహితులిద్దరూ రెండుపనులూ కలిపే కానిస్తుండేవాళ్లు.

మిర్జాసజ్జాదాలీ ఇంట్లో ఎవరూ పెద్దవాళ్లు లేరు. అందుచేత ఆయన సావిట్లోనే ఈ యుద్ధం సాగుతూ ఉండేది. ఇంట్లోవాళ్ల కుమాత్రం సుతరాం ఇష్టముండేది కాదు. వాళ్ల కన్నమాటేమిటి, ఇరుగు పొరుగు నౌకర్లు చాకర్లు, యావన్మందీకూడ చాలా హీనగామాట లాడుతూ ఉండేవాళ్లు. "గొప్ప ఆటరా బాబూ! కొంప గుండం చేసేస్తుంది. ఈ వ్యసనంలో తగులుక్కుండా దేముడు రక్షించాలి. కాని లేకపోతే ఎందుకూ పనికిరాకుండాపోతారు. ఇదొక పెద్ద తెగులు" అనుకుంటూ ఉండేవాళ్లు. మిర్జాబేగం తన భర్తను చివాట్లు

పెట్టడాని కేమైనా సావకాశం దొరుకుతుందా అని చూస్తూఉండేది. కాని అవకాశం దొరికేది కాదు. ఆమె లోపల పడుండేది. బయట ఆట జరుగుతూనే ఉండేది. రాత్రి ఆమె నిద్రపోయాక మిర్జా లోపల ప్రవేశించేవాడు. బేగం తన కోపాన్ని అప్పుడప్పుడు నౌకర్ల మీద తీర్చుకొనేది.

"ఏం! తాంబూలం కావాలంటున్నారా? ఓహో! వచ్చి తీసుకెళ్లమని చెప్పు. భోజనానికే తీరుబడి లేకుండా ఉందేం? భోజనం తీసుకెళ్లి నెత్తినెయ్యండి. తింటే తింటారు, లేకపోతే కుక్కలకెయ్యండి" అంటూ విసుక్కునేది. కాని ముఖాముఖి కొచ్చేసరికి జావ అయిపోయేది. నోరు పెగిలేదికాదు. ఆమెకు నిజానికి మీర్ సాహెబుపైన వచ్చినంత కోపం తన భర్తమీద వచ్చేది కాదు. మిర్జాజీ భార్యదగ్గర తన నిర్దోషిత్వాన్ని స్థిరపరచుకోడానికి దోషం అంతా మీర్ సాహెబు నెత్తిన పారేసేవాడుకాబోలు!

ఒకరోజున బేగంసాహెబాకు తలనొప్పి లంకించుకుంది. ఆమె దాసీని పిలిచి "సాహెబుగారినిలోపలి కోసారి రమ్మని చెప్పు. వైద్యుడిదగ్గర కెళ్లి కాస్త మందు పట్టుకురావాలి. త్వరగా వెళ్లు"అంటూ పంపింది. తీరా దాసీమనిషి వెళ్లి చెప్పేసరికి మిర్జా "వెళ్లు. వస్తున్నానని చెప్పు"అన్నాడు. బేగంసాహెబాది అసలే కోపస్వభావం. తనకు తలనొప్పిగా ఉంటే భర్త చదరంగమాడుతూ కూచోడమా అనే అహంకారంవల్ల కోపం మరీ ఎక్కువైంది. దాసీతో "పో. మళ్లీ వెళ్లి ఆయనగారికి తీరిక లేకపోతే నేనే వైద్యుడిదగ్గర కెడుతున్నానని చెప్పు"అని సందేశం పంపింది.

మిర్జా మంచి రసకందాయంలో ఉన్నాడు. రెండేరెండెత్తుల్లో మీర్ సాహెబుఆట కట్టేటట్టుంది. తెగ విసుక్కుంటూ "ఏం! అంత ప్రాణం కడిట్టిందా ఏమిటి? ఇంకేం తరువాయిలేదూ?" అన్నాడు.

మీర్ సాహెబు — ఏమిటయ్యా! లోపలి కోసారి వెళ్లిరాకూడదూ! ఆడవాళ్లతో వ్యాపారం చాలా సున్నితం సుమా!

మిర్జా—చిత్తం! అల్లాగే! వెళ్లకేం! రెండెత్తుల్లో మీ ఆట కట్టు.

మీర్—అయ్యో! ఆ కబుర్ల కేంలెండి? ముందు మీ జంతువుల్ని కాసుకోండి, తర్వాత ఆటకడుదురుగాని.

మిర్జా—ఎందుకూ? ఇదిగో కట్టేసి వెడతాను.

మీర్—మీరు లోపలి కెళ్లిరండి. అంతవరకూ నే నాడను.

మిర్జా—వెడతానండీ. తలనొప్పికేమిటి పెద్ద మందు? నా ప్రాణం విసిగించడాని కేదో వంకగాని.

మీర్— అరే, ఏమనవే? ఆవిడసంగతి కనుక్కు తీరాలి.

మిర్జా—అల్లాగే! కానియ్యండి. ఈ ఎత్తెయ్యండి.

మీర్—వల్లకాదు. మీరు లోపలికెళ్లండి. ఆమె సంగతి కనుక్కొస్తేకాని నేను మొహరామీద చెయ్యి వెయ్యను.

మిర్జా సాహెబు విధిలేక లోపలి కెళ్లేడు. బేగంసాహెబా మొగం చిట్లించుకుంది. మూలుగుతూ "దిక్కుమాలిన చదరంగమంటే అంత వ్యసనం మీకు. ఇంట్లోవాళ్లు ఛస్తున్నాసరే ఆటలోంచి లేవాలనే బుద్ధి తోచనేతోచదు. మీలాంటివాళ్ళు ప్రపంచంలో ఎవరైనా ఉన్నారా అంట" అంది.

మిర్జా—ఏం చెప్పను? మీర్ సాహెబు ఎంత చెప్పినా వినడాయె. అతిప్రయత్నంమీద ఆయన్ని వదిలించుకొచ్చాను.

బేగం-అవును. ఆయనకేమీ పనీ పాటా లేదు. అంతా తనలాగే అనుకుంటాడు. ఆయనకుమాత్రం పిల్లాజల్లా లేరూ? వాళ్ల నేమైనా వదిలిపెట్టేడా?

మిర్జా—ఆయనకుమహావ్యసనం. ఆయనిక్కడి కొస్తే నేనూ విధిలేక ఆడవలసివస్తోంది.

బేగం—ఏం? ఆడనని మొహంమీద చెప్పెయ్యకూడదూ?

మిర్జా—సరిసరి! పెద్దమనిషి. అన్నివిధాలా. వయస్సులో, హోదాలో, అన్నింటిలోనూ నాకన్న ఎత్తె ఎక్కువవాడుకాని తక్కువవాడుకాదు.

బేగం—అయితే ఆయనకు తగిన శాస్తి చేసే చేస్తాను. కోపం వస్తే రానివ్వండి, ఎవరికిభయం? ఏం? మన్నేమైనా పెట్టిపోషిస్తున్నాడా? ఒసే దాసీ! సావట్లో చదరంగంపావు లిల్లా పట్టుకురా! మీర్‌సాహెబుతో అయ్య ఇంక ఆటకు రారనీ, తమరిని శలవుతీసుకోమన్నారనీ చెప్పు.

మిర్జా—ఏయ్, ఏయ్, వద్దుసుమా! అల్లాంటి పొరపాటు చెయ్యకుసుమీ. ఆయన్ని అవమానంగాని చేస్తావా ఏమిటి? దాసీ, ఆగు. ఎక్కడికి వెడుతున్నావు?

బేగం—ఏం? దాన్ని వెళ్లనియ్యరా ఏమిటి? మీరు దానికి అడ్డుకితే నన్ను చంపుకుతిన్నంత ఒట్టే ....అయినా, కానివ్వండి. దాన్ని అడ్డుకొట్టేరు కాని నా కడ్డురండి చూద్దాం.

ఇల్లా అంటూనే రివ్వుమని ఆగ్రహంతో బేగం సాహెబా సావట్లో కెళ్లింది. మిర్జా తెల్లమొగం వేశాడు. బీబీ కాళ్లా వేళ్లా పడ్డాడు. "ఇదిగో, నా మాట వినవూ! నువ్వక్కడి కెడితే హుస్సేన్‌మీద ఒట్టు. నా మీద ఒట్టు" అంటూ బ్రతిమాలేడు. కాని బేగం వినిపించుకోలేదు. సావడిగుమ్మందాకా చరచర వెళ్లింది. కాని సరాసరి పరాయిమొగవాడి ఎదుట పడడానికి కాస్త సంకోచించింది. సావట్లోకి తొంగి చూచింది. అదృష్టవశాత్తూ సావట్లో ఎవ్వరూ లేరు. మీర్‌సాహెబు పావులు అటూ ఇటూ పడేసి బయటికి వెంచేసి తన నిర్దోషిత్వాన్ని స్థిరపరచుకునేందుకా అన్నట్లు వీధిగుమ్మంలో పచారుచేస్తున్నాడు.

ఇంకేముంది? బేగం చెంగుమని సావట్లో కొచ్చింది. పావులు విరజిమ్మేసి నాలిగింటిని వీధిలో పారేసింది. లోపల్నుంచి గభాలున తలుపేసి గొళ్లెం వేసేసింది. మీర్‌సాహెబు వాకట్లో నుంచుని పావులు బయటపడడం చూచాడు. గాజుల గలగల విన్నాడు. సరే, బేగంసాహెబా అలిగిందని గ్రహించాడు. కిక్కురుమనకుండా ఇంటికి దారితీశాడు.

"చాలాతప్పుసుమా" అన్నాడు మిర్జా భార్యతో.

"తప్పా? ఈసారి ఇక్కడికి రానియ్యండి. చెప్తాను ఆయనపని. నిలబడ్డపాటుగా గెంటేస్తాను... ...మీరు చదురంగం ఆడుతూ కూచోండి; నేను ఇంట్లో పొయ్యిదగ్గర చాకిరీతో తలబ్రద్దలుకొట్టుకుంటూ ఉంటాను. ఏం? ఇప్పుడైనా వైద్యునిదగ్గరకి తీసుకెడ్తారా లేదా? ఇంకా తలనొప్పిబాధగానే ఉంది."

మిర్జా ఇంట్లోంచి బయలుదేరేడు. సరాసరి వైద్యునింటికి వెళ్లడానికి బదులు మీర్‌సాహెబింటికి వెళ్లేడు. జరిగిన యావత్తు కథా వినిపించేడు.

మీర్—పావు లెప్పుడు వీధిలో పడ్డాయో అప్పుడే గ్రహించాను. అందుచేతే వెంటనే పలాయనం చిత్తగించాను. చాలా కోపధారిలా కనుపిస్తుంది. అయితే మీరు ఆమెను నెత్తికెక్కించుకున్నారు. అది ఆట్టే మంచిది కాదు. బయట మీరేం చేస్తే ఆవిడ కెందుకూ? ఇంట్లో ఏర్పాట్లు చూడడం ఆమెపని. కాని మిగతావిషయాల్లో ఆమె కేమిసంబంధం?

మిర్జా—ఆగొడవల్లా వదిలెయ్యండి. ముందు కర్తవ్యం? మన సమావేశం ఎక్కడ?

మీర్—దానికేముంది బ్రహ్మాండం! ఇదిగో పెద్ద లోగిలి. సరే. ఇక్కడే వేద్దాం.

మిర్జా—కాని బేగంసాహెబాకు సమాధానం చెప్పడం కష్టమే! కొంపలో పడుంటేనే ఇంత జరిగిందే. ఇక ఇక్కడ మనం గ్రంథం సాగిస్తే బ్రతకనిస్తుందా?

మీర్—ఏమిటండీ మరీ! అరచుకోనియ్యండి. నాలుగురోజులు రుసరుసమంటుంది; అయిదోరోజున ఆమే సర్దుకుంటుంది. మీరుమాత్రం కాస్త విదానించండి. అంతే.

౨

మీర్‌సాహేబుబేగంకు సాహేబు కొంపకు దూరంగా ఉండడమే ఇష్టం. దాని కేవో కొన్ని కారణా లున్నాయి. అందుచేతనే ఆమె ఎప్పుడూ ఆయనచతురంగవ్యసనాన్ని గురించి అంత అడిగేది కాదు. ఇంటికి బాగా ఆలస్యంగా వచ్చినప్పుడు మాత్రం కాస్త పళ్ళపళ్ళగా అంటించేది. ఆకారణం చేత మీర్‌సాహేబు తన ఇల్లాలు మహా వినయశీల, గంభీర అనే భ్రమలో పడుండేవాడు. కాని రాత్రింబవళ్లూ సావళ్లో తివాచీ పరచి చతురంగం ప్రారంభించేసరికి బేగంసాహేబాకు కష్టం కలగడం ప్రారంభమైంది. ఆమెస్వేచ్ఛకు అడ్డంకలిగింది.

నౌఖర్లు చాకర్లుకూడా గుసగుసలాడడం ప్రారంభించారు. ఇంతవరకూ పనీ పాటా లేకుండా ఈగలు తోలుకుంటూ ఒకచోట పడుండేవాళ్ళు. కొంపలో కవరొచ్చినా ఎవరు వెళ్లినా వాళ్ల కేగొడవా పట్టేది కాదు. ఇప్పుడు ఎనిమిది ఝాములూ ఒకటే హైరానా. తాంబూలం తెమ్మని ఒకసారీ, మిఠాయి పట్టుకురమ్మని ఇంకోసారీ ఏదో ఎప్పుడూ ఒక్కటే పని. హుక్కా సంగతి చెప్పనక్కరేలేదు. ప్రేమ పీడితుల హృదయాల్లాగ రగుల్తూ ఉండాలసిందే. బేగం సాహేబాదగ్గర నౌఖర్లు గోలపెట్టడం ప్రారంభించారు:

“అమ్మగారూ! అయ్యగారి చతురంగం మా ప్రాణాల కొచ్చింది. పగలల్లా అటూ ఇటూ పరుగు లెత్తేసరికి మాకాళ్ళు బొబ్బలెక్కిపోతున్నాయి. ఒళ్లు హూనం అయిపోతోంది. ఇదేమి ఆటమ్మా! ప్రొద్దున్న కూచుంటే సాయంత్రమైనా కదలరాయె! ఏదో మనోల్లాసంకోసం రోజు కొగంటో అరగంటో ఎవరైనా ఏదైనా ఆడుకోవడం కద్దు కాని రాత్రింబగళ్లూ ఆడేఆట ఇదేమిటి? కానియ్యండి; మేము ఫిర్యాదుకోసం చెప్పడం లేదు. తమ నౌఖర్లం. తమ రేమి చెయ్యమంటే అది చేతులుకట్టుకుచేస్తాం. కాని ఈఆటమాత్రం కొంపకు ముప్పుతెస్తుంది. ఈ వ్యసనంలో పడ్డవాళ్లు అయిపూ మచ్చా లేకుండా పోతారు. ప్రమాదం తప్పదు. ఒకళ్లను చూచి ఒకళ్లు చివరకు పేటపేటంతా ఈ గుండంలో పడిపోతారు. ఏలినవారి ఉప్పు తింటున్నాం కనుక ఇంతవరకూ చెప్పుకోవలసి వచ్చింది. తమరి కీర్తికి కలిగే కళంకాన్ని విని మనస్సు పట్టలేకపోయాం. తర్వాత మీ ఇష్టం.”

“అవును, నేనూ చూస్తూనే ఉన్నాను. నాకూ ఇష్టంలేదు. కాని ఏమిటి చెయ్యడం? నేను కాదు ఎవరు చెప్పినా ఆయన వినడు.”

ఆపేటలో ఇద్దరుముగ్గురు పాతకాలపువాళ్లుండే వాళ్లు. వాళ్లు తమలో “ఇప్పుడేమీ లక్ష్యం ఉండదు. తర్వాత తెలుస్తుంది. మన ధనికుల అవస్థ ఇల్లా ఉంటే మన దేశాన్ని దేవుడు రక్షించాలి, అంతే. మన రాజ్యమే ఈ చతురంగానికి ఎప్పుడో బలిఅయిపోతుంది.” అనుకునేవాళ్లు.

రాజ్యంలో గగ్గోలు పుట్టింది. పట్టపగలు దోపిళ్లు ప్రారంభమైనాయి. ప్రజల గోడు ఆలించే దిక్కూ, పాలించే దిక్కూ లేదు. గ్రామాల్లోని సర్వ సంపత్తినీ లక్నోకు లాక్కురావడం, ఇక్కడ దాన్నంతా వేశ్యలకూ, త్రాగుడు మొదలైన వ్యసనాలకూ సమర్పించడం జరుగుతోంది. ఇంగ్లీషుకంపెనీ కివ్వవలసిన ఋణం రోజురోజూ పాపం పెరిగినట్లు పెరిగిపోతోంది. రాజరికం సరియైన బందోబస్తులో లేకపోవడంచేత పన్నులు బకాయీలుపడిపోయినాయి. కంపెనీతాలూకు రెసిడెంటు తరుచు మందలించడం ఆరంభించాడు. కాని విలాససాగరంలో మునగానాం తేలానాంగా ఉన్న లక్నోప్రజలకు చీమకుట్టడం లేదు.

మీర్‌సాహేబుసావళ్లో నెలలతరబడి చతురంగం సాగుతూనే ఉంది. కొత్తనడకలు, వింతఎత్తులు, చిత్రమైన మొహరింపులు, అభేద్యమైన వ్యూహాలు వీటిలో నిపుణులైనారు స్నేహితు లిద్దరూను. అప్పుడప్పుడు ఆటమధ్య మాటా మాటా వచ్చి పొరుపొలు పొరుపొలు ప్రజ్వరిల్లి చివరికి ఛీ అంటే ఛీ, తూ అంటే తూ అనుకోవడందాకా వస్తూఉండేది. కాని

వెంటనే రాజీపడిపోయి సర్దుకునేవారు. ఒక్కొక్కప్పుడు బలం విరజిమ్మేసి లేచిపోవడంకూడా తటస్థించేది. కాని నిద్రతో ఆ మాలిన్యాన్ని మరచిపోతూ ఉండేవారు. తెల్లవారడంతోటే మళ్లీ మీర్ సాహేబు సావట్లో మిత్రు లిద్దరూ చతురంగసమ్మోహంలో పడుండేవాళ్లు.

ఒకనాడు స్నేహితులిద్దరూ మాంచి ఎత్తులో నిమగ్నులై ఉండగా, పాదుషా సైనికోద్యోగి గుర్రం మీదనుంచి గుమ్మంలో దిగేడు. దిగుతూనే "మీర్ సాహేబుగా రున్నారా?" అని అడిగేడు. సాహేబుకు ప్రాణాలు ఎగిరిపోయాయి. ఏమికొంపమునకొచ్చిందో అని కంగారుపడడం మొదలెట్టేడు. ఎన్ని విధాల ఆలోచించినా కారణం అనలేదు. తలుపు గడియవేసుంది. నౌకరుతో "ఇంట్లో లేడని చెప్పు" అని చెప్పాడు.

సిపా—ఇంట్లో లేకపోతే ఎక్కడున్నారు?

నౌ—ఆసంగతి నాకు తెలియదు. అయినా తమరొచ్చిన పని శెలవిస్తారా?

సిపా—పని నీకు చెప్పేదేమిటి? మీర్ సాహేబును నిలుచున్నపళంగా తీసుకురమ్మని పాదుషావారి ఆజ్ఞ. సైన్యంలోకి మనుష్యుల్ని చేర్పించాలి. జాగీర్దారంటే వేళాకోళమా? యుద్ధంలో ముందుకు దూకాలి. అప్పుడు తెలుస్తుంది అయ్యగారి పస.

నౌ—చిత్తం. తమరు దయచెయ్యండి. అయ్యగారితో మనవిచేస్తాను.

సిపా—మనవిచేయడాని కేమీ లేదు. రేపు నేను మళ్లీ వస్తాను. ఖుద్దున తీసుకురమ్మని పాదుషావారి హుకుం.

సిపాయి వెళ్లిపోయినాడు. మీర్ సాహేబు గుండెల్లో దడదడ ప్రారంభమైంది. "ఏమిటి కర్తవ్యం" అన్నాడు మిర్జాతో.

మిర్జా—నాకూకూడా పిలుపొచ్చిందా కొంప మునిగిందన్నమాటే.

మీర్—దౌర్భాగ్యం! మళ్లీ రేపు వస్తానంటూ పోయ్యాడే వీడు?

మిర్జా—ముప్పే. సందేహ మేమిటి?...యుద్ధంలోకి దూకాలసొస్తే చచ్చే చావే!

మీర్—ఉందిలే దీనికీ ఒక యుక్తి. ఇంట్లో మనం దొరికితేకదా వాడు తీసుకెళ్లడం? రేపటినుంచి గోమతిఒడ్డున పాడుకొంపల్లో ఒకదానిలో చీడీ పరుద్దాం. అక్కడికి ఎవ్వరికీ కబురూ అందదు. సిపాయి వస్తాడు; వెడతాడు. అంతే.

మిర్జా—బలే బాగా తోచింది ఊహ. అదే యుక్తి. మరొకటి కనుపించడం లేదు.

ఆ వచ్చిన రాతుతో మీర్ సాహేబు బేగం "బాగా దొడ్డెత్తించావుకాదూ" అంది.

"ఆహా! ఇల్లాంటి మూర్ఖులను నూరుమందిని చిటికెనవ్రేలిమీద ఆడించగలను. వీళ్ల తెలివితేటలు, ధైర్యం చతురంగంలో ఉపయోగపడుతున్నాయి. ఇక పొరపాటునకూడా కొంపలో ఉండరు" అంటూ వెళ్లిపోయాడు సిపాయి.

3

మర్నాడు భాయీ లిద్దరూ మొంగాలు దిగాలేసుకుని గుమ్మంలో నిలబడ్డారు. ఒక చిన్న కంబళీ చంకపెట్టుకున్నారు. పాన్‌దాన్ చేత్తో పుచ్చుకొని గోమతి ఒడ్డున పాడడిన మసీదుకు ప్రయాణమైనారు. దారిలో పొగాకు, గంజాయి వగైరాలు సమకూర్చుకుని మసీదుకు చేరుకున్నారు. కంబళీ పరచి చతురంగాని కుపక్రమించారు. అంతే. ఇక వాళ్లకూ, బయటి ప్రపంచానికీ సంబంధమే లేదు. రాజు, త్రోసి రాజు, కట్టు మొదలైన వేవో రెండుమూడు మాటలు తప్ప మాటగొడవే లేదు. యోగీశ్వరేశ్వరులు సమాధిలోనైనా ఇంత ఏకాగ్రంగా ఉండలేరు. రెండుఝాములు తిరిగి కొస్త ఆకలైతే దగ్గరలో ఉన్న ముసలమ్మ రొట్టెల దుకాణంలో కొస్త మంచిమాట చేసుకుని తిరిగి యుద్ధరంగంలో పడేవాళ్లు. తరుచు ఆ భోజనం ధ్యాసకూడా ఉండేదికాదు.

దేశంలోని రాజకీయ వ్యవహారాలు భయంకరావస్థలో పడిపోతున్నాయి. నగరంలో గలభా హెచ్చయిపోయింది. కంపెనీసేనలు లక్నోమీదికి చొచ్చుకొస్తున్నాయి. పిల్లా మేకలతో సహా జనం గ్రామాలకు పారిపోతున్నారు. కాని మన చతురంగ రాఘుల కిద్దరకూ చీమ చిటుకవడం లేదు. ఇంట్లోంచి వచ్చేటప్పుడు పాదుషాతాలూకు ఉద్యోగస్థులకంటబడకుండా దొంగల్లాగ సందుల్లో గొందుల్లో పడి మెల్లగా మసీదు చేరుకునేవాళ్లు. సాలుకు వేలకొద్దీ ఆదాయాన్ని యిచ్చే జాగీర్లను ఊరికే కూచుని జీర్ణం చేసుకోవాలని వాళ్ల సంకల్పం.

ఒక్కరోజున ఆ పాడుమసీదులో కూచుని చతురంగం ఆడుతున్నారు మిత్రులు. మిర్జాఆట కొంచెం లేతుగా ఉంది. మీర్‌సాహెబు రాజుమీద రాజు చెపుతూ డీకొస్తున్నాడు. ఇంతలో కంపెనీ సేనలు లక్నోమీద కొస్తున్నాయి.

మీర్—అరె బాబా! ఇంగ్లీషుసేన లొచ్చిపడుతున్నారే!

మిర్జా—రానియ్యండి! రాజుని తప్పుకోండి ముందు. ఇదిగో రాజు.

మీర్—కొంచెం ఉండవయ్యా! ఇదిగో ఈమూల కొచ్చేయి సేనలు.

మిర్జా—తొందరేముంది! ఇదిగో షాహ్!

మీర్—ఫిరంగులుకూడా ఉన్నారే. ఎంత లేదన్నా అయిదు వేలమంది ఉంటారు. మంచి జవానులే. మనుష్యుల వైఖరి చూస్తేనే హడలెత్తుతోంది.

మిర్జా—ఈ వంకల కేమిలెండి! ఈ డొంక తిరుగుడు కబుర్లు మరెవరితోనైనా చెప్పండి. ఇదిగో రాజు.

మీర్—మీరు చాలా చిత్రమైన మనుష్యులండీ! అక్కడేమో పట్టణంమీద ముప్పొచ్చిపడుతోంది. ఇక్కడ మీకు రాజుతప్ప మరోగొడవ లేదు ...కొంచెం ఈ సంగతికూడా ఆలోచించండి. నగరం ముట్టడైపోతే కొంపకు చేరుకోవడ మెల్లాగ?

మిర్జా—ఇంటి కెళ్లే వేళ కానియ్యండి. ఆలోచిద్దాం. ఇది రాజు! దెబ్బతో ఆట కట్టు.

సైన్యం పదిగంట లయ్యేసరికి వెళ్లిపోయింది. మన మిత్రులు కొత్తఎత్తు ప్రారంభించారు.

మిర్జా—ఇవ్వేళ భోజనం ఎల్లాగు?

మీర్—ఉపవాసమే. మీ కేమైనా ఆకలిగా ఉందా?

మిర్జా—అది కాదు. ఊళ్లో ఏమవుతుందో మరి.

మీర్—ఊళ్లో ఏమవుతుంది? ఏమీ కాదు. అంతా భోజనం చేసి విశ్రాంతిగా మంచాలమీద దొర్లుతుంటారు. నవాబుగారు కేళీమందిరంలో ఉండి ఉంటారు.

చతురంగం ఎత్తుమీద ఎత్తేసేసరికి మూడుగంటలయింది. మిర్జాజీఆట నీరసంలో పడిపోయింది. నాలుగుగంటలు కొడుతుండేటప్పటికి ఇంగ్లీషుసేనలు తిరిగొచ్చేస్తున్నాయి. అదే కోలాహలం వినిపించింది. వజీదాలీషా పట్టుబడ్డాడు. కంపెనీసేన లాయన్ని ఎక్కడకో తీసుకుపోతున్నారు. నగరంలో ఏవిధమైన ఆందోళనా, పోరాటం కనబడడం లేదు. ఒక్క రక్తపుచుక్క నేలబడలేదు. ఇంతవరకూ ఏ స్వతంత్రరాజుయొక్క పతనంకూడా ఇంత రక్తపాతరహితంగా జరిగిఉండలేదు. ఇందుకు కారణం ముక్కోటిదేవతలూ హర్షించే అహింసాదీక్ష కాదు. కేవలంపిరికితనం. కత్తిలేని పిరికితనం. అయోధ్యవంటి విశాలదేశానికి నవాబుగానున్నవాడిని ఖైదుచేసి పట్టుకుపోతుంటే 'కిం'అనేవాడు లేడు. లక్నో సుఖంగా భోగనిద్రలో పడుంది. రాజకీయపతనానికి ఇంతకన్న అధోగతి ఉండదు.

మిర్జా—ఏమండోయి, నవాబుగారిని శత్రువులు ఖైదీగా పట్టుకుపోతున్నారు.

మీర్—పట్టుకెళ్లనివ్వండి...ఇదిగో రాజు.

మిర్జా—ఏమిటండీ! కొంచెం నిదానించండి. మన స్సిక్కడ నిలువడం లేదు. పాపం! నవాబు గొల్లున గోలపెట్టి ఉంటాడు.

మీర్—ఏడ్చేవుండాలి! ఈ భోగం అక్కడెక్కడనుంచి వస్తుంది?......ఇదిగో రాజు.

మిర్జా—ఎవడికీ రోజులన్నీ ఒక్కగతిగా వెళ్లవు కదా!......దిక్కుమాలిన జీవితం.

మీర్—అంతే. అవును...ఈసారి కాసుకోండి రాజు! ఇంకో ఎత్తులో ఆటకట్టు.

మిర్జా—ఓయి నీరాజు దొంగలుదోలా! నీవెంత కఠినుడవయ్యా! అలాంటి ఘోరం చూస్తుంటే దుఃఖం రావడం లేదూ? అయ్యో! పాపం! వజీదాలీ!

మీర్—అయ్యా! ముందు మీ పాదుషాను రక్షించుకోండి, తర్వాత అపాదుషాగతి ఆలోచిద్దురుగాని... ఇదిగో రాజు...ఆటకట్టు.

నవాబును పట్టుకుని సేన కళ్లముందరనుంచి వెళ్లిపోయింది. మిర్జా మళ్లీ బలం అమర్చేడు. ఓటమి మనస్సును కుమిలించేస్తోంది.

"సరే రండి. నవాబుపరాజయానికి ఒక్క ఏడుపు ఏడ్చేశాంగా?" అనేశాడు. మిర్జా రాజభక్తి తన పరాజయంలో లీనమైపోయింది. తన ఓటమికి ప్రతీకారం చేయాలనే దృఢసంకల్పంలో పడ్డాడు.

౪

సాయంకాలమైంది. ఆ పాడుగడ్డల్లో పక్షులు కూయడం ఆరంభించాయి. గబ్బిలాలు తమతమ గూళ్లల్లో చేరుకుంటున్నాయి. ఇద్దరు చతురంగ యోధులున్నా అతిపట్టుదలతో ఆడుతున్నారు. ఒకళ్ల రక్తం ఒకళ్లు త్రాగడానికి సిద్ధంగా ఉన్నారా అనేటంత పట్టుదలగా కూచున్నారు. మిర్జాజీ వరుసగా మూడాటలు ఓడిపోయాడు. నాల్గవ ఎత్తువైఖరికూడా బాగా లేదు. అనేకసార్లు నిలద్రొక్కుకుని తప్పకుండా గెలిచితీరాలనే దీక్షతో ఆడుతున్నాడు. కాని ప్రతిసారీ ఏదో విఘాతం వచ్చిపడుతోంది. ఆటబిగి తప్పిపోతోంది. ఓడిపోయినప్పుడల్లా కసితీర్చుకోవాలనే అభిలాషకూడా ఎక్కువైపోతోంది. మీర్సాహేబు విజయగర్వంతో కూనిరాగాలు తీస్తున్నాడు. మహాభాగ్యం సిద్ధించినట్లు సంతోషిస్తూ చిటికెలేస్తున్నాడు. ఆ చిటికెలు వింటూంటే మిర్జాఒళ్లు మండిపోతోంది. పరాజయంవల్ల కలుగుతుండే దురభిమానాన్ని కనిపించకుండా చెయ్యడానికి ఎన్నివిధాల ప్రయత్నం చెయ్యాలో అన్నివిధాలా చేశాడు. కాని బాజీబలం తగ్గినకొద్దీ ధైర్యం సడలిపోతూవచ్చింది. చివరికి మాటా మాటాకాకా వచ్చింది.

"ఏమండోయి. వేసినెత్తు తియ్యకండి మరి... మొదట్లో ఎత్తు వేశారు. మళ్లీ తీసుకుంటారేం? వెయ్యదలచుకున్న ఎత్తొక్కసారే వేసెయ్యండి...... జంతువుమీద చెయ్యలా పెట్టుకునికూర్చుంటే ఏమిటర్థం? మొహరామీద చెయి తియ్యండి. ఎత్తు తోచకపోతే తోచినతర్వాతే మొహరామీద చెయ్యి వెయ్యండి. ఒక్కొక్కఎత్తేసేసరికి అరగంట అవుతోంది. అది ఆటసబబుకాదు. ఎత్తు కయిదునిముషాలకన్న ఎక్కువయితే ఓడిపోయినట్లే......మళ్లీ ఎత్తు మారుస్తున్నారు. ముందా జంతువు నక్కడ పెట్టండి."

మీర్సాహేబుమంత్రి పోతోంది...... "నేనింకా ఎత్తువెయ్యందే" అన్నాడు.

మిర్జా—అబ్బే...! ఎత్తు వేసేశారు. ముందు జంతువు నక్కడ పెట్టండి...ఆ ఇంట్లోనే...

మీర్—ఆ ఇంట్లో ఎందుకు పెట్టాలి? జంతువుమీద చెయ్యి నేను తియ్యందే?

మిర్జా—చెయ్యి మీరు ఎప్పుడూ తియ్యరు. ఎంత ప్రళయం వచ్చినాసరే. ఇక ఆట సాగేదేమిటి? మంత్రి పోతోంది. అందుచేత ఈమోసం చేస్తున్నారు.

మీర్—ఏమండోయి, మాటలు సరిగా రానియ్యండి. మోసం మీది. జయాపజయాలు దైవాధీనం అన్నారు. మోసంవల్ల ఎవరూ గెలవరు.

మిర్జా—అయితే ఈ ఆట మీరోడిపోయినట్లే.

మీర్—నేనెందు కోడిపోయాను?

మిర్జా—అయితే మీరు జంతువును ఏ యింట్లోంచి తీశారో ఆయింట్లో పెట్టండి.

మీర్—అక్కడెందుకు పెట్టాలి? పెట్టను.

మిర్జా—ఎందుకు పెట్టరు? పెట్టితీరాలి.

తగాదా పెరిగిపోయింది. ఎవరి పట్టు వారిదే. ఉభయులూ దిగలేదు. అప్రస్తుత ప్రసంగాలు ఆరంభమైనాయి.

మిర్జా—ఎవడికైనా పెద్ద లెప్పైనా చతురంగం మొహం ఎరిగుంటే ఆటసాంప్రదాయాలు తెలుస్తాయి. గడ్డికోసుకు బ్రతికినవాళ్లు చతురంగం మొహమే మెరుగుదురు? జమీందార్లైతేనేమి? జాగీరుంటేనేమి? ఖామేందా ఎక్కడనుంచి వస్తుంది?

మీర్—ఏమిటీ? మీ బాబు గడ్డికోసుకు బ్రతికేడేమో? మా ఇంట్లో తరతరాలుగా ఆడుతున్నాం చతురంగం.

మిర్జా—వెళ్లవయ్యా! చెప్పేవు కబుర్లు. గాజీయుద్దీన్ హైదర్ దగ్గర వంటచేసుకుని కాలక్షేపం చేశారు. ఇప్పుడు పెద్ద జమీందారులైపోయారు. జమీందారు లవడం అంటే అల్లాటప్పావ్యవహారం కాదు.

మీర్—ఎందుకు మీ పెద్దల ముఖాని కల్లా మసిపూసుకుంటారు. మీవాళ్లు వంటలు చేసేరేమో కాని మావాళ్లెప్పుడూ పాదుషాసహపంక్తిని భోజనం చేస్తూనేవచ్చారు.

మిర్జా—వెళ్లవయ్యా, అట్టే సారకాయలు కోయకు. గొప్పకబుర్లు చెపుతున్నావే!

మీర్—కాస్త నోరు సంబాళించుకోండి. మాటలు జాగ్రత్తగా రానివ్వండి. లేకపోతే బాగా జరుగదు. గ్రుడ్లురచేస్తే గ్రుడ్లు తోడేస్తాను! నామర్దా మాటలు సహించలేను. ఎవరైనా సరే. నాలుక తోడేస్తాను ......ఏమనుకున్నావో తడాఖా!

మిర్జా—నా తడాఖా చూస్తారా ఏమిటి? అయితే రండి. అయినా పైసా తేలిపోవాలి.

మీర్—ఈకబుర్లకు జాలైపోయేవాళ్లెవ్వరూ లేరు ఇక్కడ.


స్నేహితు లిద్దరూ కత్తులు తీశారు. అది నవాబుల కాలం. తల్వార్లు, పేష్‌కబ్జు, కటార్లూ మనుష్యుల వంటిమీద ఉండేవి. ఇద్దరూ అవడానికి భోగపరాయణులేకాని పిరికివాళ్లుమాత్రం కారు. పాదుషాకోసం చావడ మెందుకనుకున్నారుకాని తమ వ్యక్తిపౌరుషాన్ని ప్రదర్శించడానికి మాత్రం సంకోచించలేదు. ఇద్దరూ కత్తులు దూసి ఒకళ్లమీద ఒకళ్లు దూకేరు. కత్తులు ఝుణఝుణలాడేయి. 'టపో'మని శబ్దం అయింది. ఇద్దరూ వ్రేట్లు తిని క్రింద పడ్డారు. గిలగిల కొట్టుకుని ప్రాణాలు వదిలేరు.

పాదుషా ప్రాణాలు పోతుంటే ఇద్దరి కళ్ల నుంచీ ఒక్క కన్నీటిబిందువైనా రాలలేదు. కాని చతురంగంలో మంత్రిప్రాణంకోసం తమ ప్రాణాలను అర్పించేశారు!

చీకటి కమ్ముకుపోయింది. చతురంగంపావులు అమర్చిన వమర్చినట్లుగానే ఉన్నాయి. ఈ వీరుల కోసం ఏడుస్తున్నారా అన్నట్లు చతురంగంలోని రాజులు తమ తమ సింహాసనాలమీద కూచునే ఉన్నాయి.

అంతా నిశ్శబ్దమైపోయింది. ఆ శిథిలాల్లో పడిపోయిన గోడలు, విరిగిన బురుజులు, కూలిపోయిన లాజులు ఆ శవాలను చూస్తూ తలలు వంచుకున్నాయి.

('ప్రేమచందు' నుండి)




కలగూరగంప

మహాత్మునితో ఒకరోజు

ఇప్పుడు మన మహాత్ముడు ౭౮ ఏళ్ల వృద్ధు. అయినప్పటికీ ౭౮ ఏళ్ల వృద్ధుకి మించిన పనిచేస్తాడు, ఒక్కరోజైనా తప్పకుండా. అతని ఆరోగ్యానికి మాత్రం సామాన్యంగా భంగంకలగదు. అందులో వున్న రహస్య మేమిటంటే, తను చేసిన పని పద్ధతి తప్పకుండా సక్రమంగా చేసుకునిపోతాడు రోజూ. ఆరోజు పూర్తిఅయేసరికి చేయవలసిన పనికూడ గమ్మత్తుగా పూర్తయిపోతుంది. మహాత్ముడు చేయవలసిన పనులన్నీ సరిగ్గా క్రమపద్ధతిలో జరిగేటట్టు వెయ్యికళ్లతో చూసే వాచీ ఒకటి మహాత్ముకిదగ్గరుంది. అదెప్పుడూ మహాత్ముడి దగ్గరే వుంటుంది.

ఒకసారి ప్రఖ్యాత అమెరికా జర్నలిస్టు లూయీఫిషర్ మహాత్ముణ్ణి చూడడానికి వచ్చాడు. తనతో అతను మాటాడ్డానికి ఒక గంటకాలం నిర్ణయించాడు మహాత్ముడు. సరిగ్గా ఆనిర్ణయించిన గంట దాటిపోగానే ఫిషర్‌కి తన వాచీ చూపేడు. "నా జీవితంలో ఇంతవరకూ, ఒక్క సేవాగ్రాంలోతప్పితే ఇంకెక్కడా నాకు వాచీ అలా చూపించలేదని తన పుస్తకంలో రాసుకున్నాడు లూయీఫిషర్ తర్వాత.



"ప్రఖ్యాత అమెరికా జర్నలిస్టు లూయీఫిషర్ మహాత్ముణ్ణి చూడడానికి వచ్చాడు."

'ఏకొచ్చినా మన మేలుకొరకే' అన్న తత్వం మహాత్ముడిది. ఎన్ని అడ్డు వచ్చినా మనసులో వున్న కోరిక పూర్తిగా నెరవేరే వరకు వూరుకునే రకం కాదు. ఇంకా ఒక అర్ధ శతాబ్దంవరకూ తన దగ్గరికి మృత్యువు సమీపించలేదని ఎన్నిసార్లు మహాత్ముడు స్పష్టంగా అనలేదు? మహాత్ముడు మానవాతీతుడు.

మహాత్ముడు మంచి చమత్కారికూడ. ఒక నాడు ఒక కొంటెవిలేఖరి, "మీలో ఏకోశాన్నైనా హాస్యరసం వుందా?" అని మోటుగా ప్రశ్నించేసరికి, "నాలోనే హాస్యరసం

లేకపోతే నీలాంటి కోపిష్ఠి మనుషులతో ఇన్నాళ్లూ ఎలా నెగ్గుకొనివచ్చావనుకున్నావు ?” అని చమత్కారంగా తిరుగు ప్రశ్న వేశాడు.

మహాత్ము డెప్పుడూ వెచ్చటి నీటిలో స్నానం చేస్తాడు. సబ్బు అవసరమే లేదు. నిమ్మరసం, నూనె కలిపి బాగా శరీరానికి మొదట రాసుకుంటాడు. తర్వాత స్నానం చేస్తున్నప్పుడు మరోమాటు ఒక ముతకగుడ్డతో శరీరాన్ని రుద్దుకుంటాడు. అంతే! స్నానం అయేసరికి శరీరం పరిశుభ్రంగా వుంటుంది.

గడ్డం తానే సేఫ్టీ రేజర్‌తో గీసుకుంటాడు, అద్దం అవసరం లేకుండానే. అందుకే అప్పుడప్పుడూ అక్కడక్కడా కొన్ని వెంట్రుకసమూహాలు మృత్యువువాతపడకుండా తప్పించుకుంటుంటాయి మళ్లీ వచ్చే క్షవరంవరకు. ఆశ్రమవాసులలో ఒకరు తలని క్షవరం చేస్తారు.

మహాత్ముడు రోజూ చేసే పనులలో ముఖ్యమైనవి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం; దేశదేశాల్నుంచి అనేకమంది వస్తూంటారు దర్శనానికి—వారికి తగిన సలహాల నివ్వడం, వార్తాపత్రికలు చదవగా వినడం. వచ్చిన జాబులకి జవాబులు చాలామటుకు మహాత్ముడి కార్యదర్శిగారే రాస్తారు. ముఖ్యమైనవిమాత్రం మహాత్ముడు విని వాటికి ఏ విధంగా జవాబులు రాయాలో చెప్తూంటాడు. తోటి స్నేహితులకి, తనకి తెలిసిన రోగిష్ఠులకి తనే స్వంతంగా అప్పుడప్పుడూ జాబులు రాస్తూంటాడు. చాలామటుకు హిందీలోనే రాస్తాడు. అవతలవారికి గుజరాతీ వస్తే గుజరాతీలో రాస్తాడు. అత్యంత అవసరం వస్తేనే తప్ప ఇంగ్లీషులో రాయడు. అతనికి రోజూ రకరకాలైన వుత్తరాలు ప్రపంచపు మూలమూలలనుంచి వస్తూంటాయి.



“ప్రార్థనలుజరిగాక మహాత్ముడు సంతకం అయిదురూపాయిలచొప్పున కొన్నిసంతకాలుచేస్తాడు.”

ఆ వుత్తరాలతోపాటు పుస్తకాలు కూడ వస్తూంటాయి. అభిమానంవాళ్ల ఒకప్పుడు, అభిప్రాయంకోసం ఒకప్పుడు ఆ గ్రంథకర్తలు తమ పుస్తకాలని మహాత్మునికి పంపుతూంటారు.

ఎంతో ఎక్కువ జబ్బు చేస్తేనే తప్ప ప్రాతఃకాల సంధ్యనడకలు మానడు. మహాత్ముడు నడకకి వెళ్లేటప్పుడు ఒకరిద్దరు ఆశ్రమవాసులు వెంట వుంటారు. మహాత్ముణ్ణి కుటీరంలో వుండగా దర్శించే భాగ్యం చాలామందికి కలగదు. అందుకని అతను నడకకని వెళ్లేటప్పుడు కళ్లారా చూడ్డానికి ఇంతకన్నా మంచి సమయం దొరకదని చాలామంది ఆయనతో నడకకి వెళ్తారు.

ప్రార్థనాసమయం ఎప్పుడొస్తుందా అని చాలామంది ఆతృతగా ఎదురుచూస్తూంటారు. ఆసమయంలో మహాత్ముని దర్శనమే కాకుండా “మహాత్మాగాంధీ

"గారితో సమంగా ప్రార్థనచేసే గొప్ప అవకాశం" కలుగుతుందని చాలామంది ప్రార్థనకి రోజూ వస్తుంటారు.

ప్రార్థనలు జరిగాక మహాత్ముడు సంతకం అయిదురూపాయలచొప్పున కొన్ని సంతకాలు చేస్తాడు. తమ పుస్తకాలమీద మహాత్ముని సంతకం చూసి మురిసేవా రెందరో వుంటారు. సంతకాలవల్ల వసూలైన సొమ్ము 'హరిజననిధి'కి వెళ్తుంది. పధ్నాలుగు భాషలలో చక్కగా సంతకం చేయగలడు మహాత్ముడు.

ఒక బల్ల, దానిమీద ఒక సన్నని చాప-వీటి మీద మహాత్ముడు హాయిగా నిద్రపోతాడు. ఇంతకు పూర్వం ఇదికాక మూడుదిండ్లుకూడ వుపయోగించే వాడు. కాని అవి యిప్పుడు లేవు. కోరి తీసేశాడు. వైద్యసలహా ననుసరించి రాత్రి ఎనిమిదిగంటలకాలం నిద్రపోతాడు. ఒక అరగంటనుంచి గంటవరకు పగటి వేళ విశ్రాంతి తీసుకుంటాడు. పూర్వం ఇరవై నాలుగుగంటలలో ఒక్క ఆరుగంటలకాలం మాత్రం విశ్రాంతి తీసుకునేవాడు.

మహాత్మునికి పళ్లు లేవు. పోయినాయి. తినే టప్పుడు కృత్రిమదంతాలతో తింటాడు. మితంగాను, అతిజాగ్రత్తగాను వుంటాడు ఆహారవిషయంలో. తెల్ల వారుఝాము నడకకి పోయేముందు ౧౬ అవున్సుల బత్తా నారింజరసం, ఒక టీచెమ్చాడుఅమ్లామురబ్బా, ఒక అవున్సు బెల్లం తీసుకుంటాడు రోజూ. అతను చేసే భోజనంలో ఆరునుంచి ఎనిమిది అవున్సుల వుడికిన కూరలు, రెండవున్సుల పచ్చికూరలు ముఖ్యంగా వుంటాయి. ఉప్పు నిషేధం. ఇది కాక గోధుమనూక, మేకపాలతో ప్రత్యేకంగా తయారు చేసిన రొట్టె ఒకటి రెండవున్సులది తింటాడు. కొన్నేళ్ల కిందట జంతుసంబంధమైన ఆహారాన్ని ముట్టుకోనని ఒక నియమం పెట్టుకున్నాడు గాని అతని అనారోగ్య కారణంగా మేకపాలు తీసుకోక తప్పిందికాదు.

ఆశ్రమవాసులు మాత్రం గోధుమ, బియ్యం' ఉప్పు, ఉల్లిపాయలతో సహా కూరలు తింటారు.

మహాత్ముడు జీతం యిచ్చి నౌకర్లని పెట్టుకో లేదు. అతనికి అనవసరం. అక్కర్లేదు కూడ. తాను స్వయంగా చేసుకోలేని పనులు ఆశ్రమవాసులే అతి సంతోషంగా చేస్తారు. పెద్దమనుషులు, పత్రికా విలేకర్ల రాకపోకల విషయం శ్రీ ప్యారీలాల్ గారు స్వయంగా చూసుకుంటారు. శ్రీ కానూగాంధీగారు మహాత్ముణ్ణి వెయ్యికళ్ల చూస్తూంటారు. పైగా ప్రార్థన విషయంలో చాలాసహాయం చేస్తారు. శ్రీమతి డాక్టర్ సుశీలానాయర్ మహాత్ముని ఆరోగ్య విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుంది. ఆమె సేవాగ్రామంలో ఒక చిన్నవైద్యశాల నడుపుతూంది.

"మహాత్మునికి వైద్యం చేయడం చాలా కష్టమైన పని. ఇష్టంవుంటే వైద్యసలహాలని తు. చ. తప్పకుండా పాటిస్తాడు. గాని ఆ 'ఇష్టం వుండడం' అనేది చాలా అరుదు" అని ఆమె చెప్తూంటుంది.

ఈవిధంగా మహాత్ముడు ఎక్కడుంటే అక్కడ నిత్యం విధిగా జరుగుతూంటుంది. ["హిందూస్థాన్ స్టాండర్డు" చదివి]

జి. వి. యల్. యన్. స్వామి.



విమర్శనము

శ్రీ వ్యాస-పాణినిభావనిర్ణయః

కర్త: మహామహోపాధ్యాయ, వ్యాకరణం, శ్రీసుష్ఠం పేశు మాధవాచార్యులుగారు. ప్రకాశకులు: ఆర్. రామమూర్తిశర్మగారు, ఎస్. వి. ఎస్. కాలేజి, తిరుపతి. డెమ్మి ౮ + ౨౦ + ౨౦౮ పుటలు (దేవనాగిరి) వెల రు 3 లు.

వ్యాసుడే మహాభారతమున వేదాంతసూత్రములను విరచించెనో చెప్పజాలముగాని, ఈ గ్రంథమున కున్న భాష్యములు మరేసూత్రగ్రంథమునకును లేవు. భారతదేశమునందలి ప్రతిమతమువారును వ్యాసుడు తమ మతస్థుడే యని నిరూపింప శ్రమపడిరి; శ్రమపడుచున్నారు కూడ.

ద్వైతాద్వైతవిశిష్టాద్వైత సిద్ధాంతపరములగు భాష్యగ్రంథములను విడచినను, వ్యాసుడు తమ మతమునకు చెందినవాడే యని నిరూపింప ఆయామతములవారు రచించిన గ్రంథములు కొల్లలుగ నున్నవి. ఇటీవలనే కాశీనుండి శ్రీ చిద్ఘనానందపురిస్వామివారు విరచించిన 'బాదరాయణవ్యాస సమ్మత బ్రహ్మసూత్రభాష్య నిర్ణయః' అను అద్వైతమతపరమగు రచన ప్రకాశితమైనది. దానికి ప్రతియో యనునట్లు ప్రస్తుతము తిరుపతినుండి ఈ గ్రంథము వెలువడినది.

రచయితయొక్క తండ్రి మహామహోపాధ్యాయులు; రచయితకూడ మహామహోపాధ్యాయులే యగుట గమనింపదగు విషయము. అత్యంతము సుబోధమగు భాషలో పాణినిసూత్రములయందు అచ్చటచ్చట గానవచ్చు అంశములను పరిగ్రహించియు, సుతదళాలములను వ్యాససూత్రాంశములను పరిగ్రహించియు ద్వైతమతమే సమంజసమని నిరూపింప ప్రయత్నించిరి. ఇందు మహామహోపాధ్యాయులు ప్రదర్శించిన ధీశక్తియును, అవలంబించిన ప్రణాళికయును ఆశ్చర్యమును కలిగించుచు శ్రీవారి మేధాసంపత్తిని ప్రకటించుచున్నవి. ప్రతిప్రకరణాంతమున, ఆయాప్రకరణముల సారాంశమును దెల్పెడు సంగ్రహశ్లోకము లున్నవి.

ఈ గ్రంథమును ద్వైతలోకము పూజ్యముగ భావించి సమాదరించు ననుటకు సందేహము లేదు. ఇప్పటికిని సంస్కృతమున చక్కని వచనగ్రంథములను—దేశభాషలలో వ్రాయునట్లే—విరచింపగల్గు శక్తి గల పండితు లుండుట మన యదృష్టము. ద్వైతేతరులుగూడ ఈ గ్రంథమును పఠించి శ్రీ సేశు మాధవాచార్యులవారి పరిశ్రమను సార్థకమొనర్తురుగాక!

కాని, గ్రంథముయొక్క ఆద్యంతములయం దుండిన సీటను అచ్చు గ్రంథముయొక్క మధ్యభాగమున చెడిపోయినది. ఇది పఠితలకు శ్రమదాయకముగ నుండునేమో యని భయపడుచున్నాము.

శ్రీ నిర్వికల్పానందస్వామి.

పరివర్తనం

రచయిత: గోపీచంద్ గారు. ధర రూపాయి. ప్రతులకు జాకోబిన్ పబ్లిషర్స్-తెనాలికి వ్రాయాలి.

రాజారావు అనే అతను పక్కా సౌందర్య పిపాసి. అతని ఊహాలూ, చేష్టలూకూడా సున్నితమైనవి. భావసాజగత్తులోనే సదా నివసించేవాడు. ధనవంతుడు. వ్యక్తిత్వం కలవాడు. వ్యక్తిత్వవాదికూడా నేమో. తోటలో ఉంటాడు. అతనికి భార్య పోయింది. ఆ పోయిన భార్యను ఆరాధించటంలో నేలవిడిచిన సాములాగవుతూంది అతని జీవితం. అతని లోకంలోనే అతను ఉండి, తదితరులకు అతను చిత్రమైన వ్యథను కలిగించుతాడు. అతని అక్కగారు తమ్ముణ్ణి చూడవచ్చి యిల్లంతా సంభాళిస్తుంది. తమ్ముణ్ణి లోకంలో పడేయాలని చాలా తాపత్రయం పడుతుంది. 'శాంత' అనే పిల్లను రప్పిస్తుంది. తాను జీవితాన్నుంచి తప్పుకు తిరుగుతున్నానని రాజారావుకు తెలిసేవరకూ ఆమె ఎంత సున్నితంగా, సుసూక్ష్మం

గానో వ్యవహరిస్తుంది. రాజారావు లోకంలో, నలుగుర్లో పడతాడు. ఇదీ కథ.

ఈ చిన్న నవలలో రచయిత కొన్ని విషయాలను సూచించాడు. భావనాజగత్తులోనే విహరించే ప్రాణులు జీవితాన్నుంచి తప్పుకుంటున్నారనీ, నలుగురికీ సంఘానికీ పనికిరాకుండాపోతున్నారనీ, అక్కడా వారు ఏసుఖాన్నీ కాపుకోటం లేదనీ, వీరిని లోకంలో పడేయాలిసిన అవసరం ఎంతైనా ఉందనీను. ఎవరో ఒక శ్రద్ధాళువులు వొచ్చి తీరికగా చెయిచేసకుంటేతప్ప వీరు మన లోకంలోకి రారనీను. వీటిని తన పనివాడితనంతో రచయిత చదువరికి చేర్పుగా చెప్తాడు.

రచనావిధానంలో ఈ రచయితకు ప్రత్యేకత ఉన్నది. అతి స్తిమితంగా, తేలికగా చెప్తాడు. గజిబిజిగా చెప్పడు. చెప్పడంలో ఉన్న అమితమైన కాపీనంవల్ల, మరి యిక్కడ యింకొంచెం చెబితే బాగుండేది అనిపిస్తుంది. అయితే అది రచనావిధానంలోని సుగుణమేమో.

జ. రు.

ఆధునికప్రపంచచరిత్ర

రచయిత: డాక్టరు పి. శ్రీనివాసాచార్యులుగారు, యం. ఏ., పి. హెచ్. డి. (లండను), ప్రిన్సిపాలు, యస్. ఆర్. ఆర్. కాలేజి, బెజవాడ. ప్రకాశకులు: రావుబ్రదర్సు, తెనాలి అండ్ మదరాసు. వెల రూ. ౧-౮-౦.

క్రీ. శ. ౧౪౯౨లో అమెరికాదేశమును కనుగొన్న నాటినుండి మొన్న ౧౯౪౦ వరకుగల ఆధునిక ప్రపంచచరిత్ర యంతయు ఈగ్రంథములో తేటతెల్లముగను కరతలామలకముగా నిరూపింపబడియున్నది. నేటి యస్. యస్. యల్. సి. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వ్రాయబడియున్న ఈపుస్తకము వారికి చాల ఉపయోగకారిగా నున్నదనుటకు సందియమెంత మాత్రమును లేదు. రచనకు తోడు చిత్రములు, కూర్పు తీర్పులుకూడ అందముగానున్నవి.

ఉపయుక్త విద్య

రచయిత: యల్లాపంతుల జగన్నాథంగారు, బి. ఏ. ప్రాప్తిస్థానము: వెంకట్రామా అండ్ కో., బెజవాడ. వెల ౮ అణాలు.

హిందువుల కాదర్శరూపమైన విద్యావిధానమును సూచించు చిన్నగ్రంథము. ప్రాచీన భారతీయ విద్యావిధానమే ప్రశస్తమైనదని గ్రంథకర్తగారి వాదము; దానిని నిరూపించుటకే ఈ ప్రయత్నము.

ఆంధ్రజ్యోతి
(గాంధీజీ జన్మదినసంచిక)

గాంధీమహాత్ముని జీవితచరిత్రలోని వివిధవిషయములు వివిధాకారములనుండి సంగృహీతములయినవి మాత్రమే కాక శ్రీ వేలూరు శివరామశాస్త్రిగారు మొదలైన పెద్దలు రచించిన ప్రత్యేకవ్యాసములుకూడ ఈ సంచిక నలంకరించియున్నవి. వెల ౬ అణాలు. ప్రాప్తిస్థానము. ౮౩ ఆచారప్పన్‌వీథి, మద్రాసు.

గ్రంథ స్వీకారము

నాలుగు నాటికలు

కర్త: మారేమండ రామారావుగారు. ప్రకాశకులు: వెంకటరామా అండ్ కో., ఏలూరు. వెల రూపాయ.

Astrological Self-instructor

పదవ ముద్రణ. రచయిత: ప్రొఫెసరు బి. సూర్యనారాయణరావుగారు, బి. ఏ. ప్రకాశకులు: అస్ట్రొలాజికల్ ఆఫీసు, బసవనగుడి, బెంగుళూరు. వెల ౪ రూపాయలు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.

ఇండియన్ టీలలో అత్యుత్తమమైనది





చక్కని రుచి, ఘుమ ఘుమలాడే సువాసన, నేత్ర పర్వంగావుండే రంగు, తక్కువధర, వీటి అన్నింటి నిబట్టి లిప్టన్స్ టీ గర్ల్ మిగతా వాటిని తలదన్ని అత్యధిక గౌరవాన్ని తెచ్చుకున్నది.

లిప్టన్స్ టీ గర్ల్

మృదు మధురమైన ఇండియన్ డస్ట్ టీ

LTK 84 G